www.andhrajyothy.com


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

శుక్రవారం | 15-8-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 160 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం, తిథి: సప్తమి రా.11:50 తదుపరి అష్టమి, నక్షత్రం: అశ్వని ఉ.7:36 తదుపరి భరణి, వర్జ్యం: సా.4:36-6:06, దుర్ముహూర్తం: ఉ.8:32-9:23, మ.12:44-1:35, అమృతఘడియలు: రా.1:36-3:06, రాహుకాలం: ఉ.10:30-12:00, సూర్యోదయం: 6:01, సూర్యాస్తమయం: 6:37 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



న్యూఢిల్లీ: భారత్ మృత ఆర్థిక వ్యవస్థ అని నోరు పారేసుకున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఆ దేశానికే చెందిన ప్రముఖ అంతర్జాతీయ పరపతి రేటింగ్ సంస్థ 'ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్' గట్టి సమాధానం ఇచ్చింది. దీర్ఘకాలిక దృష్టితో చూస్తే భారత ఆర్థిక వ్యవస్థ పునాదులు చాలా పటిష్ఠంగా ఉన్నట్టు తెలిపింది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని భారత దేశ సార్వభౌమ పరపతి రేటింగ్‌ను 'బీబీబీ మైనస్' స్థాయి నుంచి 'బీబీబీ' స్థాయికి పెంచుతున్నట్టు ప్రకటించింది. గత 18 సంవత్సరాల్లో ఈ సంస్థ మన దేశ పరపతి రేటింగ్‌ను పెంచడం ఇదే మొదటిసారి. ట్రంప్ సుంకాల పోటు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా, హుషారుగా ఉన్నట్టు తెలిపింది. ఈ పరపతి రేటింగ్ పెంపుతో కేంద్ర ప్రభుత్వం, ప్రైవేటు కంపెనీలు తక్కువ వడ్డీకే విదేశాల నుంచి రుణాలు, నిధులు సమీకరించగలుగుతాయని భావిస్తున్నారు.

వృద్ధికి ఢోకా లేదు

ట్రంప్ సుంకాల కత్తి వేలాడుతున్నా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ వృద్ధి రేటుకు ఎలాంటి ఢోకా ఉండదని ఎస్ అండ్ పీ గ్లోబల్ అంచనా. గత ఆర్థిక సంవత్సరంలోలానే ఈ ఆర్థిక సంవత్సరం కూడా భారత ఆర్థిక వ్యవస్థ 6.5 శాతం వృద్ధి రేటు నమోదు చేస్తుందని తెలిపింది. తగ్గుతున్న వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణం ఇందుకు దోహదం చేస్తాయని పేర్కొంది.

పెట్టుబడులకు ఊతం!

పరపతి రేటింగ్ పెంపు విదేశాల నుంచి మన దేశం మరిన్ని పెట్టుబడులు ఆకర్షించేందుకూ దోహదం చేయనుంది. ఈ రేటింగ్ పెంపుతో మన దేశ మధ్య, దీర్ఘకాలిక అవకాశాలపై దేశ, విదేశీ పెట్టుబడిదారులకు మరింత నమ్మకం ఏర్పడనుంది. దీంతో ఎఫ్‌పీఐలతో పాటు విదేశీ కంపెనీలూ మన దేశంలో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తాయని భావిస్తున్నారు. ట్రంప్ సుంకాలతో అనిశ్చితిలో పడిన భారత ఆర్థిక వ్యవస్థకు ఈ పరపతి రేటింగ్ పెంపు పెద్ద ఊరట అని మద్రాస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ డైరెక్టర్ ఎన్ఆర్ భానుమూర్తి చెప్పారు. ఈ రేటింగ్స్ ప్రభావం ఫారెక్స్ మార్కెట్లో రూపాయి మారకం రేటు స్థిరపడేందుకూ దోహదం చేస్తుందని ఆర్థిక నిపుణుల అంచనా.

అమెరికా రేటింగ్ మాత్రం కిందికి..

డొనాల్డ్ ట్రంప్ అధికార పగ్గాలు చేపట్టిన మూడు నెలలకే అంటే మే నెలలో మూడీస్ రేటింగ్స్.. అమెరికా పరపతి రేటింగ్‌ను ట్రిపుల్ ఏ నుంచి డబుల్ 'ఏ'కు తగ్గించింది. అంతకుముందు ఫిచ్ రేటింగ్స్ కూడా 2023 ఆగస్టులో అమెరికా పరపతి రేటింగ్‌ను ట్రిపుల్ ఏ రేటింగ్ నుంచి డబుల్ ఏ రేటింగ్‌కు తగ్గించింది. అప్పటి నుంచే అమెరికాలో వడ్డీ రేట్లు గణనీయంగా పెరిగాయి. తాజాగా ట్రంప్ సుంకాల పోటు, అర్థంపర్థం లేని ఆర్థిక విధానాలతో అమెరికా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి వెళ్లే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కాగ్నిజెంట్‌లో 80% సిబ్బంది జీతం పెంపు

నవంబరు 1 నుంచి అమల్లోకి..

న్యూఢిల్లీ: ఈ ఏడాది నవంబరు 1 నుంచి 80 శాతం సిబ్బంది వేతనాన్ని పెంచనున్నట్లు నాస్‌డాక్ లిస్టెడ్ ఐటీ కంపెనీ కాగ్నిజెంట్ గురువారం ప్రకటించింది. సీనియర్ అసోసియేట్ లెవెల్ వరకు ఉద్యోగులకు వేతన పెంపు ఉండనుందని తెలిపింది. జీతం పెంపు శాతం ఉద్యోగి పనితీరు, ఏ దేశంలోని కార్యాలయంలో పనిచేస్తున్నాడనే ప్రాతిపదికన నిర్ణయించనున్నట్లు కాగ్నిజెంట్ అధికార ప్రతినిధి వెల్లడించారు. భారత్‌లో నిలకడగా మంచి పనితీరు కనబరుస్తున్న ఉద్యోగికి 9 శాతం వరకు జీతం పెరిగే అవకాశం ఉందన్నారు. టాప్ పెర్ఫార్మర్లకు అత్యధిక వేతన పెంపు లభించనుందన్నారు. ఈ ఏడాది ద్వితీయార్థంలో తమ ఉద్యోగులకు పనితీరు ఆధారంగా వేతనాలను పెంచాలను కుంటున్నట్లు గత నెల 31న రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగానూ కంపెనీ వెల్లడించింది. ఈ మార్చిలో కాగ్నిజెంట్ తన ఉద్యోగులకు గడిచిన మూడేళ్లలో అత్యధిక బోనస్‌ను ప్రకటించింది. కాగా, దేశీయ ఐటీ దిగ్గజం టీసీఎస్ కూడా గత వారంలో 80 శాతం సిబ్బందికి (జూనియర్ నుంచి మధ్య స్థాయి వరకు ఉద్యోగులకు) వేతన పెంపును ప్రకటించింది.

ఒరాకిల్‌లో 150కి పైగా ఉద్యోగాల కోత

అమెరికన్ ఐటీ కంపెనీ ఒరాకిల్ తన క్లౌడ్ విభాగం నుంచి 150కి పైగా ఉద్యోగులను తొలగించబోతున్నట్లు తెలిసింది. కంపెనీ తాజా నిర్ణయంతో యూఎస్‌తో పాటు భారత కార్యాలయాల్లోని ఈ విభాగ ఉద్యోగులపై ప్రభావం పడనుందని సమాచారం.

నవ లిమిటెడ్ లాభం రూ.399 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నవ లిమిటెడ్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,232.60 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.399.10 నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే ఆదాయం 2 శాతం, లాభం 10.5 శాతం తగ్గింది. అయితే గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంతో పోల్చితే మాత్రం ఆదాయం 16.7 శాతం, లాభం 31.8 శాతం వృద్ధి చెందింది. కాగా స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.572.70 కోట్ల ఆదాయంపై రూ.141 కోట్ల లాభాన్ని ప్రకటించింది. సమీక్షా త్రైమాసికంలో మెటల్స్ వ్యాపారంతో పాటు ఎనర్జీ పోర్టుఫోలియో పనితీరు మెరుగ్గా ఉండటం కలిసి వచ్చిందని కంపెనీ పేర్కొంది. అయితే జాంబియాలోని విద్యుత్ డివిజన్ మాంబా ఎనర్జీ లిమిటెడ్ (ఎంఈఎల్)కు సంబంధించి 50 శాతం ట్యాక్స్ కన్సెషన్స్ అమలు చేయటం కంపెనీపై కొంత మేర ప్రభావం చూపించిందని తెలిపింది.

యూపీఐ పీ2పీ కలెక్ట్ రిక్వెస్ట్‌లకు స్వస్తి

అక్టోబరు 1 నుంచి అమలు

న్యూఢిల్లీ: డిజిటల్ మోసాలను అరికట్టేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. ఏకీకృత చెల్లింపుల వ్యవస్థ (యూపీఐ)లో పీర్ టు పీర్ (పీ2పీ) కలెక్ట్ రిక్వెస్ట్‌లకు స్వస్తి పలుకుతున్నట్లు గురువారం ప్రకటించింది. ఈ అక్టోబరు 1 నుంచి బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్ల (పీఎస్‌పీ)తో పాటు ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం వంటి థర్డ్ పార్టీ డిజిటల్ పేమెంట్ యాప్‌లు.. యూపీఐలో పీ2పీ కలెక్ట్ రిక్వెస్ట్ లావాదేవీలను అనుమతించరాదని ఎన్‌పీసీఐ నిర్దేశించింది. తమ వ్యవస్థలో తదనుగుణంగా మార్పులు చేసుకోవాలని కోరింది. యూపీఐ వినియోగదారుల్లో ఒక వ్యక్తి మరో వ్యక్తి నుంచి నగదు కోరేందుకు పీ2పీ కలెక్ట్ రిక్వెస్ట్ ఫీచర్ వీలుకల్పిస్తుంది. ముఖ్యంగా స్నేహితులు లేదా సన్నిహితులు తమ మధ్య తిరిగి చెల్లింపులు లేదా బిల్లు చెల్లింపు భారాన్ని సమంగా పంచుకునేందుకు (స్ప్లిట్టింగ్ బిల్స్) దీన్ని విరివిగా వినియోగించుకుంటున్నారు. ప్రస్తుతం ఒక వ్యక్తి పీ2పీ కాల్ రిక్వెస్ట్ లావాదేవీ ద్వారా మరో వ్యక్తి నుంచి రూ.2,000 వరకు పొందే వీలుంది. రోజులో గరిష్ఠంగా 50 లావాదేవీలు నెరిపేందుకు అనుమతి ఉంది. అయితే, ఈ మార్గంలోనూ డిజిటల్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ఎన్‌పీసీఐ వీటిని నిలిపివేయాలని నిర్ణయించింది.

తగ్గిన అమరరాజా లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో రూ.164.8 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.249.12 కోట్లతో పోల్చితే లాభం 33 శాతం తగ్గింది. అధిక వ్యయాలే లాభాల క్షీణతకు కారణమని కంపెనీ తెలిపింది. సమీక్షా త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.3,263.05 కోట్ల నుంచి రూ.3,401.08 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు రూ.2,957.93 కోట్ల నుంచి రూ.3,190.66 కోట్లకు పెరిగాయి. ఉత్పత్తిలో వినియోగించిన వస్తువుల వ్యయాలు రూ.1,692.77 కోట్ల నుంచి రూ.1,800.68 పెరిగినట్టు కంపెనీ వెల్లడించింది. సమీక్షా కాలంలో లెడ్ యాసిడ్ బ్యాటరీలు, అనుబంధ ఉత్పత్తుల విభాగం రూ.3,279.79 కోట్లు, న్యూ ఎనర్జీ విభాగం రూ.121.29 కోట్ల ఆదాయం ఆర్జించాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,300▼	92,850 ▼	1,26,000▲
విజయవాడ	1,03,000 ▼	97,000 ▲	1,18,250 ▼
విశాఖపట్నం	1,03,010 ▲	93,750 ▼	1,26,000▲
రాజమండ్రి	1,01,350 ▼	92,900 ▼	1,18,800▲
ప్రొద్దుటూరు	1,00,950▲	92,870 ▲	1,17,700▲
ముంబై	1,00,023▲	91,621 ▲	1,14,933▼

జూలై ఎగుమతుల్లో 7% వృద్ధి

న్యూఢిల్లీ: ఎగుమతుల రంగం రెండు నెలల క్షీణతకు స్వస్తి పలికింది. జూలైలో ఎగుమతులు 7.29 శాతం వృద్ధితో 3,724 కోట్ల డాలర్లుగా (రూ.3.24 లక్షల కోట్లు) నమోదయ్యాయి. ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, వజ్రాభరణాలు, ఫార్మా, కెమికల్స్ రంగాలు ఈ వృద్ధికి ఊతం ఇచ్చాయి. అదే సమయంలో వాణిజ్య లోటు మాత్రం 8 నెలల గరిష్ఠ స్థాయి 2,735 కోట్ల డాలర్లకు (రూ.2.38 లక్షల కోట్లు) దూసుకుపోయింది. గత ఏడాది నవంబరులో నమోదైన వాణిజ్య లోటు 3,177 కోట్ల డాలర్ల (రూ.2.76 లక్షల కోట్లు) తర్వాత నమోదైన గరిష్ఠ స్థాయి ఇదే. గురువారం వాణిజ్య శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం దిగుమతులు 8.6% వృద్ధితో 6,459 కోట్ల డాలర్లకు (రూ.5.62 లక్షల కోట్లు) చేరాయి.

అమెరికాతో వాణిజ్యం అప్

ట్రంప్ సుంకాల నేపథ్యంలోనూ భారత్-అమెరికా దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం పెరుగుతోంది. జూలైలో మన దేశం అమెరికాకు 801 కోట్ల డాలర్ల విలువైన సరుకులు ఎగుమతి చేసి..ఆ దేశం నుంచి 455 కోట్ల డాలర్ల విలువైన సరుకులు దిగుమతి చేసుకుంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే జూలైలో భారత ఎగుమతులు 19.94 శాతం పెరగగా, దిగుమతులు 13.78 శాతం పెరిగాయని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లోనూ అమెరికాకు మన ఎగుమతులు 21.64 శాతం పెరిగి 3,353 కోట్ల డాలర్లకు చేరాయి. ఆ దేశం నుచి మన దేశానికి వచ్చే దిగుమతులూ 12.33 శాతం పెరిగి 1,741 కోట్ల డాలర్లకు చేరాయి.

మార్కెట్లో ఆద్యంతం ఊగిసలాటలే..

సెన్సెక్స్ 57 పాయింట్ల లాభంతో ముగింపు

ముంబై: స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు గురువారం ఆద్యంతం తీవ్ర ఊగిసలాటలకు లోనైనప్పటికీ, అతి స్వల్ప లాభాలను నమోదు చేయగలిగాయి. సెన్సెక్స్ 57.75 పాయింట్లు పెరిగి 80,597.66 వద్ద స్థిరపడింది. ఒక దశలో సూచీ 211 పాయింట్లు ఎగబాకి 80,751 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. నిఫ్టీ విషయానికొస్తే, 11.95 పాయింట్ల వృద్ధితో 24,631.30 వద్ద స్థిరపడింది. శుక్రవారం ట్రంప్-పుతిన్ భేటీ నేపథ్యంలో ఇన్వెస్టర్లు ముందు జాగ్రత్త ధోరణితో వ్యవహరించారని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో సగమే రాణించాయి. ఈ వారం మొత్తానికి సెన్సెక్స్ 739.87 పాయింట్లు (0.92 శాతం), నిఫ్టీ 268 పాయింట్లు (1.10 శాతం) లాభపడ్డాయి

నేడు మార్కెట్లకు సెలవు: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్టాక్ మార్కెట్లు బీఎస్ఈ,ఎన్ఎస్ఈలకు సెలవు. కమోడిటీ మార్కెట్లు కూడా పని చేయవు. వచ్చే సోమవారం మార్కెట్లు యధావిధిగా పనిచేస్తాయి.

● ప్రైవేట్ రంగంలోని ఫెడరల్ బ్యాంక్.. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా క్యాన్సర్ చికిత్స సంస్థలైన టాటా క్యాన్సర్ ఫౌండేషన్ (టీసీసీఎఫ్), అసోమ్ క్యాన్సర్ ఫౌండేషన్‌తో తిరుపతిలో ఒప్పందం కుదుర్చుకుంది. సంజీవని యునైటెడ్ ఎగెనెస్ట్ క్యాన్సర్ పేరుతో ఫెడరల్ బ్యాంక్ ఈ సీఎస్ఆర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఒప్పందంలో భాగంగా క్యాన్సర్ గుర్తింపు పరీక్షలు, చికిత్స కోసం వచ్చే బాధితులకు అవసరమైన ఆర్థిక సాయాన్ని అందించటం వంటి వాటిని చేపట్టనుంది.

● రెనో ఇండియా.. విజయవాడకు తన 'ఆర్' స్టోర్‌ను విస్తరించింది. వినియోగదారులకు మరింత చేరువయ్యే ఉద్దేశంతో సరికొత్త రూపంతో రెనో ఇండియా 21,270 చదరపు అడుగుల్లో ఈ మోడర్న్ రిటైల్ షోరూమ్‌ను ప్రారంభించింది. దేశంలో కంపెనీకిది ఆరో స్టోర్.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

15వ తేదీ			
హైదరాబాద్	485	విజయవాడ	520
వరంగల్	487	గోదావరి	510
చిత్తూరు	548	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	102	విజయవాడ	119
వరంగల్	102	గుంటూరు	121
కరీంనగర్	102	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	102	చిత్తూరు	95
కర్నూలు	102	నెల్లూరు	100
విశాఖపట్నం	113	అనంతపురం	100
గోదావరి	119		

స్పోర్ట్స్

దయచేసి మాతో ఆడొద్దు!



● ఆడితే చిత్తవుతాం
● పాక్ మాజీ క్రికెటర్ బాసిత్ అలీ

కరాచీ: త్వరలో జరిగే ఆసియాకప్ టీ20 టోర్నీలో భారత జట్టు తమతో మ్యాచ్‌ను బహిష్కరించాలని పాకిస్థాన్ మాజీ ఆటగాడు బాసిత్ అలీ కోరాడు. మంగళవారం జరిగిన మూడో వన్డేలో విండీస్ 202 పరుగుల తేడాతో పాక్‌ను చిత్తుగా ఓడించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో భారత్ చేతిలోనూ తమ జట్టుకు చావుదెబ్బ తప్పదని చెప్పాడు. 'ఆసియాకప్‌లో పాక్‌తో మ్యాచ్ ఆడకుండా భారత్ నిర్ణయం తీసుకోవాలని ప్రార్థిస్తున్నా. ఇటీవలి వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ మాదిరే మా జట్టుతో ఆటను వారు బహిష్కరించాలి. ఎందుకంటే టీమిండియా పాక్ జట్టును ఎంత ఘోరంగా ఓడిస్తుందో ఆలోచిస్తేనే వణుకు పుడుతోంది. అఫ్ఘాన్ చేతిలో ఓడితే ఎవరూ పట్టించుకోరేమో కానీ భారత్‌పై ఓటమిని పాక్‌లో జీర్ణించుకోలేరు' అని బాసిత్ తమ జట్టు ఆటగాళ్ల పేలవ ఫామ్‌పై వ్యంగ్యంగా స్పందించాడు.

నా శిష్యుల్లో కోహ్లీ బెస్ట్



● రవిశాస్త్రి

న్యూఢిల్లీ: తాను శిక్షణ ఇచ్చిన టీమిండియా ఆటగాళ్లలో విరాట్ కోహ్లీ అత్యుత్తమ ప్లేయర్ అని రవిశాస్త్రి ప్రశంసించాడు. 2017-2021 వరకు భారత జట్టు కోచ్‌గా శాస్త్రి వ్యవహరించాడు. కోహ్లీ అద్భుత ప్రదర్శన కారణంగానే తన హయాంలో భారత్ టెస్టుల్లో టాప్ టీమ్‌గా నిలిచిందని చెప్పాడు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్‌లో కొన్ని మ్యాచ్‌ల్లో కోహ్లీ ప్రదర్శన నమ్మశక్యం కాని రీతిలో ఉందన్నాడు. ధోనీ రిటైర్మెంట్ తర్వాత జట్టును నడిపించే నాయకత్వ లక్షణాలు కోహ్లీలోనే చూశానని తెలిపాడు. బ్యాటర్‌గా తన బాధ్యతలు నిర్వహిస్తూనే.. జట్టు గెలుపు కోసం తుదికంటా పోరాడేవాడని కితాబిచ్చాడు.

45 ఏళ్ల వీనస్‌కు వైల్డ్‌కార్డ్

యూఎస్ ఓపెన్



న్యూయార్క్: లేటు వయసులో యూఎస్ ఓపెన్ సింగిల్స్ వైల్డ్‌కార్డ్ అందుకొన్న ప్లేయర్‌గా అమెరికా వెటరన్ వీనస్ విలియమ్స్ (45) రికార్డులకెక్కింది. ఈ నెల 24 నుంచి జరగనున్న యూఎస్ ఓపెన్‌కు సంబంధించిన వైల్డ్‌కార్డ్ ఎంట్రీలను నిర్వాహకులు ప్రకటించారు. రెండేళ్ల విరామం తర్వాత వీనస్ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ బరిలోకి దిగనుంది. ఈ క్రమంలో 1981లో రెనీ రిచర్డ్స్ (47) తర్వాత సింగిల్స్ వైల్డ్‌కార్డ్ అందుకొన్న పెద్ద వయసు ప్లేయర్‌గా విలియమ్స్ నిలిచింది. పురుషుల సింగిల్స్‌లో భారత సంతతికి చెందిన అమెరికా ఆటగాడు నిశేష్ బసవారెడ్డి (20)కి కూడా వైల్డ్‌కార్డ్ లభించింది. నెల్లూరు జిల్లాకు చెందిన నిశేష్ తండ్రి...మురళీకృష్ణ 1999లో అమెరికా వెళ్లి స్థిరపడ్డారు.



బసవారెడ్డి

మధుర జ్ఞాపకం

సచిన్ తొలి శతకానికి 35 ఏళ్లు



ముంబై: సచిన్ టెండూల్కర్..24 ఏళ్ల సుదీర్ఘ క్రికెట్ కెరీర్‌లో నెలకొల్పిన రికార్డులు ఎన్నో..అందుకున్న ఘనతలు మరెన్నో.. 664 అంతర్జాతీయ మ్యాచ్‌లలో 34,357 పరుగులు, 100 సెంచరీలు. ఈ శతకాలకు పునాది పడింది 35 ఏళ్ల కిందట..1990 ఆగస్టు 14న ఓల్డ్‌ట్రాఫర్డ్ మైదానంలో. తొలి సెంచరీ ఏ క్రికెటర్‌కైనా ఎంతో అపురూపం. పైగా..ఆ శతకం జట్టును ఓటమి కోరలనుంచి తప్పించినదైతే ఆ థ్రిల్లే వేరు కదా! ఇంగ్లండ్‌తో మూడు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా ఓల్డ్‌ట్రాఫోర్డ్ రెండో టెస్ట్‌కు వేదికైంది. ఆ టెస్ట్ సచిన్‌కు తొమ్మిదవది. ఆ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 68 పరుగులు చేసిన 17 ఏళ్ల టెండూల్కర్..408 పరుగుల లక్ష్యంతో చివరి రోజు 103/4తో జట్టు క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న దశలో ఆరో నెంబర్‌లో క్రీజులోకి వచ్చాడు. బంతి రివ్వుమని దూసుకొస్తూ బ్యాటర్లకు దడ పుట్టిస్తోంది. ఈ తరుణంలో దుర్భేధ్యమైన డిఫెన్స్ ఆటతో ఇంగ్లండ్ బౌలర్లకు ఎదురొడ్డాడు. ఓ పక్క సహచరులు అవుటవుతున్నా వెరవలేదు. చూడముచ్చటైన బౌండరీలతో ఆకట్టుకొని సెంచరీ సాధించిన సచిన్ (189 బంతుల్లో 17 ఫోర్లతో 119 నాటౌట్) మనోజ్ ప్రభాకర్ (67 నాటౌట్) జతగా మ్యాచ్‌ను డ్రా (343/6) చేయగలిగాడు.

ఒలింపిక్స్ హాకీ కాంస్య విజేత, లియాండర్ తండ్రి వేస్ పేస్ మృతి



లియాండర్



కోల్‌కతా: టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ తండ్రి, హాకీ మాజీ ఆటగాడు వేస్ పేస్ (80) మరణించాడు. పార్కిన్సన్ వ్యాధితో బాధపడుతున్న వేస్ పేస్‌ను గత మంగళవారం ఇక్కడి ఓ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. విదేశాలలో స్థిరపడిన వేస్ పేస్ కుమార్తెలు వచ్చాక ఆయన అంత్యక్రియలు సోమ లేదా మంగళవారం జరపనున్నట్టు కుటుంబ సభ్యులు వెల్లడించారు. వేస్ పేస్ భార్య జెన్నిఫర్ భారత బాస్కెట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్. భారత క్రీడా రంగంతో వేస్ పేస్‌కు సుదీర్ఘ అనుబంధం ఉంది. మిడ్‌ఫీల్డర్‌గా జాతీయ హాకీ జట్టుకు సేవలందించాడు. 1971 బార్సిలోనా వరల్డ్ కప్, 1972 మ్యూనిచ్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకాలు గెలుపొందిన భారత జట్లలో పేస్ సభ్యుడు. ఫుట్‌బాల్, క్రికెట్, రగ్బీ క్రీడలలోనూ పేస్‌కు ప్రవేశం ఉంది. డివిజన్ స్థాయిలో ఆ మూడు క్రీడలకు అతడు ప్రాతినిధ్యం వహించాడు. 1945లో గోవాలో జన్మించిన వేస్ పేస్ ఆటలతోపాటు చదువులోనూ ఎంతో ప్రతిభావంతుడు. హాకీ నుంచి రిటైర్ అయ్యాక స్పోర్ట్స్ మెడిసిన్ డాక్టర్‌గా మారాడు. ఆసియా క్రికెట్ కౌన్సిల్, బీసీసీఐ, భారత డేవిస్ కప్ జట్టుకు కన్సల్టెంట్ డాక్టర్‌గా వ్యవహరించాడు. కుమారుడు లియాండర్ పేస్‌కు మేనేజర్‌గానూ బాధ్యతలు నిర్వర్తించాడు. కుటుంబ వారసత్వాన్ని కొనసాగిస్తూ లియాండర్ పేస్ 1996 అట్లాంటా ఒలింపిక్స్ టెన్నిస్ సింగిల్స్‌లో కాంస్యం నెగ్గడం విశేషం.. దేశ క్రీడా రంగానికి వేస్ పేస్ అందించిన సేవలు వెల కట్టలేనివని అంటూ ఆయన మృతికి టెన్నిస్ మాజీ ఏస్ సానియా మీర్జా సంతాపం తెలిపింది.

పెళ్లి పీటలెక్కనున్న అర్జున్



ముంబై: దిగ్గజ బ్యాటర్ సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్ త్వరలోనే పెళ్లి పీటలెక్కనున్నాడు. స్థానిక పారిశ్రామికవేత్త రవి ఘాయ్ మనవరాలు సానియా చందోక్‌తో అర్జున్ (25)కు ఈనెల 11న నిశ్చితార్థం జరిగింది. ముంబైలోని సానియా స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఇరువురి కుటుంబ సభ్యులు మాత్రమే హాజరయ్యారట. అయితే ఈ విషయమై ఇరు కుటుంబాల నుంచి ఎటువంటి ప్రకటనా రాలేదు. మరోవైపు ఈ సానియా గురించి అభిమానులు నెట్టింట తెగ శోధిస్తున్నారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో చదువుకున్న తను పెంపుడు జంతువుల కోసం ముంబైలో స్పా అండ్ స్టోర్‌ను నిర్వహిస్తోంది. అలాగే ప్రపంచ ప్రఖ్యాత బాస్కిన్-రాబిన్స్ ఐస్‌క్రీమ్‌కు సంబంధించి భారత్‌లో వ్యవహారాలను వీరి కుటుంబానికి చెందిన గ్రావిస్ గ్రూప్ చూస్తోంది. ఇంకా బ్రూక్లిన్ క్రీమరీ ఐస్‌క్రీమ్‌తో పాటు ఇంటర్ కాంటినెంటల్ హోటల్స్ కూడా వీరి సొంతమే. రియల్ ఎస్టేట్‌లోనూ రవి ఘాయ్‌కు చెందిన గ్రూప్ ప్రముఖ పాత్ర పోషిస్తోంది.

చెన్నై గ్రాండ్ మాస్టర్స్ విజేత విన్సెంట్

అర్జున్ టైటిల్ ఆశలు ఆవిరి

చెన్నై: జర్మనీ గ్రాండ్ మాస్టర్ విన్సెంట్ కీమర్.. మరో రౌండ్ మిగిలుండగానే చెన్నై గ్రాండ్ మాస్టర్స్ టోర్నీ టైటిల్‌ను సొంతం చేసుకొన్నాడు. గురువారం జరిగిన ఎనిమిదో రౌండ్‌ను డ్రా చేసుకొన్న విన్సెంట్ మొత్తం ఆరు పాయింట్లతో టాప్‌లో నిలిచాడు. సహచరుడు విదిత్ గుజరాతీతో గేమ్‌ను జీఎం అర్జున్ ఇరిగేసి డ్రా చేసుకొన్నాడు. దీంతో అగ్రస్థానంలో నిలిచే అవకాశాన్ని ఇరిగేసి కోల్పోయాడు. సహచరులు కార్తికేయన్ మురళీ, నిహాల్ సరీన్ మధ్య గేమ్ కూడా డ్రాగా ముగిసింది. అర్జున్, కార్తికేయన్ చెరో 4.5 పాయింట్లతో రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. శుక్రవారం తొమ్మిదో, ఆఖరి రౌండ్ జరగనుంది. చాంపియన్స్ విభాగంలో ప్రనేష్ చేతిలో జీఎం ద్రోణవల్లి హారిక, ఆర్యన్ చోప్రా చేతిలో వైశాలి పరాజయం పాలయ్యారు.

ర్యాపిడ్‌లో గుకేష్‌కు 4వ స్థానం



సెయింట్ లూయిస్ (యూఎస్): వరల్డ్ చెస్ టూర్‌లో భాగంగా జరుగుతున్న సెయింట్ లూయిస్ ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ టోర్నీలో ర్యాపిడ్ రౌండ్‌లు ముగిసే సరికి వరల్డ్ చాంపియన్ గుకేష్ దొమ్మరాజు నాలుగో స్థానంలో నిలిచాడు. 9 రౌండ్ల ర్యాపిడ్‌లో గుకేష్ నాలుగు గేమ్‌లు గెలిచి.. రెండు గేమ్‌లను డ్రా చేసుకొన్నాడు. మొత్తం 10 పాయింట్లతో నాలుగో స్థానం దక్కించుకొన్నాడు. అమెరికా జీఎం ఫాబినో కరువానా 14 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు.

మ్యాచ్‌ల ఎంపిక సరికాదు

బుమ్రాపై అజర్ అసంతృప్తి



న్యూఢిల్లీ: అండర్సన్-టెండూల్కర్ సిరీస్‌లో పేసర్ బుమ్రా అన్ని టెస్టులూ ఆడకపోవడంపై విమర్శలు కొనసాగుతూనే ఉన్నాయి. పని ఒత్తిడి కారణంగా తను కీలక మ్యాచ్‌లకు దూరమయ్యాడు. తాజాగా మాజీ కెప్టెన్ అజరుద్దీన్ కూడా ఇదే విషయమై అసంతృప్తిని వ్యక్తం చేశాడు. 'ఒక్కసారి జట్టులోకి వస్తే ఫలానా మ్యాచ్‌లే ఆడతానని ఎంపిక చేసుకోవడం కుదరదు. పని ఒత్తిడి అనేది ఉంటుంది. అయినా అంతర్జాతీయ స్థాయిలో ఆడుతున్నప్పుడు ఎవరికి వారే దీన్ని ఎదుర్కోవాలి. టెస్టు సిరీస్‌లో పేసర్లు సిరాజ్, ప్రసిద్ధ్, ఆకాశ్ రాణించడం జట్టు అదృష్టం. ఒకవేళ ఏదైనా క్లిష్ట సమయాల్లో బుమ్రా అవసరం ఏర్పడి ఉంటే పరిస్థితి ఎలా ఉండేది? గాయమైన సందర్భాల్లో మ్యాచ్‌కు దూరం కావడంపై బోర్డు, ఆటగాడు కలిసి నిర్ణయం తీసుకోవాలి' అని అజర్ సూచించాడు.



'బైపాస్' కాలేదు అడ్డంకి..

నాలుగు స్వర్ణాలతో ఔరా !

జాతీయ పవర్ లిఫ్టింగ్‌లో 73 ఏళ్ల శంకర్ రావు సంచలనం



కోజికోడ్: ఆయన వయస్సు 73 సంవత్సరాలు.. ఆరు నెలల కిందటే బైపాస్ సర్జరీ అయ్యింది.. సాధారణంగా అంత పెద్ద ఆపరేషన్ అయితే మరెవరైనా విశ్రాంతికే పరిమితమవుతారు..కానీ ఆయన అలా కూర్చోలేదు.. అప్పటిదాకా పెద్దగా పరిచయంలేని పవర్‌లిఫ్టింగ్‌లోకి అడుగుపెట్టారు..కోజికోడ్ ఆతిథ్యమిచ్చిన జాతీయ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్స్‌లో ఏకంగా నాలుగు స్వర్ణాలు సాధించి చరిత్ర సృష్టించారు..ఆయనే భద్రాచలానికి చెందిన డీవీ శంకర్ రావు. ఎస్‌బీఐలో ఉద్యోగం చేసి రిటైరైన ఆయన జాతీయ పోటీల 83 కిలోల మాస్టర్-4 విభాగంలో బరిలోకి దిగారు. వ్యక్తిగత విభాగాలలో మూడు, ఓవరాల్ చాంపియన్‌గా మరొకటి కలిపి మొత్తం నాలుగు పసిడి పతకాలు కొల్లగొట్టి అబ్బురపరిచారు. బైపాస్ సర్జరీ అయ్యాక పోటీలలో పాల్గొనడంతో పాటు నాలుగు పసిడి పతకాలు సొంతం చేసుకోవడం జాతీయ పవర్ లిఫ్టింగ్ చరిత్రలో తొలిసారని పవర్ లిఫ్టింగ్ వర్గాలు వెల్లడించాయి.

www.andhrajyothy.com

గుంటూరు సిటీ

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

శుక్రవారం | 15-8-2025

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జగన్ కోటపై టీడీపీ జెండా

సొంత జిల్లాలో దిమ్మతిరిగే తీర్పు

రెండు జడ్పీటీసీ ఉప ఎన్నికల్లోనూ చిత్తు

పులివెందులలో వైసీపీ డిపాజిట్ గల్లంతు

టీడీపీ అభ్యర్థి లతారెడ్డికి **6,033** ఓట్ల భారీ ఆధిక్యత

ఒంటిమిట్టలో వైసీపీ కుదేల్

దేశం అభ్యర్థి ముద్దుకృష్ణారెడ్డి జయకేతనం



పులివెందుల జడ్పీటీసీగా గెలుపొందిన మారెడ్డి లతారెడ్డిని ఎత్తుకుని సంబరాలు చేసుకుంటున్న టీడీపీ మహిళా కార్యకర్తలు

కడప, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : జడ్పీటీసీ ఉప ఎన్నికలు జరిగిన పులివెందుల, ఒంటిమిట్టలో వైసీపీకి ఓటరు దిమ్మతిరిగే తీర్పునిచ్చాడు. జగన్ అడ్డా పులివెందులలో వైసీపీ అభ్యర్థికి డిపాజిట్ కూడా రాలేదు. ఒంటిమిట్టలో ఘోర ఓటమిని ఆ పార్టీ మూటగట్టుకుంది. ఈ రెండు చోట్లా తెలుగుదేశం జెండా రెపరెపలాడింది. సొంత జిల్లాలోనే వైఎస్ జగన్‌కు ఈ ఫలితాలు షాక్ ఇచ్చాయి. గురువారం జరిగిన బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో తొలినుంచీ టీడీపీ దూసుకెళ్లింది. ప్రతి రౌండ్‌లో దూకుడు ప్రదర్శించింది. ఎమ్మెల్యే జగన్ సొంత నియోజకవర్గమైన పులివెందులలో వైసీపీని చిత్తు చేసింది. వైసీపీ అభ్యర్థి తుమ్మల హేమంత్ రెడ్డిపై టీడీపీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి 6,033 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఈ జడ్పీటీసీ పరిధిలో మొత్తం 10,601 ఓట్లు ఉండగా, 7,794 ఓట్లు పోల్ అయ్యాయి. ఇందులో లతా రెడ్డికి 6,716 ఓట్లు పోల్ అయ్యాయి. వైసీపీ అభ్యర్థి

మిగతా 13వ పేజీలో...



పులివెందుల జడ్పీటీసీ సభ్యురాలిగా ఎన్నికల అధికారి నుంచి డిక్లరేషన్ అందుకుంటున్న మారెడ్డి లతారెడ్డి

కూలిన జగన్ సామ్రాజ్యం



30 ఏళ్లుగా వైఎస్ ఫ్యామిలీ అడ్డా

నిన్నటిదాకా పులివెందుల వన్‌సైడే

జడ్పీటీసీ ఉప ఎన్నికలతో సీన్ రివర్స్

కూల్‌గా గెలిచేస్తాం అనుకున్న స్థానం

జగన్ స్వయంకృతాలతో బలపడ్డ టీడీపీ

రాజశేఖర్‌రెడ్డి, వివేకా ఉండగా క్యాడరే సైన్యం

జగన్ తీరుతో సడలుతూ వచ్చిన ఆ బంధం

ఎన్నికలముందు టీడీపీలోకి వైసీపీ క్యాడర్

వైఎస్ ఊళ్లుగా పేరుబడ్డ చోటా టీడీపీకే ఓటు

పెద్దగా ఘర్షణలు లేకుండా పోలింగ్ ప్రశాంతం



ఆస్పత్రిలో ఓ బాధితురాలు



జమ్మూ కశ్మీర్‌లోని చోసితి గ్రామం వద్ద వెలికితీసిన మృతదేహాలు

కశ్మీరులో వరద కల్లోలం

భారీ మేఘ విస్ఫోటం.. మెరుపు వరదల్లో 46 మంది దుర్మరణం

200 మందికి పైగా గల్లంతు!

మృతుల్లో ఇద్దరు సీఐఎస్‌ఎఫ్ జవాన్లు 2

కిష్త్వార్ జిల్లాలోని చోసితి గ్రామంలో ఘటన

మాచైల్ మాతా యాత్రికులకిది బేస్‌పాయింట్

మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం

వరదల్లో కొట్టుకుపోయిన భక్తుల టెంట్లు, షాపులు

120 మందిని కాపాడిన సహాయక సిబ్బంది

గాయపడ్డవారిలో 28 మంది పరిస్థితి విషమం

ఘటన అత్యంత బాధాకరం: రాష్ట్రపతి, ప్రధాని

పొలం చెరువైంది!

రాష్ట్రంలో 68,441 హెక్టార్లలో నీట మునిగిన పంటలు

వర్షాలు, వరదలతో రైతన్నకు కష్టం 11





65 లక్షల మంది పేర్లు వెల్లడించండి

ఓటర్ల జాబితా నుంచి ఎందుకు తొలగించారు?.. కారణాలు చెప్పండి

బిహార్‌లో జాబితా నుంచి తొలగించిన ఓటర్ల విషయంలో ఈసీకి సుప్రీం ఆదేశం

19వ తేదీలోగా ఈసీ వెబ్‌సైట్లలో ప్రచురించాలి

బ్లాక్‌డెవలప్‌మెంట్/పంచాయతీ ఆఫీసుల్లోనూ నోటీసుబోర్డుపై ఆ జాబితాను అతికించాలి

మళ్లీ దరఖాస్తు చేసుకునేవారు సమర్పించే పత్రాల్లో ఒకటిగా ఆధార్‌నూ పరిగణించాలి

వెబ్‌సైట్‌లో ప్రచురించే జాబితా.. ఓటర్ ఐడీతో వెతుక్కోగలిగేలా ఉండాలి: సుప్రీం ధర్మాసనం

2

'ఓటు చౌర్యం'పై..

బిహార్ నుంచి రాహుల్ సమరం

17 నుంచి ఓటర్ అధికార్ యాత్ర

సెప్టెంబరు 1న పట్నా గాంధీ మైదానంలో ముగింపు

'ఓటు చౌర్యం' అనే నీచ పదాన్ని వాడొద్దు: ఈసీఐ

నైరాశ్యంలో రాహుల్ గాంధీ: రవిశంకర్ ప్రసాద్

నేటి నుంచే 'ఉచిత ప్రయాణం'

బెజవాడలో 'స్త్రీ శక్తి' పథకాన్ని ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

బస్సుల్లో ఆధార్, రేషన్, ఓటర్ కార్డుల్లో ఏదొకటి చూపిస్తే 'జీరో ఫేర్' టికెట్

2.62 కోట్ల మంది మహిళలకు ప్రతి నెలా రూ.3 వేల వరకూ ఆదా

తల్లికి వందనం, దీపం-2 తర్వాత మహిళలకు మూడో పథకం అమలు



12



ఆదాయార్జనపై మరింత శ్రద్ధ

కేంద్ర నిధులు, పన్నుల్లో వాటాపై దృష్టి

అధికారులకు చంద్రబాబు నిర్దేశం

ప్రతి నీటి బొట్టునూ సంరక్షించాలి

నీటి వనరులతో భూగర్భ జలాలు పెరుగుతాయి

జల సంరక్షణలో సాగునీటి సంఘాలకు భాగస్వామ్యం

జల నిర్వహణపై జిల్లాలవారీగా రేటింగ్ ఇస్తాం: సీఎం

ఆపరేషన్ సిందూర్ చరిత్రాత్మకం

- సైనికుల వ్యూహాత్మక, సాంకేతిక సామర్థ్యమిది
- స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో రాష్ట్రపతి ముర్ము



న్యూఢిల్లీ, ఆగస్టు 14: ఉగ్రవాదంపై పోరులో ఆపరేషన్ సిందూర్ చరిత్రాత్మక ఘటనగా నిలిచిపోతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్మ కొనియాడారు. పహల్గాం ఉగ్ర దాడికి నిర్ణయాత్మకంగా బదులిచ్చామని, ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం దేశ ఐక్యతను చాటి చెప్పిందని వ్యాఖ్యానించారు. శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకొంటున్న వేళ జాతిని ఉద్దేశించి గురువారం ఆమె ప్రసంగించారు. పహల్గాంలో అమాయక పౌరులను చంపడాన్ని అమానవీయ, పిరికిపంద చర్యగా అభివర్ణించారు. అవినీతి, వంచన ప్రజాస్వామ్య ఉత్పత్తులు కారాదని జాతిపిత మహాత్మ గాంధీ ఆశించారని, దేశం నుంచి అవినీతిని పారదోలాలన్న గాంధీజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారు.

4 రోజుల్లో భారత్ అహాన్ని అణిచివేశాం: పాక్

ఇస్లామాబాద్, ఆగస్టు 14: పహల్గాం ఉగ్రదాడికి బదులుగా పాక్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా మే 7న భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ అంశంలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారతదేశ అహంకారాన్ని నాలుగు రోజుల్లోనే అణిచివేశామని ప్రకటించారు. మే నెలలో భారత్-పాక్ మధ్య జరిగిన సైనిక చర్య తమకు లభించిన గొప్ప విజయమని పేర్కొన్నారు. భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణకు కృషి చేశారంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. పాకిస్థాన్ 79వ స్వాతంత్ర్య దినోత్సవం(ఆగస్టు 14) నేపథ్యంలో బుధవారం రాత్రి ఇస్లామాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో షెహబాజ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అణ్వాయుధ సామర్థ్యం కలిగిన భారత్‌ను ఎదుర్కొనే విషయంలో తమ అణు సామర్థ్యం వ్యూహాత్మకంగా కీలక పాత్ర పోషించిందని తెలిపారు.

మోదీతో హాట్‌లైన్ టచ్ లేదని బైబిల్‌పై ప్రమాణం చేస్తారా?

- తెరవెనుక పొత్తులకు జగనే బ్రాండ్: షర్మిల

విజయవాడ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ఒక పార్టీ, దానికి జగన్ ఒక నాయకుడా?' అంటూ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'దేశ ప్రజల హక్కుల కోసం రాహుల్ పోరాడుతున్నారు. ఆయనది రాజ్యాంగాన్ని కాపాడే పోరాటం. అటువంటి రాహుల్‌తో చంద్రబాబుకు హాట్‌లైన్ సంబంధాలున్నాయి అనడం హాస్యాస్పదం. పచ్చకామెర్లు కమ్మినోడికి లోకమంతా పచ్చగా కనిపిస్తుందన్నట్టు జగన్ తీరు ఉంది' అని షర్మిల ఎద్దేవా చేశారు. ఓట్ల చోరీకి సంబంధించి కాంగ్రెస్ దేశవ్యాప్తంగా చేస్తున్న ఆందోళనల్లో భాగంగా విజయవాడలో గురువారం రాత్రి కాంగ్రెస్ కార్యకర్తలు కాగడాల ర్యాలీ నిర్వహించారు. 'తెరవెనుక పొత్తులకు జగన్ బ్రాండ్ కాబట్టే.. బీజేపీతో తెరవెనుక పొత్తు పెట్టుకున్నారు. అయ్యా జగన్ గారు.. రాహుల్‌తో చంద్రబాబుకు ఎటువంటి హాట్‌లైన్ లేదని మేం హామీ ఇవ్వగలం. మోదీ, అమిత్ షాతో మీకు హాట్‌లైన్ టచ్ లేదని బైబిల్ మీద ప్రమాణం చేస్తారా?' అని ప్రశ్నించారు. 'రాష్ట్రానికి బీజేపీ అన్యాయం చేస్తుంటే వైసీపీ ఎంపీలు ఎందుకు మౌనం వహిస్తున్నారు?' అని షర్మిల ప్రశ్నించారు. ఎలక్షన్ కమిషన్ మోదీ ఏజెంటని, మోదీ చెప్పుచేతల్లో ఉందని షర్మిల ఆరోపించారు.



కాగడాల ర్యాలీలో పాల్గొన్న షర్మిల

కశ్మీరులో వరద కల్లోలం



బండరాళ్ల కింద చిక్కుకున్న వారిని వెలికితీస్తున్న స్థానికులు, సహాయ సిబ్బంది

మెరుపు వరదలకు 46 మంది మృతి!

జమ్ము, ఆగస్టు 14: జమ్మూకశ్మీరులో మేఘవిస్ఫోటం (క్లౌడ్ బరస్ట్)తో భారీగా ప్రాణ నష్టం సంభవించింది. కిష్ట్వార్ జిల్లాలోని మారుమూల గ్రామం చోసితిలో గురువారం హఠాత్తుగా మేఘవిస్ఫోటం జరగడంతో మెరుపు వరదలు వచ్చాయి. మాచైల్ మాత ఆలయానికి వెళ్లే యాత్రికులకు ఈ గ్రామమే బేస్ పాయింట్. ఇక్కడ యాత్రికుల కోసం లంగర్ (సామూహిక వంటశాలలు) ఏర్పాటు చేస్తారు. భక్తులు ఇక్కడే వాహనాలు వదిలి, కాలినడకన మాచైల్ మాత గుడికి వెళ్తారు. గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా మెరుపు వరదలు రావడంతో భక్తుల టెంట్లు, దుకాణాలు, వసతి సౌకర్యాలు, సెక్యూరిటీ అవుట్ పోస్టులన్నీ కొట్టుకుపోయాయి. ఈ విషాద ఘటనలో 46 మంది మరణించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉందని అధికారులు చెబుతున్నారు. శిథిలాలు, బురద కింద మరింత మంది చిక్కుకొని ఉంటారని భావిస్తున్నట్లు తెలిపారు. ఘటనా స్థలంలో పెద్ద ఎత్తున సహాయక చర్యలు చేపట్టి 167 మందిని కాపాడగా.. వారిలో 38 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు వెల్లడించారు. 200 మందికి పైగా గల్లంతైనట్లు భావిస్తున్నారు. మృతుల్లో ఇద్దరు సీఐఎస్ఎఫ్ సిబ్బంది కూడా ఉన్నారని చెప్పారు. ఘటనా స్థలంలో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, పోలీసులు, ఆర్మీ, స్థానిక వాలంటీర్లు ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. చోసితి గ్రామంలో ఎటు చూసినా భయానక దృశ్యాలే కనిపిస్తున్నాయి. హఠాత్తుగా వచ్చిన వరదలకు దాదాపు గ్రామమంతా తుడిచిపెట్టుకుపోయింది. మృతదేహాలు, క్షతగాత్రులతో ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది. గత నెల 25న మొదలైన మాచైల్ మాతా యాత్రలో భాగంగా చోసితి నుంచి భక్తులు కాలినడకన 8.5 కి.మీ. మేర కొండలు ఎక్కుతూ 9500 అడుగుల ఎత్తులో ఉన్న ఈ గుడికి చేరుకోవాల్సి ఉంటుంది. కిష్ట్వార్ పట్టణానికి 90 కి.మీ. దూరంలో చోసితి ఉంటుంది. బేస్ పాయింట్‌లో



బురదలో కొట్టుకొచ్చిన మృతదేహం

మెరుపు వరదలు సంభవించిన వెంటనే కిష్ట్వార్ డిప్యూటీ కమిషనర్ పంకజ్‌కుమార్ శర్మ రంగంలోకి దిగారు. సహాయక బృందాలను అక్కడికి తరలించడంతో పాటు ఆయన స్వయంగా ఘటనా స్థలానికి వెళ్లారు. "కిష్ట్వార్‌లోని చోసితిలో మెరుపు వరదలు వచ్చాయి. మాచైల్ మాతా యాత్రకు బేస్ క్యాంప్ కావడంతో పెద్ద ఎత్తున భక్తులు ఉంటారు. భారీగా ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉంది. అధికారులు తక్షణమే రంగంలోకి దిగారు. నా కార్యాలయానికి నిరంతరం సమాచారం అందజేస్తున్నారు" అని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఇప్పటికే చోసితికి తరలి వెళ్లాయని, అదనపు బృందాలు, హెలికాప్టర్లను సిద్ధం చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. సహాయక చర్యల్లో సైన్యాన్ని కూడా రంగంలోకి దించారు. 300 మంది సైనికులు చోసితిలో సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు అధికారులు తెలిపారు.

ఎల్జీ, సీఎంతో మాట్లాడిన అమిత్ షా

కిష్ట్వార్‌లో మెరుపు వరదల ఘటనపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా జమ్మూకశ్మీరు లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ), సీఎంలతో మాట్లాడారు. సహాయక చర్యలను ముమ్మరం చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని చెప్పారు. కాగా, చోసితి గ్రామంలో సహాయక చర్యలు ముమ్మరంగా జరుగుతున్నాయని ఎల్జీ మనోజ్ సిన్హా తెలిపారు.

మాచైల్ యాత్ర నిలిపివేత

మాచైల్ మాతా మందిరం సముద్ర మట్టానికి సుమారు 2,800 మీటర్ల ఎత్తులో ఉంది. గత నెల 25న మొదలైన ఈ యాత్రకు జమ్మూ డివిజన్ నుంచి వేల సంఖ్యలో భక్తులు వచ్చారు. ఈ పెను విషాదం నేపథ్యంలో మాచైల్ యాత్రను నిలిపివేశారు. చోసితిలో మెరుపు వరదలతో జమ్మూకశ్మీరు అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రజలు, భక్తులకు సహాయం అందించేందుకు కంట్రోల్ రూమ్, హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసింది. కాగా, జమ్మూకశ్మీరులోని రాజౌరి తదితర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. రియాసి జిల్లాలోని వైష్ణో దేవి ఆలయానికి వెళ్లే మార్గాన్ని గురువారం మూసివేశారు. వర్షాలకు తావి, చీనాబ్ తదితర నదులకు మెరుపు వరదలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

అత్యంత విషాదకర ఘటన: రాష్ట్రపతి

జమ్మూకశ్మీరులో మెరుపు వరదల ఘటన అత్యంత విషాదకరమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానిమోదీ పేర్కొన్నారు. ఈ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.


హిమాచల్‌ప్రదేశ్‌లో కూడా..

హిమాచల్‌ప్రదేశ్‌లో కూడా భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. మేఘవిస్ఫోటంతో మెరుపు వరదలు వచ్చాయి. సిమ్లా, లాహోల్-స్పితి ప్రాంతాల్లో చాలా నిర్మాణాలు కొట్టుకుపోయాయి. జాతీయ రహదారులతో సహా 396 మార్గాలను మూసివేశారు. సిమ్లాలోని విద్యుత్తు సరఫరా కార్యాలయం కూడా దెబ్బ తింది. అయితే, ప్రాణ నష్టానికి సంబంధించిన సమాచారం అందలేదని అధికారులు తెలిపారు.



సిమ్లాలో భారీ వరదతో కొట్టుకువచ్చిన మట్టిలో కూరుకుపోయిన వాహనాలు

లోకం తీరు



ట్రంప్, పుతిన్ భేటీ విఫలమైతే.. భారత్‌పై మరిన్ని సుంకాలు!

- యూఎస్ ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్

న్యూయార్క్, ఆగస్టు 14: ఉక్రెయిన్‌తో యుద్ధ విరమణ అంశంపై రష్యా, అమెరికా మధ్య చర్చలు విఫలమైతే.. భారత్‌పై సుంకాలు మరింతగా పెంచుతామని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్ ప్రకటించారు. రష్యా నుంచి భారత్ భారీగా చమురు కొనుగోలు చేస్తుండటమే దీనికి కారణమని చెప్పారు. అమెరికాలోని అలాస్కాలో శుక్రవారం(భారత కాలమానం ప్రకారం శనివారం) రష్యా అధ్యక్షుడు పుతిన్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భేటీకానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బ్లూమ్‌బర్గ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్కాట్ బెస్సెంట్ కీలక వ్యాఖ్యలు చేశారు. "పుతిన్ తీరుతో అందరూ విసిగిపోయి ఉన్నారు. ఈసారి ఆయన సానుకూల చర్చలకు సిద్ధంగా ఉన్నట్టు కనిపిస్తోంది. ఒకవేళ ట్రంప్, పుతిన్ చర్చలు సఫలం కాకపోతే.. రష్యా నుంచి చమురు కొంటున్న భారత్‌పై సుంకాలు మరింతగా పెంచుతాం. రష్యాపై ఆంక్షలు కఠినతరం చేస్తాం" అని పేర్కొన్నారు. రష్యా నుంచి భారత్ కంటే ఎక్కువ చమురు కొంటున్న చైనా సంగతి ఏమిటని విలేకరి ప్రశ్నించగా.. అధ్యక్షుడు ట్రంప్ కంటే ముందే తానేమీ చెప్పలేనని, ఏం చేయాలో ఆయనకు బాగా తెలుసని స్కాట్ బెస్సెంట్ చెప్పారు. రష్యాపై మరింత ఒత్తి తెచ్చేందుకు యూరోపియన్ దేశాలు అమెరికా వెంట నిలవాలని కోరారు. మరోవైపు, అమెరికా, భారత్ మధ్య సంబంధాలు పరస్పర గౌరవం, ప్రయోజనాల ఆధారంగా ముందుకు సాగుతాయని, మెరుగుపడతాయని ఆశిస్తున్నామని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ గురువారం పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య బలమైన వ్యూహాత్మక భాగస్వామ్యం ఉందని, కొన్ని సమయాల్లో అది సవాళ్లను ఎదుర్కొన్నా ముందుకు సాగిందని చెప్పారు. రక్షణ రంగానికి సంబంధించి అమెరికా, భారత్ మధ్య బలమైన బంధం ఉందని.. ఇది ద్వైపాక్షిక సంబంధాలకు కీలక ఆధారమని తెలిపారు.

65 లక్షల మంది పేర్లు వెల్లడించండి

బిహార్‌లో తొలగించిన ఓటర్లపై సుప్రీం

న్యూఢిల్లీ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) డ్రైవ్ నిర్వహించి తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల పేర్లనూ వెల్లడించాలని సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. వారిని ఓటర్ల జాబితా నుంచి ఎందుకు తొలగించారో కారణాలు సైతం స్పష్టం చేయాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చీలతో కూడిన ధర్మాసనం నిర్దిష్ట ఆదేశాలు జారీ చేసింది. ఆ వివరాలను.. జిల్లాలవారీగా సంబంధిత జిల్లా ఎన్నికల అధికారుల వెబ్‌సైట్లతోపాటు, బిహార్ ఎన్నికల ప్రధాన అధికారి వెబ్‌సైట్‌లో కూడా ఆగస్టు 19లోగా ప్రచురించాలని సూచించింది. ఏ ఓటరును ఎందుకు తొలగించారనే విషయాన్ని.. ఓటర్ ఐడీ నంబర్ల సాయంతో తెలుసుకునేలా ఆ డాక్యుమెంట్లు ఉండాలని సుప్రీం తన ఆదేశాల్లో పేర్కొంది. ఎవరైనా ఓటర్ల జాబితాలో తమ పేరు మళ్లీ చేర్చాలంటూ దరఖాస్తు సమర్పించేటప్పుడు.. వారు గుర్తింపు పత్రంగా ఆధార్‌కార్డును కూడా సమర్పించవచ్చని పేర్కొంటూ పేపర్లలో, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో బహిరంగ నోటీసులు ఇవ్వాలని సూచించింది. ఓటు హక్కుకు సంబంధించి.. ఆమోదించతగ్గ 11 పత్రాల్లో ఆధార్ కార్డును కూడా చేర్చాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను వచ్చే బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు.

రాజకీయ పార్టీలకు ఇచ్చాం..

జాబితా నుంచి తొలగించిన ఓటర్ల వివరాలను బూత్‌ల స్థాయిలో రాజకీయ పార్టీల ఏజెంట్లకు ఇప్పటికే ఇచ్చామని ఈసీ తరఫున వాదనలు వినిపించిన రాకేశ్ ద్వివేది గురువారం కోర్టుకు తెలపగా.. తమ ఓటు ఉందో లేదో తెలుసుకునేందుకు ఓటర్లు రాజకీయ పార్టీల దగ్గరికి ఎందుకు వెళ్లాలని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. "ఓటర్లు స్థానిక రాజకీయ పార్టీల చుట్టూ తిరగాల్సిన అవసరం లేని యంత్రాంగం మీ వద్ద లేదా? ఇంటర్‌నెట్ ద్వారా మీరు ఈ పని ఎందుకు చేయకూడదు?" అని జస్టిస్ సూర్యకాంత్ ఈసీని ప్రశ్నించారు. దీనికి రాకేశ్ ద్వివేదీ.. ఓటర్ ఐడీ నంబర్‌తో వెతకడం ద్వారా జాబితాలో తమ పేరు ఉన్నదీ లేనిదీ ఓటర్లు తెలుసుకునే వీలుందని జవాబిచ్చారు. దీనికి ధర్మాసనం.. తొలగించినవారి పేర్ల జాబితానే ఎందుకు పెట్టకూడదని ప్రశ్నించింది. "చనిపోయిన/ఒకచోటు నుంచి మరోచోటుకు వెళ్లిపోయిన/రెండుచోట్ల ఉన్నవారి పేర్లను ఎందుకు పెట్టరు?" అని జస్టిస్ బాగ్చీ అడిగారు. "మీరు ఆ వివరాలను బహిరంగపరిస్తే.. ఈసీ మీద ఉన్న అభిప్రాయాలు మారుతాయి" అని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. పారదర్శకత వల్ల ఓటర్లలో విశ్వాసం కలుగుతుందన్నారు. ఓటర్ల జాబితాలో లేనివారి పేర్లు కారణాలతో సహా వెల్లడిస్తే ఓటర్లు పరిష్కార చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని.. కాబట్టి అందరికీ అర్థమయ్యే భాషలో, సామాన్యులకు అనుకూలంగా ఉండే విధంగా.. తొలగించిన వారి పేర్లు వెల్లడించాలని ఆయన స్పష్టం చేశారు. ఉదాహరణకు.. పూనం దేవి అనే మహిళ పేరు తొలగిస్తే.. తన పేరు ఎందుకు తొలగించారో తెలుసుకునేలా ఆ జాబితా ఉండాలని సూచించారు. ఈసీ అప్‌లోడ్ చేసే పత్రాలు 'సెర్చబుల్ ఫార్మాట్‌'లో.. అంటే, ఓటరు గుర్తింపు కార్డడ నంబరుతో వెతుక్కోగలిగేలా ఉండాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు గోపాల్ శంకరనారాయణన్, వృందా గ్రోవర్ కోరగా జస్టిస్ సూర్యకాంత్ అందుకు అంగీకరించారు. అయితే, ఆ విధంగా ఓటర్ల జాబితాను ప్రచురించాల్సిన అవసరం లేదంటూ 2018లో కమల్‌నాథ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని రాకేశ్ ద్వివేదీ గుర్తుచేయగా.. డాక్యుమెంట్‌ను అలా వెతుక్కోగలిగేలా రూపొందించడం వల్ల ఏ సమస్యా ఉండదని జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు.

ఇవీ ఆదేశాలు..

బిహార్‌లో సమగ్ర ఓటర్ల జాబితాకు సంబంధించి సుప్రీంకోర్టు శుక్రవారం జారీ చేసిన ఆరు నిర్దిష్ట ఆదేశాలు..

1) తొలగించిన 65 లక్షల ఓటర్ల పేర్లను జిల్లా ఎన్నికల అధికారుల వెబ్‌సైట్లలో ప్రదర్శించాలి. వారిని ఓటరు జాబితాలో ఎందుకు చేర్చలేదో ఆ కారణాన్ని నిర్దిష్టంగా పేర్కొనాలి. ఓటర్ ఐడీకార్డు నంబర్ ద్వారా ఈ సమాచారం తెలుసుకునేలా ఉండాలి.
2) తొలగించిన 65 లక్షల ఓటర్ల పేర్లను వెబ్‌సైట్‌లో ప్రచురించిన విషయాన్ని.. బిహార్‌లోని ప్రాంతీయ వార్తాపత్రికల ద్వారా ప్రజలకు ప్రజలకు తెలిసేలా చేయాలి. టీవీ, రేడియో చానళ్లలో వెల్లడించాలి. జిల్లా ఎన్నికల అధికారులకు.. అధికారిక సోషల్ మీడియా ఖాతా ఉంటే దాని ద్వారా కూడా ఈ విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లాలి.
3) ఆన్‌లైన్‌లోనే కాక ప్రజలకు మాన్యువల్‌గా కూడా అందుబాటులో ఉండేలా.. ఈ 65 లక్షల ఓటర్ల జాబితాను (తొలగింపునకు కారణాలతో సహా) ప్రతి బూత్ స్థాయి అధికారీ.. తమ తమ బ్లాక్ డెవలప్‌మెంట్/పంచాయతీల్లో నోటీస్ బోర్డుపై అతికించాలి.
4) జాబితాలో తమ పేర్లు లేనివారు ఆధార్ కార్డు ప్రతితో ఫిర్యాదు చేయవచ్చని బహిరంగ నోటీసుల్లో పేర్కొనాలి.
5) ముసాయిదా జాబితాలో లేనివారి పేర్లతో కూడిన సాఫ్ట్‌కాపీని రాష్ట్ర ఎన్నికల అధికారులకు సమర్పించాలి. ఈ మొత్తం జాబితాను బిహార్ సీఈవో వెబ్‌సైట్‌లో ఉంచాలి.
6) వెబ్‌సైట్ జాబితాలో పేర్లను ఎపిక్ (ఓటర్ గుర్తింపు కార్డు) నంబర్ ఆధారంగా వెతుక్కోగలిగేలా ఉండాలి.

ప్రజాస్వామ్యాన్ని రక్షించిన సుప్రీం

- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

సుప్రీంకోర్టు తీర్పు ప్రజాస్వామ్యాన్ని రక్షించిందని ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో భారత ఎన్నికల సంఘం చేస్తున్న దారుణాన్ని తాము తీవ్రంగా ప్రశ్నించామని ఆయన గుర్తుచేశారు. తొలగించిన 65 లక్షల ఓటర్ల పేర్లను, వారిని తొలగించడానికి గల కారణాలను బహిర్గతం చేయాలని రాహుల్ డిమాండ్ చేస్తున్నారని.. ఇప్పుడు సుప్రీంకోర్టు సైతం అవే ఆదేశాలు ఇచ్చిందని అన్నారు. పార్లమెంటులో దీనిపై చర్చపెట్టాలంటూ రాహుల్ నేతృత్వంలో తాము అడుగుతుంటే.. స్పీకర్ వాయిదాలతో కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. కానీ, సుప్రీంకోర్టు సరైన తీర్పు ఇచ్చిందన్నారు. రాజ్యాంగ బద్ధంగా స్వతంత్రంగా పనిచేయాల్సిన ఎన్నికల కమిషన్ ప్రలోభాలకు గురైతే తీరని నష్టం జరుగుతుందని, ఇది కేవలం కాంగ్రెస్ పార్టీ సమస్య కాదని, దేశంలోని ప్రతి పౌరుడూ ప్రశ్నించాల్సిన అంశమని పేర్కొన్నారు.

ఓడితే చెడ్డవి.. గెలిస్తే మంచివట!

రాజకీయ పార్టీలు ఓడిపోయినప్పుడు ఈవీఎంలు చెడ్డవని తిడుతున్నాయని, గెలిచినప్పుడు మాత్రం మంచివే అంటున్నాయని.. తీవ్ర రాజకీయ వైరుధ్యాలున్న వాతావరణంలో తాము పనిచేయాల్సి వస్తోందని.. తాము తీసుకున్న ప్రతి నిర్ణయాన్నీ కోర్టుల్లో సవాల్ చేస్తున్నారని ఈసీ తరఫు న్యాయవాది రాకేశ్ ద్వివేదీ కోర్టుకు తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ సహా కొన్ని నిర్ణయాలు తీసుకునే అధికారం రాజ్యాంగంలోని 324వ అధికరణం కింద తమకు (ఈసీ) ఉందని ఆయన స్పష్టం చేశారు.



భారీ వృక్షం కూలడంతో బైక్‌పైనే మృతిచెందిన శ్రీనివాసరావు

వెళ్తున్న బైక్‌పై కూలిన భారీవృక్షం

- కెమికల్ కంపెనీ ఉద్యోగి మృతి.. మరొకరికి గాయాలు

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వెళ్తున్న బైక్‌పై 200 సంవత్సరాల వయసున్న భారీ వృక్షం కూలిపోవడంతో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పెదరాంభద్రపురంలో గురువారం జరిగిందీ ఘటన. స్థానిక సీఐ జి.అప్పన్న తెలిపిన వివరాల మేరకు తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు(33) అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం కేశవరం సమీపంలోని డెక్కన్ ఫైన్ కెమికల్స్ కంపెనీలో ఇనుస్ట్రుమెంటేషన్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. గురువారం ఉదయం సహచర ఉద్యోగితో కలిసి బైక్‌పై కంపెనీకి వెళ్తుండగా పెదరామభద్రపురం గ్రామంలోని సత్తెమ్మతల్లి ఆలయం వద్దనున్న భారీ నిద్రగన్నేరు చెట్టు వీరి బైక్‌పై కూలిపోయింది. చెట్టు మాను కింద ఇరుక్కుపోయి శ్రీనివాసరావు అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. అదే బైక్‌పై ఉన్న సహచర ఉద్యోగికి స్వల్పగాయాలయ్యాయి. చెట్టు కింద ఇరుక్కుపోయిన శ్రీనివాసరావు మృతదేహన్ని బయటికి తీసేందుకు బైక్ చుట్టూ రోడ్డుపై గొయ్యి తవ్వడంతో బైక్ తోపాటు మృతదేహం పక్కకు ఒరిగింది.

సీఎంను కలిసిన పోతుల బాలకోటయ్య

అమరావతి బహుజన ఐకాస అధ్యక్షుడు, సామాజిక సంక్షేమ మండలి చైర్మన్ పోతుల బాలకోటయ్య గురువారం కుటుంబ సమేతంగా ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. భార్య నీరజ, కుమారుడు గౌతమ్‌ను వెంట పెట్టుకొని సీఎం కార్యాలయానికి వెళ్లారు. సామాజిక సంక్షేమ మండలి చైర్మన్‌గా నియమించిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అంబేడ్కర్ చిత్రపటాన్ని, తాను రాసిన 'నేను.. నా అమరావతి' పుస్తకాన్ని సీఎంకు అందజేశారు. - (గుంటూరు, ఆంధ్రజ్యోతి)



సీఎంకు అంబేడ్కర్ చిత్రపటాన్ని బహూకరిస్తున్న బాలకోటయ్య

'ఓటు చౌర్యం'పై బిహార్ నుంచి రాహుల్ సమరం

- 17వ తేదీ నుంచి ఓటర్ అధికార్ యాత్ర



న్యూఢిల్లీ, ఆగస్టు 14: 'ఓటు చౌర్యం'పై కేంద్ర ప్రభుత్వంతోపాటు.. భారత ఎన్నికల సంఘం(ఈసీఐ)కి వ్యతిరేకంగా గళమెత్తిన కాంగ్రెస్ సీనియర్ నేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ.. ఈ నెల 17 నుంచి సమర శంఖం పూరించనున్నారు. బిహార్ నుంచి ఆయన 'ఓటర్ అధికార్ యాత్ర'ను ప్రారంభించనున్నారు. దేశవ్యాప్తంగా పారదర్శక ఓటర్ల జాబితా లక్ష్యంగా తమ యాత్ర కొనసాగుతుందని రాహుల్ ఈ సందర్భంగా తెలిపారు. "ఓటు చౌర్యం అనేది కేవలం ఎన్నికలకు సంబంధించిన అంశం కాదు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, 'ఒక వ్యక్తి-ఒక ఓటు' సూత్రాన్ని కాపాడే నిర్ణయాత్మక సమరం మాది. ఈ సమరంతో ఓటు దొంగల ఓటమి జరగాలి. ప్రజలు విజయం సాధించాలి. రాజ్యాంగం విజయం సాధించాలి" అని ఆయన వ్యాఖ్యానించారు. 17న ప్రారంభం కానున్న ఓటర్ అధికార్ యాత్ర.. సెప్టెంబరు 1న పట్నాలోని గాంధీ మైదానంలో జరిగే మహాసభతో ముగుస్తుంది. ఈ ఉద్యమాన్ని విస్తరించేందుకు కాంగ్రెస్ నేతలు గురువారం 'లోక్‌తంత్ర బచావో మషాల్ మార్చ్', ఆగస్టు 22 నుంచి సెప్టెంబరు 7 వరకు 'ఓట్ చోర్.. గద్దీ చోర్' సభలు.. సెప్టెంబరు 15 నుంచి అక్టోబరు 15 వరకు ప్రజల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. కాగా.. గతవారం రాహుల్ గాంధీ బెంగళూరులోని మహాదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్‌లో 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో లక్షకు పైగా ఓట్లు తారుమారయ్యాయంటూ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే..! ఇదే అంశంపై విపక్షాలు పార్లమెంట్‌ను అట్టుడికించాయి. మరోవైపు ఈ అంశంపై రాబర్ట్ వాద్రా తీవ్రంగా స్పందించారు. రాహుల్, ప్రియాంక దేశమంతా తిరిగి, ప్రజలకోసం కష్టపడుతున్నారని, ప్రజలు ఈ పోరాటాన్ని గుర్తించకపోతే.. బీజేపీ తప్పుడు మార్గాల్లో గెలుస్తూనే ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, రాహుల్ గాంధీ నైరాశ్యంలో ఉన్నారని బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు.

'ఓటు చౌర్యం' పదాన్ని వాడొద్దు: ఈసీఐ

'ఓటు చౌర్యం' అనే పదాన్ని వాడొద్దంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) సూచించింది. "ఎవరైనా రెండుసార్లు ఓటు వేశారనడానికి ఆధారాలుంటే.. ప్రమాణపత్రంతో సమర్పించండి. అంతేకానీ, ఇలాంటి నీచ పదాన్ని వాడొద్దు" అని స్పష్టం చేసింది. 1951 నుంచి 'ఒక వ్యక్తి - ఒక ఓటు' చట్టం అమల్లో ఉందని గుర్తుచేసింది. కోట్ల మంది ఓటర్లను, లక్షల మంది ఎన్నికల సిబ్బందిని 'ఓటు దొంగలు' అని పిలవడం వారి గౌరవంపై దాడి చేయడమేనని వ్యాఖ్యానించింది.

'మీ ఫొటోషాప్ బాగుంది'..!

- సోనియా ఓటుకార్డు ఆరోపణలపై బీజేపీకి కాంగ్రెస్ కౌంటర్

న్యూఢిల్లీ, ఆగస్టు 14: పౌరసత్వం పొందక ముందు నుంచే సోనియా గాంధీకి భారతదేశ ఓటుకార్డు ఉందని బీజేపీ చేసిన ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ తిప్పికొట్టింది. పౌరసత్వానికి ముందు సోనియా గాంధీకిచ్చిన కార్డు ఇదేనంటూ ఆ పార్టీ ఓ ఓటుకార్డును విడుదల చేయడంపై కాంగ్రెస్ విస్మయం వ్యక్తం చేసింది. మంచిగా ఫొటోషాప్ చేసి ఐడీ కార్డును రూపొందించారని ఎద్దేవా చేసింది. "మీ ఫొటోషాప్ చాలా బాగుంది. సోనియా ఓటు కార్డును బాగా రూపొందించారు. కాని, 69వ రాజ్యాంగ సవరణ చట్టం 1991 ద్వారా 1992 జనవరి 2న నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ ఏర్పాటయింది. దానికి ముందు ఢిల్లీ కేంద్ర పాలిత ప్రాంతం మాత్రమే, మీరు ఆ విషయాన్ని గ్రహించకుండా కార్డును విడుదల చేయడం విడ్డూరంగా ఉంది" అంటూ బీజేపీ ఐటీ విభాగాన్ని ఉద్దేశించి ఎక్స్‌లో పేర్కొంది.

అధికారుల నిష్క్రియ వల్లే ఢిల్లీలో కుక్కల బెడద

- తీర్పును రిజర్వు చేసిన సుప్రీం త్రిసభ్య ధర్మాసనం

న్యూఢిల్లీ, ఆగస్టు 14: స్థానిక సంస్థల అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా స్తబ్దుగా ఉండిపోవడం, జంతు సంతతి నియంత్రణ చర్యలు చేపట్టకపోవడమే ఢిల్లీలో వీధి కుక్కల బెడదకు కారణమని సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం పేర్కొంది. 'ప్రభుత్వం నిబంధనలు రూపొందిస్తుంది. కానీ అవి అమలు కావు. దాని ఫలితమే ఈ సమస్య' అని అసంతృప్తి వ్యక్తం చేసింది. ఢిల్లీలో ఒక్క వీధి కుక్క కూడా కనిపించకూడదని, వాటిని షెల్టర్లకు తరలించాలని సోమవారం ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలను వెనక్కి తీసుకోవాలంటూ దాఖలైన పిటిషన్లపై గురువారం త్రిసభ్య ధర్మాసనం విచారణ నిర్వహించింది. ఒకవైపు వీధి కుక్కల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మరోవైపు జంతు ప్రేమికులేమో వాటితో గౌరవంగా వ్యవహరించాలంటారని వ్యాఖ్యానించింది. ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది.


అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో...
అతి తక్కువ ధరలు Lowest Prices GUARANTEED Best Service నమ్మకమైన సర్వీస్
సోనోవిజన్
ఇండిపెండెన్స్‌డే సేల్
స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు
ఇండిపెండెన్స్‌డే స్పెషల్ ఆఫర్స్
BAJAJ FINSERV Upto 10000 క్యాష్‌బ్యాక్ 1 EMI FREE Scan QR Code
క్రెడిట్ కార్డ్ EMI కొనుగోలుదారులకు, సెలెక్టెడ్ మోడల్స్‌పై, షరతులు వర్తిస్తాయి.
HDB FINANCIAL SERVICES Upto 11000 క్యాష్‌బ్యాక్ 1 EMI FREE
HDB ఫైనాన్స్ కొనుగోలుదారులకు, క్రెడిట్ కార్డ్ EMI కొనుగోలుదారులకు మరియు ఇతర ఫైనాన్స్ కొనుగోలుదారులకు, సెలెక్టెడ్ మోడల్స్‌పై, షరతులు వర్తిస్తాయి.
IDFC FIRST Bank Upto 30000 క్యాష్‌బ్యాక్ 1 EMI FREE Scan QR Code
IDFC కొనుగోలుదారులకు, క్రెడిట్ కార్డ్ EMI కొనుగోలుదారులకు, సెలెక్టెడ్ మోడల్స్‌పై, షరతులు వర్తిస్తాయి.
HDFC BANK ICICI Bank Upto 25000 క్యాష్‌బ్యాక్ డెబిట్ మరియు క్రెడిట్ కార్డ్ EMI కొనుగోలుదారులకు, సెలెక్టెడ్ మోడల్స్‌పై, షరతులు వర్తిస్తాయి. AXIS BANK SBI
అన్ని పెద్ద కంపెనీల నుండి గృహోపకరణాలు ఇంకా మొబైల్స్ & ల్యాప్‌టాప్స్‌లు 2025 లేటెస్ట్ మోడల్స్ అత్యంత విస్తృతశ్రేణిలో లభిస్తున్నాయి.
LG 208 Cm (83") Ultra HD 4K OLED
Home Theatre 139 Cm (55") Ultra HD 4K Smart
SAMSUNG 189 Cm (75") LED 4K Ultra UHD
SONY 164 Cm (65") LED 4K Ultra HD Smart
Panasonic 108 Cm (43") LED 4K HD
LLOYD 108 Cm (43") Ultra 4K Google LED
TCL 108 Cm (43") 4K Google LED
Haier 108 Cm (43") UHD Google LED
BPL 108 Cm (43") UHD 4K Smart LED
xiaomi 108 Cm (43") UHD 4K Smart LED
LG Washing Machine Front Load 9 KG
SAMSUNG Washing Machine Front Load 12 KG
BOSCH Washing Machine Front Load 6.5 KG
IFB Washing Machine Top Load 7 KG
Whirlpool Washing Machine Top Load 7.5 KG
LLOYD Washing Machine Semi Automatic 6.5 KG
LG Side by Side 635 Litres Refrigerator
SAMSUNG Side by Side 650 Litres Refrigerator
Whirlpool Frost Free Double Door 235 Litres Refrigerator
Haier Frost Free Double Door 240 Litres Refrigerator
VOLTAS Direct Cool Single Door 175 Litres Refrigerator
iPhone 16, 16+ Upto 4000/- Cash Back 16 Pro, 16 Pro Max Upto 3000/- Cash Back 16e New Arrival
24/0, 9/0, 12/0 Schemes Available SBI, ICICI, Kotak Credit Cards and Selected Bank Cards (Exchange Bonus)
S-25 Ultra 5G Discount Upto 15000/- Conditions Apply
SAMSUNG A-36 5G A-56 5G Instant Discount Upto 3000/-
9/0, 12/0, 24/0 Schemes Available
vivo 5G V-60 5G X-200, X-200FE Pre Book Now Upto 10% Cash Back 9/0, 10/2, 12/4 Schemes Available
oppo 5G F-29, F-29 Pro 5G Reno-14, 14 Pro 6/0, 7/0, 8/0, 11/2 Schemes Available
ONEPLUS 5G 13-S CashBack 4500/- SBI, RBL Credit Card 12/4 Scheme Available
realme 5G 15 Pro 6/0, 8/2, 10/3 Schemes Available
Redmi 5G Note 14 Series 6/0, 8/0, 10/2, 12/4 Schemes Available
hp 12/4 Scheme Available
Lenovo 12/4 Scheme Available
DELL 15/4 Scheme Available
ASUS 12/4 Scheme Available
MacBook 24/0 Scheme Available
Sound Bar
Smart Watch Ear Buds Mobile Accessories
Boat, Realme, Fastrack, Hapipola
LG 5Star & 3Star Inverter A.C
LLOYD 5Star & 3Star Inverter A.C
BLUE STAR 5Star & 3Star Inverter A.C
VOLTAS 5Star & 3Star Inverter A.C
DAIKIN 5Star & 3Star Inverter A.C
KITCHEN SMALL APPLIANCES
Water Dispenser
Water Purifier RO
Water Geyser 10 Litres
Microwave Oven
Air Chimney
3 Burner Glass Cooktop
Wet Grinder
Rice Cooker
Mixer Grinder 3 Jar, 750 Watts
Juicer
Kettle
Air Fryer
Iron Box
Blender
Conditions Apply
Sonovision Independence Day Sale Special Offers On Mobiles & Laptops
AMAZON PAY Upto 2000/- CASH BACK Conditions Apply
అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో అందరి అభిమానం పొందిన షోరూం సోనోవిజన్
జిన్నాటవర్ సెంటర్, గుంటూరు. 9154279910, 9440804185
లక్ష్మీపురం మెయిన్ రోడ్డు, గుంటూరు. 9246667373, 9154867822, 23, 24
బ్రాడిపేట, గుంటూరు. 9246666215, 9100991706
బ్రమ్మం గారి రోడ్డు, లక్ష్మీపురం, గుంటూరు. 9246666204, 9154279905.
అరండల్‌పేట, రైల్వేస్టేషన్ రోడ్, నరసరావుపేట. 8712648710, 11, 12.
రత్నా టాకీస్ దగ్గర, తెనాలి. 8333924937, 9154279903
టౌన్ చర్చ్ ఎదురు, బోస్‌రోడ్, తెనాలి. 9246666211, 9154279901
మునిసిపల్ ఆఫీస్ ఎదురు, రేపల్లే. 9390006609, 9154281200
కనకదుర్గమ్మ వారధి దగ్గర, తాడేపల్లి. 7331149366, 367, 368
బాపూజి మార్కెట్, ఒంగోలు. 9246666329, 9154279911, 12.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మళ్లీ చిగురించిన దోస్తీ

అమెరికాతో చెడుతున్నకొద్దీ, చైనాతో స్నేహం పెరుగుతోంది. గురువారం చైనా అధికారప్రతినిధి భారత్‌తో సంబంధాలమీద చేసిన వ్యాఖ్యలు వస్తున్న మార్పును స్పష్టంగా సూచిస్తున్నాయి. భారత్ అంతర్జాతీయ ... ను గుర్తించడం, పొరపొచ్చాలను సరిదిద్దుకోవడం, విశ్వాసాన్ని పెంచే చర్యలు చేపట్టడం గురించి ఆయన నిర్దిష్టంగా మాట్లాడారు. ఉభయదేశాల మధ్యా సరిహద్దు వాణిజ్యాన్ని పునరుద్ధరించేందుకు ఐదేళ్ళ తరువాత ప్రయత్నాలు జరుగుతున్నాయంటేనే, కొత్త ప్రేమలు చిగురిస్తున్నాయని అర్థం. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, సిక్కిం పర్వతశ్రేణుల్లో జరగబోతున్న ఈ ప్రయత్నం పరిమాణం రీత్యా పెద్దది కాకున్నా, ఒక సానుకూల పరిణామం. త్వరలోనే చైనా విదేశాంగమంత్రి మనదేశంలో పర్యటించడం కూడా గల్వాన్ ఘాతుకం అనంతరం ఉభయదేశాలమధ్యా పెరిగిన దూరాన్ని తగ్గించేందుకు ఉపకరిస్తుంది.

సుంకాల సమ్మెటదెబ్బలతో సరిపెట్టకుండా, ఏవో పాతకక్షలు కోపతాపాలు ఉన్నట్టుగా అమెరికా అధ్యక్షుడు భారత్‌తో వ్యవహరిస్తున్న నేపథ్యంలో, చైనాతో మన దోస్తీ పెరుగుతోంది. ఉభయదేశాలూ గతంలో పరస్పరం విధించుకున్న శిక్షలు ఆంక్షలను సడలించడమో, తొలగించడమో జరుగుతోంది. బీజింగ్‌నుంచి ఎరువుల సరఫరా తిరిగి మొదలైంది, చైనా పౌరులకు భారత్ టూరిస్టు వీసాలు ఇస్తోంది. భారత్–చైనా మధ్య నేరుగా విమానసర్వీసులు నడిపే ప్రయత్నం కూడా జోరందుకుంది. ఉభయదేశాల మధ్యా సరిహద్దు వివాదాలకు సంబంధించిన చర్చలు జరుగుతున్నప్పటికీ, ఉన్నతస్థాయిలోనే చేయాల్సిన కొన్ని కీలక నిర్ణయాలు ఇంకా మిగిలే ఉన్నాయి. చైనా విదేశాంగమంత్రి పర్యటన, భారత భద్రతాసలహాదారు అజిత్ దోభాల్‌తో భేటీ ఈ వివాదాల పరిష్కారానికి దోహదపడవచ్చునని ఆశ. ఇక, అక్టోబర్‌లో జరగనున్న షాంఘై సహకార సంఘం సదస్సుకు హాజరుకావాలని ప్రధాని నరేంద్రమోదీ నిర్ణయించుకున్నందుకు చైనా సంతోషిస్తోంది. చైనా దినపత్రిక గ్లోబల్ టైమ్స్ తన సంపాదకీయంలో మోదీని ప్రశంసిస్తూ, హిందీ చీనీ భాయిభాయి తరహాలో అనేక మంచిమాటలు రాసింది.

భారత్–చైనా మధ్య ఐదేళ్లపాటు కొనసాగిన ఎడబాటు ఇప్పుడు డొనాల్డ్ ట్రంప్ దయవల్ల, క్రమంగా తొలగిపోతోంది. భారత్‌ను తన బుట్టన వేసుకునేందుకు చైనా కాచుకుని ఉందని ఇప్పుడు ప్రశంసలు వింటున్నాం. చైనాకు పోటీగా ఈ ప్రాంతంలో భారత్‌ను నిలబెట్టి, బలోపేతం చేసి, చైనా ఎదుగుదలనూ, విస్తరణవాదాన్నీ నియంత్రించాలన్న దశాబ్దాల అమెరికా వ్యూహాన్ని ట్రంప్ అతివేగంగా, స్వల్పకాలంలోనే తలకిందులు చేసేశారు. ట్రంప్ తొలివిడత ఏలుబడిలో మోదీతో పెరిగిన సాన్నిహిత్యం, భారత్‌మీద ఆయన కురిపించిన ప్రత్యేక ప్రేమలూ విస్మరించలేనివి. ట్రంప్ 'మగా', భారత్ 'మిగా' కలిసి 'మెగా' అయిందంటూ మోదీ మొన్న ఫిబ్రవరిలో చేసిన ప్రసంగం ఆ దోస్తీకి ఆఖరుమెట్టు. కానీ, కొద్దినెలల్లోనే గాలి తిరిగిపోయింది. ఆపరేషన్ సిందూర్‌ను ఆపింది నేనేనని ట్రంప్ చెప్పుకోవడం, అవును నిజమేనంటూ పాకిస్థాన్ ప్రశంసించడం, ఆప్తమిత్రుడు మోదీ మాత్రం దానిని కాదనడం, ముప్పైసార్లు అదేపనిగా చెప్పుకుంటున్నా అవునని తలూపకపోవడం తెలిసిందే. నోబెల్‌శాంతి పురస్కారం అర్హుడనని అనుకుంటున్న ట్రంప్ అహాన్ని దెబ్బతీసిన ఫలితమే ఈ సుంకాలూ భారత్‌కు డెడ్ ఎకానమీ అంటూ శాపాలూ అని విశ్లేషకుల వాదన. భారత్‌లాంటి మిత్రదేశాలను ట్రంప్ తన దూకుడు నిర్ణయాలతో దూరం చేసుకోవడం సరికాదని నిక్కీ హేలీ వంటివారు హితవులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో భారత్ ఒక బలమైన సంపదిత శక్తిని అమెరికా ఎదుర్కోవాల్సి వస్తుందని అక్కడి మాజీ భద్రతాసలహాదారులు భయపడుతున్నారు. పాతస్నేహాలను గాలికొదిలేసి, శత్రువులకంటే అన్యాయంగా ట్రంప్ పరిగణిస్తున్న ఫలితంగానే ఇప్పుడు రష్యాతో రాసుకుపూసుకుపోవడానికి, చైనాతో చేయి కలపడానికి భారత్‌కు మరింత వీలుకలిగింది. ఆరేళ్ల తరువాత మోదీ చైనా పర్యటనకు సిద్ధపడుతున్నారు కాక, పుతిన్‌తో టెలిఫోన్ సంభాషణ, ఆయన ఆగస్ట్‌లో వస్తున్నందున మార్పుకు నిదర్శనం. ఈ పరిణామాలన్నీ అంతిమంగా రష్యా–ఇండియా–చైనా (ఆర్ఐసి) త్రైపాక్షిక కూటమి పునరుద్ధరణకు మార్గాన్ని సుగమం చేస్తాయని అమెరికా మీద ఆగ్రహంతో ఉన్న విశ్లేషకుల నమ్మకం.

క్రైస్తవులకూ తప్పని వేధింపులు!

నరేంద్ర మోదీ 2014లో దేశ ప్రధానమంత్రి అయిన నాటి నుంచీ భారతీయ ముస్లింల పట్ల వ్యవహరిస్తున్న తీరుతెన్నులను పలువురు ఆక్షేపిస్తున్నారు. మోదీ సర్కార్‌ను 2002 గుజరాత్ మతోన్మాద హింసాకాండ వెన్నాడుతూనే ఉన్నది, హిందూత్వ భావజాల మెజారిటీవాద ప్రపంచ దృక్పథమే ప్రభావితం చేస్తూనే ఉన్నది. భారతీయ ముస్లింలు 'పరాయివారు, ప్రమాదకారులు'గా ఆయన ప్రభుత్వం పరిగణిస్తుందన్న భావనను ప్రజల మనసు నుంచి రూపుమాపలేకపోతున్నారు. సంఘ్ పరివార్‌లోని కరడుగట్టిన తీవ్రవాదుల మూలంగా మోదీ ప్రభుత్వం తనపై ఉన్న ముస్లిం వ్యతిరేకతా ముద్రను వదిలించుకోలేకపోతోంది. హిందూత్వ ఉన్మాదులు తమ మాటలు, చేతల్లోను ముస్లింలకు వ్యతిరేకంగా అమానుష నేరాలకు పాల్పడుతున్నారు. ఇటీవల కర్ణాటకలోని బెల్గావి నియోజకవర్గంలో శ్రీరామ సేన నాయకుడు ఒకరిని అరెస్ట్ చేశారు. ముస్లిం ప్రధానోపాధ్యాయుడు ఒకరిని అపఖ్యాతిపాలు చేసేందుకు ఒక ప్రభుత్వ పాఠశాలలోని తాగునీటిని విషపూరితం చేసాడని ఆరోపిస్తూ ఆ హెడ్‌మాస్టర్‌ను బదిలీ చేయించాడన్నది శ్రీరామ సేన నాయకుడిపై నమోదైన అభియోగం.

భారతీయ ముస్లింలకు వ్యతిరేకంగా విద్వేష ప్రసంగాలు పెచ్చరిల్లిపోవడం ఒక సాధారణ విషయమైపోయింది. అయితే అల్పసంఖ్యాకులలో అల్పసంఖ్యాకులు అయిన భారతీయ క్రైస్తవులతో భారతీయ జనతా పార్టీ సంక్లిష్ట సంబంధాల గురించిన మాటా మంతీ దేశ ప్రజలలో తక్కువే. జూలై 26న బీజేపీ పాలనలో ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ పోలీస్ స్టేషన్‌లో కేరళకు చెందిన ఇద్దరు క్రైస్తవ సన్యాసినులను నిర్బంధించారు. అమ్మాయిల అక్రమ రవాణా, బలవంతంగా మత మార్పిడులకు పాల్పడ్డారన్నది ఆ నన్స్‌పై నమోదైన ఆరోపణ. ఆ గిరిజన ప్రాంతానికి చెందిన స్థానిక బజరంగ్‌దళ్ నేతలు అరెస్టయిన క్రైస్తవ సన్యాసినులపై ఆ తప్పుడు ఆరోపణలు చేశారు. అక్రమ రవాణాకు గురయ్యారని చెప్పుతున్న అమ్మాయిలు తాము స్వచ్ఛందంగానే కేరళ నన్స్ వెంట వెళ్లామని, నర్సింగ్ వృత్తిలో శిక్షణ పొందాలని తాము ఆకాంక్షించామని కూడా వారు స్పష్టం చేశారు. మెరుగైన ఉద్యోగావకాశాలను అన్వేషించుకునేందుకు తమ కుమార్తెలకు అనుమతినిచ్చామని ఆ అమ్మాయిల తల్లిదండ్రులు కూడా చెప్పినట్టు నమోదయింది. అయినప్పటికీ దుర్గ్ గిరిజన ప్రాంత పోలీసులు ఈ వాస్తవాలను ఉద్దేశపూర్వకంగా ఉపేక్షించారు. స్థానిక బజరంగ్‌దళ్ నాయకుడి ఫిర్యాదు మేరకే ఆ క్రైస్తవ సన్యాసినులను అరెస్ట్ చేశారు. ఆ నన్స్‌కు మద్దతు తెలుపుతున్న వ్యక్తులను బజరంగ్‌దళ్ నేత జ్యోతిశర్మ బెదిరించినట్టు, కొంత మందిపై చేయి చేసుకున్నట్టు కూడా పూర్తి సాక్ష్యాధారాలతో వార్తలు వెలువడ్డాయి. అయినప్పటికీ పోలీసులు, బజరంగ్‌దళ్‌నే ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి సమర్థించారు.

ఇవేవీ ఆశ్చర్యకరమైన విషయాలు కాదు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో నేను ఛత్తీస్‌గఢ్‌లో పర్యటించాను. నారాయణపూర్ జిల్లాలోని ఒక చిన్న గ్రామంలో గిరిజనుల బృందం నొకదానితో మాట్లాడాను. హిందూత్వవాదులు తమను సామాజికంగా బహిష్కరించారని, తదాది తాము భయంతో బతుకుతున్నామని ఆ గిరిజనులు చెప్పారు. చివరకు తమ కుటుంబాలలో చనిపోయిన వారిని ఖననం చేసేందుకు కూడా అనుమతినివ్వడం లేదని వారు వాపోయారు. తిరిగి హిందూ మతంలోకి మారేంతవరకు తమను సామాజికంగా బహిష్కరిస్తామని హిందూత్వవాదులు అంటున్నారని వారు చెప్పారు. క్రైస్తవ గిరిజనుల 'ఘర్–వాప్సి' కార్యక్రమాన్ని సంఘ్ పరివార్ చాలా సంవత్సరాలుగా సువ్యవస్థితంగా నిర్వహిస్తోంది. మిషనరీలు ప్రలోభాలతో గిరిజనులను బలవంతంగా క్రైస్తవంలోకి మార్చుతున్నందుకు వ్యతిరేకంగా క్రైస్తవ గిరిజనులను సామాజిక బహిష్కరణతో తిరిగి హిందూ మతంలోకి తీసుకువచ్చేందుకు సంఘ్ పరివార్ అనుబంధ సంస్థ వనవాసి కల్యాణ్ కేంద్రాలు కృషి చేస్తున్నాయి.



> అల్పసంఖ్యాకులలో అల్పసంఖ్యాకులు అయిన క్రైస్తవుల పట్ల వ్యతిరేకతలు, విద్వేషాలను ముగింపునకు తీసుకురావడం ఎలా? ఈ ఏడాది క్రిస్మస్ పండుగ రోజున ప్రధానమంత్రి నరేంద్ర మోదీ క్రైస్తవ మత పెద్దలకు తేనీటి విందు ఇచ్చి జీసస్ మానవతను మెచ్చుకోవడం కాకుండా క్రైస్తవ మత వ్యతిరేక కార్యకలాపాలకు స్వస్తి చెప్పి తీరాలని బజరంగ్‌దళ్‌ను సరళంగా, కఠినంగా హెచ్చరించాలి. ఇది మాత్రమే మోదీ, బీజేపీలని భారతీయ క్రైస్తవులకు ప్రేమాస్పదులను చేస్తుంది.

భారత పౌరులకు మత స్వేచ్ఛ రాజ్యాంగబద్ధమైన హక్కు. తమకు ఇష్టమైన మతంలోకి మారే స్వేచ్ఛ అందులో భాగమే. బాబాసాహెబ్, ఆయన అనుయాయులు బౌద్ధ మతంలోకి మారారన్న విషయాన్ని మనం విస్మరించకూడదు. అయితే రాజ్యాంగ హక్కులు సంపూర్ణమైనవి కావు. ఇతర కారణాల దృష్ట్యా వాటిని ఎంపిక చేసి తగ్గించవచ్చు. ఈ దృష్ట్యా క్రైస్తవానికి మార్పిడిని బలవంతంగా జరిగినదిగా, అదొక నేరపూరిత చర్యగా పరిగణిస్తున్నారు. అయితే హిందూ మతంలోకి మళ్లీ మారడాన్ని స్వచ్ఛంద చర్యగా కొత్త జీవితానికి ఆశీర్వాదంగా భావిస్తున్నారు. అధికారంలో ఉన్న ప్రభుత్వాల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తున్న కారణంగానే బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు తమ ఇష్టారాజ్యంగా, నిర్భీతితో వ్యవహరించడం మామూలైపోయింది. భయపూరిత వాతావరణాన్ని సృష్టించి పోలీసుల మద్దతుతో ఘర్–వాప్సి కార్యక్రమాన్ని అమలుపరుస్తున్నారు.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

అనూహ్యంగా కేరళ క్రైస్తవ సన్యాసినులకు బెయిల్ మంజూరయింది. కేరళ ఎంపీలు కొంతమంది హోం మంత్రి అమిత్ షాను కలుసుకుని ఆ వ్యవహారంలో తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరడంతో ఆ బెయిల్ మంజూరు సుసాధ్యమయింది. కేంద్ర హోం శాఖ చాలా వేగంగా ప్రతిస్పందించింది, సందేహం లేదు. ఆ క్రైస్తవ సన్యాసినుల అరెస్ట్ కేరళలో రాజకీయ ఉద్రిక్తతలకు కారణం కావడం వల్లే అమిత్ షా ఎంపీలు అడిగిన వెన్వెంటనే జోక్యం చేసుకున్నారు. కేరళలో క్రైస్తవ జనాభా అధికంగా ఉన్నది. అందునా ఆ రాష్ట్రంలో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. కేరళలో ఎలాగైనా అధికారంలోకి రావడానికి బీజేపీ ఆరాటపడుతోంది. క్రైస్తవులను ఆకట్టుకోవడం ద్వారా హిందూ–క్రైస్తవ రాజకీయ ఒప్పందంతో అధికారాన్ని కైవసం చేసుకోవాలని బీజేపీ సంకల్పించుకున్నది. ఛత్తీస్‌గఢ్ పోలీసుల చెర నుంచి విడుదలై కేరళకు తిరిగి వచ్చిన క్రైస్తవ సన్యాసినులకు విమానాశ్రయంలో స్వాగతం పలికిన వారిలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ ఉండడంలో ఆశ్చర్యమేమీ లేదు. గోవాలో సొంత బలంతోను, మేఘాలయ, నాగాలాండ్‌లలో సంకీర్ణ ప్రభుత్వ భాగస్వామిగాను బీజేపీ అధికారంలో ఉన్నది. ఇవన్నీ క్రైస్తవులు అధికంగా ఉన్న రాష్ట్రాలే. ముస్లింలకు వ్యతిరేకంగా వ్యవహరించడం, ఆ మతస్తులు అత్యధికంగా ఉన్న జమ్మూ–కశ్మీర్‌ను రాత్రికి రాత్రే కేంద్ర పాలిత ప్రాంతాలుగా కుదించివేయడం తమ రాజకీయ ప్రయోజనాలకు దోహదం చేకూరగలదని బీజేపీ భావిస్తుండవచ్చు. అయితే క్రైస్తవులను తరచు విమర్శలకు లక్ష్యం చేసుకోలేదు. దానివల్ల దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా తనపై విమర్శలు వెల్లువెత్తగలవన్న వాస్తవాన్ని బీజేపీ విస్మరించలేదు.

ఈద్ పర్వదినం సందర్భంగా ముస్లిం మత పెద్దలు నిర్వహించే కార్యక్రమాలలో ఎన్నడూ పాల్గొనని ప్రధాని మోదీ గత డిసెంబర్‌లో క్రిస్మస్ వేడుకల సందర్భంగా కేథలిక్ బిషప్స్ కాన్ఫరెన్స్ గ్రూప్ ఇండియా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని జీసస్ బోధనలను ప్రస్తుతించారు. ఆ దైవ పురుషుని సామరస్యం, సౌభ్రాతృత్వ సందేశాలు మానవాళికి మార్గదర్శకమైనవని పేర్కొన్నారు. అంతేకాదు, క్రిస్మస్ పర్వదినం నాడు ప్రధానమంత్రి తన నివాసంలో క్రైస్తవ మత పెద్దలకు తేనీటి విందు ఇచ్చారు. జీసస్ ప్రబోధించిన విలువలను ఔదలదాల్చాలని సూచించారు. ఏ విధంగా చూసినా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్నేహపూర్వకమైన, ఆకర్షణీయమైన ఆతిథేయి, సందేహం లేదు.

సహనం, శాంతి సామరస్యాల సందేశం సామాన్య క్రైస్తవులకు చేరనప్పుడు మోదీ వ్యూహాత్మకంగా, ఆ అల్పసంఖ్యాకులను మొత్తంగా ఆకట్టుకునేందుకు చేస్తున్న ప్రయత్నాల వల్ల ప్రయోజనమేముంది? క్రైస్తవ సన్యాసినులు, మిషనరీలు బలవంతంగా మత మార్పిడులు చేయిస్తున్నారని బజరంగ్‌దళ్ ఆరోపిస్తోంది. ఈ క్రైస్తవులు 'జాతి–వ్యతిరేకులు', నేరస్థులు, ఇంకా అంతకంటే ఘోరమైనవారని కూడా ఆ హిందూత్వ సంస్థ దుయ్యబడుతోంది. 1999లో ఒడిషాలో మిషనరీ గ్రాహమ్ స్టెయిన్, బాలురు అయిన ఆయన కుమారులు ఇరువురూ బజరంగ్‌దళ్ నాయకుడు దారాసింగ్ పైశాచిక ఘాతుకానికి సజీవంగా దహనమయ్యారు. ఆ ఘటన, భారతీయ మత సామరస్య మహోదాత్త సంప్రదాయానికి ఒక మచ్చలా మిగిలిపోయింది. అలాగే, ఇటీవలి కాలంలో అష్టపదుల వయసులో ఉన్న ఫాదర్ స్టాన్‌స్వామి నక్సలైట్ల సానుభూతిపరుడు అనే నెపంతో, 'ఉపా' కింద అరెస్ట్ చేశారు. జైలులో ఉండగా ఆయనకు అత్యవసర వైద్య సదుపాయాలు సైతం ఆయనకు నిరాకరించారు. కోర్టు జోక్యం చేసుకునే దాకా ఆ వృద్ధుడిని జైలులోనే నిర్బంధించారు. అంతిమంగా ఆయన ఆస్పత్రిలో తుది శ్వాస విడిచారు. గత జూన్‌లో సంగ్లి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎమ్మెల్యే గోపీచంద్ పడాల్కర్ రూ.3 నుంచి రూ. 11 లక్షల బహుమానాన్ని ప్రకటించారు. ఎందుకు? 'బలవంతంగా మత మార్పిడులకు పాల్పడున్న క్రైస్తవ పూజారులపై హింసాత్మక దాడులను ప్రోత్సహించేందుకే సుమా. గ్లోబల్ వాచ్‌డాగ్ గ్రూప్ 'ఓపెన్ డోర్స్ గ్రూప్ రూపొందించిన 2024లో క్రైస్తవులను వేధించిన 'ప్రత్యేక ఆందోళనకరమైన దేశాలు' జాబితాలో భారత్ 11వ స్థానంలో ఉన్నది.

క్రైస్తవ మిషనరీలు పెద్ద ఎత్తున సామూహిక మత మార్పిడిలు చేయిస్తున్నారనే ఆరోపణ ఒకటి నిత్యం వినిపిస్తుండడం కద్దు. వాస్తవమేమిటి? దేశ జనాభాలో క్రైస్తవులు కేవలం 2.3 శాతం మంది మాత్రమే. ఆసక్తికరమైన విషయమేమిటంటే 1971 జనాభా గణనలో ఆ మతస్థులు 2.6 శాతంగా ఉన్నారు. క్రైస్తవ జనాభా తగ్గిపోతున్నప్పటికీ వారికి వ్యతిరేకంగా ఒక కపట ప్రచారం జరుగుతోంది. క్రైస్తవ మిషనరీలు బలవంతంగా, మోసంతో, నానా ప్రలోభాలతో సామూహిక మత మార్పిడులు చేయిస్తున్నారన్నదే ఆ తప్పుడు ప్రచారం. అల్పసంఖ్యాకులలో అల్పసంఖ్యాకులు అయిన క్రైస్తవుల పట్ల ఈ నిరాధార వ్యతిరేకతలు, విద్వేషాలను ముగింపునకు తీసుకురావడం ఎలా? ఈ ఏడాది క్రిస్మస్ పండుగ రోజున ప్రధానమంత్రి నరేంద్ర మోదీ క్రైస్తవ మత పెద్దలకు తేనీటి విందు ఇచ్చి జీసస్ మానవతను మెచ్చుకోవడం కాకుండా తమ క్రైస్తవ మత వ్యతిరేక కార్యకలాపాలకు స్వస్తి చెప్పి తీరాలని బజరంగ్‌దళ్‌ను సరళంగా, కఠినంగా హెచ్చరించాలి. భారతీయ నాగరికతా విలువలను కళంకపరిచే చర్యలకు పాల్పడకూడదని స్పష్టం చేయాలి. ఇది మాత్రమే మోదీని, బీజేపీని భారతీయ క్రైస్తవులకు ప్రేమాస్పదులను చేస్తుంది. అంతేగానీ వ్యూహాత్మక భేటీలు, విందులు, మరే ఇతర ప్రచార ఆర్భాటాలు ఆ మతస్తుల నుంచి గౌరవాదరాలను మీకు సమకూర్చలేవు.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

పాదచారులను మరచిన మార్గాలు!

మీరు ఇంటి నుంచి బయటికి వస్తారు. కనిపించేదేమిటి? రోడ్డుకు ఈ చివరి నుంచి ఆ చివరి దాకా వాహనాల వరుస! ఒకటి కాదు, రెండు వరుసల్లో మెల్లగా కదులుతూ కనిపిస్తుంటాయి, సందేహం లేదు. ఇది నగర ప్రధాన రహదారులకు పక్కగా ఉన్న మీ కాలనీలోని దృశ్యం. ఇక మెయిన్ రోడ్‌పై వాహనాల రద్దీ ఎలా ఉంటుందో చెప్పాలా? రద్దీ, రద్దీ, రద్దీ! జనసమ్మర్థం మన జీవితాలలో ఒక సాధారణ అంశమైపోయింది. ఆఫీసుకు బయలుదేరామా, బస్సుకోసం పడిగాపులు కాస్తాం. బస్సు వస్తుంది, తోసుకుంటూ ఎక్కుతాం, నుంచుంటాం, కూర్చుంటాం (అరుదుగా), ఒత్తిడికి గొణుగుతాం, ఆవేశపడతాం, శాపనార్థాలు పెడతాం, ఆశాభంగం చెందుతాం... చివరకు గమ్యానికి చేరే సమయానికి అ..ల..సి.. పోతాం, ఆ రోజు ముగిసిపోయిందని భావిస్తాం. నిజానికి అప్పటికి మన దైనందిన వృత్తి కార్యకలాపాలు ప్రారంభమే కావు!




■ సునీతా నారాయణ్

మట్టివాసన

దేశ వ్యాప్తంగా 50 నగరాలు, పట్టణాలలో ట్రాఫిక్ రద్దీని 'సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్'లోని నా సహచరులు విశ్లేషించారు. చిన్న పట్టణాలు, పెద్ద నగరాలు, మెట్రో నగరాలు, పర్వత ప్రాంత పట్టణాలు సర్వత్రా ప్రయాణ సేవలకు డిమాండ్ ఎక్కువగా ఉన్నప్పుడు, ఆ డిమాండ్ తక్కువగా ఉన్నప్పుడు రాకపోకలకు పడుతున్న సమయంలో వ్యత్యాసం రెట్టింపు, అంతకంటే ఎక్కువగా ఉంటుందని వెల్లడయింది. మరింత స్పష్టంగా చెప్పాలంటే మీ గమ్యాన్ని చేరేందుకు పట్టే సమయం మామూలు కంటే రెట్టింపుగా ఉంటోంది. ఢిల్లీ, బెంగళూరు లాంటి నగరాలలో పీక్ పీరియడ్ మరింతగా పెరిగిపోతుందని, కేవలం ఆఫీసు వేళల్లోనే కాకుండా ఇతర సమయాలలో కూడా రోడ్లపై వాహనాల కదలిక అసాధ్యమైపోతుందని వెల్లడయింది. మరో ముఖ్యమైన విషయమేమిటంటే ట్రాఫిక్ రద్దీ ఎంత ఎక్కువగా ఉంటే వాయు కాలుష్యం అంత అధికంగా ఉంటుంది. వాహనాలు ఎక్కువ సేపు రోడ్లపై కదలకుండా ఉండిపోవడం వల్లే వాయు కాలుష్యం పెరుగుదలకు దారితీస్తోంది. కనుక రద్దీ అనేది మీ దైనందిన జీవితాల నుంచి సమయాన్ని కొల్లగొట్టడమేకాదు. అనవసర ఒత్తిడిని పెంచుతుంది. ఆరోగ్యంపై హానికర ప్రభావాన్ని చూపుతోంది. మన ఆయుష్షును కూడా తగ్గిస్తోంది. ఇది చాలా బాధాకరం. మనకు మేలు చేయదు. ఇది మన జీవితాల్లో సాధారణం కాకూడదు.

ట్రాఫిక్ రద్దీతో సంభవిస్తున్న మనోవ్యాకులతను నదిగమించేందుకు మనం రాజకీయ అర్థశాస్త్రాన్ని అర్థం చేసుకోవాలి ప్రజలు అంతకంతకూ సొంత వాహనాలు సమకూర్చుకుంటున్నారు. తమ దైనందిన రాకపోకలకు వాటి మీదే ఆధారపడుతున్నారు. దీనివల్ల నగరాలు ఫ్లై ఓవర్లు మొదలైన రహదారి సదుపాయాలను అదనంగా సమకూర్చవలసి వస్తోంది. రోడ్డు ప్రదేశాన్ని అత్యంత అధికంగా, అత్యంత అసమర్థంగా ఉపయోగించుకునే చిన్న కార్లతో రహదారులు అన్నీ నిండిపోతున్నాయి. ఢిల్లీలో ప్రతి రోజూ 500కు పైగా కొత్త కార్లు రిజిస్టర్ అవుతున్నాయి. మేము సర్వే చేసిన నగరాలలో దైనందిన రాకపోకలకు 7 నుంచి 11 శాతం మంది మాత్రమే కార్లను వినియోగిస్తున్నారు. ట్రాఫిక్ రద్దీ బాగా ఉండే మరో నగరమైన బెంగళూరులో కార్లను వినియోగిస్తున్నవారు 7 శాతం మంది మాత్రమేనని నగరాలలో మరింత సమర్థ, స్థిరమైన రవాణా వ్యవస్థను సృష్టించడమే లక్ష్యంగా ఉన్న సమగ్ర మొబిలిటీ ప్రణాళిక సమాచారం వెల్లడించింది. ఇప్పుడు మన ప్రశ్న ఏమిటంటే మిగతా 80 నుంచి 90 శాతం మంది కూడా కార్లను వినియోగించుకుంటే అవన్నీ ప్రయాణించేందుకు సరిపోయే ప్రదేశం మన నగరాలలో ఉన్నదా? అవెలా ప్రయాణిస్తాయి?



పట్టణ, నగర ప్రాంతాలలో రోడ్లను పాదచారులనూ దృష్టిలో ఉంచుకుని రూపొందించడం లేదు. దీనివల్ల నడిచివెళ్లే వారికి ప్రమాదకరమైన, అసౌకర్య పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కాలిబాటలు ఉండవు. ఉన్నా వాటిని సరిగా నిర్వహించడం లేదు. ట్రాఫిక్ ప్రణాళికలో పాదచారుల భద్రత పట్ల నిర్లక్ష్యం సంపూర్ణంగా కనిపిస్తోంది.

నగరాలలో ప్రజా రవాణా తీరుతెన్నులు సరిగా లేకపోవడం ఒక ప్రధాన లోపం. ప్రజా రవాణా సంస్థ బస్సులు చాలా తక్కువగా తిరుగుతుంటాయి. అవి ప్రజల అవసరాలను తీర్చదగిన సంఖ్యలో ఉండవు. ప్రజలు వాటిపై ఆధారపడలేకపోతున్నారు. ట్రాఫిక్ రద్దీ కారణంగానే బస్సులు సమయానికి రావడం జరగకపోవడంతో వినియోగదారులు విసుగుచెందుతున్నారు. బస్సులు ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుపోతుండడంతో వాటి రాకపోకల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ కారణంగానే ఆ బస్సుల్లో ప్రయాణాలకు ప్రజలు విముఖత చూపుతున్నారు. మెట్రో రైల్ సదుపాయమున్న నగరాలలో వినియోగదారులకు కొంత ఉపశమనం చేకూరుతోంది. అయితే ఇక్కడ అనుకూలత, ప్రయాణ వ్యయాల ప్రశ్న తలెత్తుతోంది. మెట్రో టిక్కెట్ ధరనే కాకుండా తమ గమ్యాన్ని చేరుకునేందుకు రిక్షా, టాక్సీ మొదలైనవాటి వ్యయాన్ని కూడా భరించవలసి వస్తోంది. స్పష్టంగా చెప్పాలంటే పట్టణ, నగర ప్రాంతాలలో రోడ్లను పాదచారులనూ దృష్టిలో ఉంచుకుని రూపొందించడం లేదు. దీనివల్ల నడిచి వెళ్లేవారికి ప్రమాదకరమైన, అసౌకర్య పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కాలిబాటలు ఉండడం లేదు. ఉన్నా వాటిని సరిగా నిర్వహించడం లేదు. ట్రాఫిక్ ప్రణాళికలో పాదచారుల భద్రత పట్ల నిర్లక్ష్యం సంపూర్ణంగా కనిపిస్తోంది.

ఈ పరిస్థితిలో ఆటో రిక్షాలు, బ్యాటరీ రిక్షాలు, మినీ బస్సుల లాంటి అనుబంధ రవాణా సాధనాలపై అధికంగా ఆధారపడడం అనివార్యమవుతోంది. అయితే రోడ్లపై మరింత అస్తవ్యస్త పరిస్థితులను సృష్టిస్తున్నాయి. అయినా ఇవి కీలకమైనవి. గమ్యాన్ని చేరుకునేందుకు లక్షలాది ప్రజలకు అనువైన, భరించగల ప్రయాణ ప్రత్యామ్నాయంగా ఉంటున్నాయి. గుర్తించవలసిన వాస్తవమేమిటంటే ఈ రవాణా వ్యవస్థ ప్రణాళికాబద్ధంగా, నియంత్రితంగా లేదు. వాటిపై నియంత్రణ లేదు. వీటి ప్రాధాన్యాన్ని గుర్తించని పక్షంలో నగరాలలో రవాణా పద్ధతులను సౌకర్యవంతంగా తీర్చిదిద్దలేము. మరి ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు మార్గాంతరమేమిటి? ప్రజా రవాణా వ్యవస్థను మరింత విస్తృతమూ, పటిష్ఠం చేయాలి. బస్సుల సంఖ్యను మెట్రో రైళ్లను పెంచాలి. గమ్యాలకు వడిగా చేరేందుకు కాలి బాటలను నిర్మించాలి. వాహనాల కదలికలను నియంత్రించాలి. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన వారికి భారీ జరిమానాలు విధించాలి. చట్టవిరుద్ధ పార్కింగ్‌ను అరికట్టాలి. ఇవన్నీ మనకు తెలుసు. అయితే ఈ విషయమై మనం కలిసికట్టుగా కృషి చేయడం లేదు. అందుకు బదులుగా రోడ్డు వెడల్పు జరిగితే మనకు బాధలు తప్పిపోతాయని ఆశిస్తాం. ఇప్పటికైనా మనం మేల్కొనాలి. ట్రాఫిక్ పరిస్థితులను సమగ్రంగా ఆకళింపు చేసుకోవాలి.

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

స్వరాజ్య విజేతలు

స్వాతంత్ర్య సమరయోధులు వారు
మహనీయులు మహాపురుషులు

స్వార్థమెరుగని త్యాగధనులు
ధర్మాన్ని నమ్మిన ఆదర్శవంతులు
నీతిగా బతికిన నిజాయతీపరులు
భరతజాతికి పునాదులు వారు

ఆయుధం లేని సైనికులు
ఆత్మవిశ్వాసంలో అతిబలవంతులు
సత్య అహింసలతో సమరం సలిపి
స్వరాజ్యం సాధించిన విజేతలు వారు

మతం కన్నా మానవత్వం గొప్పదని
మానవసేవయే మాధవసేవయని
ప్రేమ స్వరూపమే పరమాత్మయని
ప్రబోధించిన పరమహంసలు వారు

విభజనలు విద్వేషాలు
అభ్యుదయానికి అడ్డుగోడలని
భిన్నత్వంలో ఏకత్వాన్ని దర్శించిన
వేదాంత విదుషీమణులు వారు

తల్లి భారతి ముద్దుబిడ్డలు
భావి భారత స్ఫూర్తిదాతలు
దేశ ప్రగతికి జ్ఞానదీపికలు
మృత్యుంజయులు మన అమరవీరులు

– ఐ.జి. కన్నన్

నా జెండా

దారం సమైక్యగీతానికి బాణీ కట్టింది
దండలో రంగురంగుల పూలు
గొంతువిప్పాయి

గాంధీ –
స్వేచ్ఛగా ఎగురుతున్న
శాంతి కపోతాన్ని చూశాడేమో
దేశపటాన్ని బాగా గీశాడు

సమూహాన్ని నడిపించే
ఇంధన రహస్యం
గాంధీకి మాత్రమే తెలుసు

తుపాకీపై పావురం వాలింది
ఆంగ్లేయులపై అహింసావాది

ముందుకు సాగిపో!
అదిగో! నువ్వెగరేసే జెండా

కశ్మీరు కుంకుమ దిద్దుకొన్నాను
మల్లెలు తురుముకొన్నాను
ఆకుపచ్చ ఖద్దరు చీర ధరించాను
ఆయుధం లేకుండా గెలిచిన వీరనారిని

నా జెండా – రెపరెపల భాషలో
దేశభక్తి గీతాల్ని
ఆలపిస్తోంది

– రసరాజు

కూలుతున్న జగన్ కోటలు

నలభై ఏళ్ల తర్వాత పులివెందుల ప్రజలు ధైర్యంగా, స్వేచ్ఛగా ఓటేశారు. గతంలో అక్కడ ఏ ఎన్నిక నిర్వహించినా రక్తపాతం జరగాల్సిందే. అయితే ఈసారి అలాంటి ఆటలేవీ సాగలేదు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికను టీడీపీ, వైసీపీ ఎంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయో అధికార యంత్రాంగం కూడా అంతే పట్టుదలగా తీసుకుంది. ఎంపీ అవినాశ్‌రెడ్డిని, అధికార పార్టీ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిని పోలింగ్‌కు ముందే పోలీసులు అరెస్టు చేశారు. కొన్ని చెదురుమదురు ఘటనలు మినహా పులివెందుల, ఒంటిమిట్ట స్థానాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రెండు స్థానాల్లోనూ కూటమి ఘన విజయం సాధించింది. తన సొంత నియోజకవర్గమైన పులివెందులలో డిపాజిట్ కోల్పోయినందుకు జగన్‌రెడ్డి సిగ్గుపడాలి. నాడు కుప్పం పురపాలక ఎన్నికల్లో తెలుగుదేశం ఓడిపోయినందుకు 'చంద్రబాబు అసెంబ్లీకి వస్తే ఆయన ముఖం చూడాలని ఉంది' అంటూ వెటకారంగా మాట్లాడిన జగన్‌రెడ్డి, నేడు పులివెందులలో డిపాజిట్ కోల్పోయినందుకు తల ఎక్కడ పెట్టుకుంటారో?!

ఎన్నికల్లో గెలుపునకు రాజ్యాంగ వ్యవస్థల్ని భ్రష్టు పట్టించడంలో జగన్‌రెడ్డి తన తండ్రి కంటే నాలుగాకులు ఎక్కువే చదివారు. సామ, దాన, భేద, దండోపాయాలతో ఓటర్లను ఓడించి మరీ తాను గెలవడానికి అలవాటుపడిన ఆయనకు ఈసారి దొంగ ఓట్లు గుద్దుకోవడానికి వీలు పడకపోయి ఉండవచ్చు. ఏ ఎన్నికలైనా ఏకపక్షంగా జరిగిపోవాలన్నదే ఫ్యాక్షనిస్టుల నైజం కదా! ఆ అక్కసుతోనే ఎన్నికల ఫలితాలపై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. 'పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికల్లో పోలీసులు పచ్చ చొక్కాలు వేసుకుని డ్యూటీ చేశారు. చంద్రబాబూ! నీకు ఇవే చివరి ఎన్నికలు కావచ్చు. ఈ ముసలి వయసులో కృష్ణా, రామా అనుకుంటూ ఉంటే కాస్త పుణ్యమైనా వస్తుంది. లేదంటే నరకానికి పోతావ్' అంటూ సీఎం చంద్రబాబుపై ఈ పిచ్చిరెడ్డి నోరు పారేసుకున్నారు. డీఐజీ వ్యవస్థ మాఫియా ముఠా లాగా పనిచేస్తున్నదని, చంబల్ లోయ బందిపోట్లను మరిపించేలా దౌర్జన్యంగా ఓట్లు వేయించుకున్న చంద్రబాబు ఓ ఫ్రాడ్‌స్టర్ అంటూ ముఖ్యమంత్రిపై దిగజారుడు వ్యాఖ్యలు చేయడం జగన్ నీచ రాజకీయానికి నిదర్శనం. అసలైన చంబల్ లోయ బందిపోట్లు ఎవరో ఆ పార్టీ నేత, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను అడిగితే చెప్పగలరు. సీఎం చంద్రబాబు ప్రపంచ స్థాయి నాయకుడు. ఆయన విలువ జగన్ వంటి మానసిక మరుగుజ్జులకు తెలియదు. అయిదేళ్ల పాటు ప్రజాస్వామ్యాన్ని నరికి పోగులు పెట్టినందుకే కేవలం 11 సీట్లిచ్చి, ప్రతిపక్షానికి కూడా జగన్ పనికిరాడంటూ ఆయన్ను జనం తరిమేశారు. అయినా తన బుద్ధి, భాషను జగన్ మార్చుకోవడం లేదు. పైగా మూడేళ్లు కళ్లు మూసుకుంటే మళ్లీ అధికారంలోకి వస్తానని పగటి కలలు కంటున్నారు.

అసలు ప్రజాస్వామ్య హంతకుడు జగన్‌రెడ్డే. హిట్లర్, ముస్సోలిని, ఈడీ అమీన్, కిమ్ ఆలోచనల ప్రతిరూపమే జగన్. తాను అధికారంలో ఉన్నప్పుడు అహంకారంతో, ఫ్యూడలిస్టు స్వభావంతో పాలన సాగించారు. అధికారం కోసం ఏమైనా చేయగల ఔరంగజేబు జగన్‌రెడ్డి. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ధనం, మద్యం పంపిణీని అడ్డుకుంటున్నానని చెబుతూ, ఆ వంకతో తనకు అనుకూలంగా అనేక ఆర్డినెన్సులు, జీవోలు జారీ చేశారు. ఎన్నికల నిర్వహణకు 21రోజులు ఉన్న సమయాన్ని 14 రోజులకు తగ్గించారు. ఎన్నికల ప్రచారం చేసుకునే అవకాశాల్ని సైతం ప్రతిపక్షాలకు దూరం చేశారు.

> ఎన్నికల్లో గెలుపునకు రాజ్యాంగ వ్యవస్థల్ని భ్రష్టుపట్టించడంలో జగన్‌రెడ్డి తన తండ్రి కంటే నాలుగాకులు ఎక్కువే చదివారు. సామ, దాన, భేద, దండోపాయాలతో ఓటర్లను ఓడించి మరీ తాను గెలవడానికి అలవాటుపడిన ఆయనకు ఈసారి దొంగ ఓట్లు గుద్దుకోవడానికి వీలుపడకపోయి ఉండవచ్చు. ఏ ఎన్నికలైనా ఏకపక్షంగా జరిగిపోవాలన్నదే ఫ్యాక్షనిస్టుల నైజం కదా!



నాటి స్థానిక ఎన్నికల్లో ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నామినేషన్లు వేయకుండా జగన్ వర్గం అనేక రకాలుగా అడ్డుకోవడం రాష్ట్ర ప్రజలకు తెలియంది కాదు. ఎన్నికల అనంతరం ఒకవేళ ప్రతిపక్షం నుంచి ఎవరైనా గెలిచినా, 'డబ్బు, మద్యం పంపిణీ చేశార'ని ఆరోపిస్తూ వారిపై జగన్ కేసులు పెట్టించారు. మెజారిటీ స్థానాలను ఏకగ్రీవం చేసుకున్నారు. 'అసలు ఎన్నికల్లో ప్రతిపక్షం పోటీ చేయడం అవసరమా?' అన్న విధంగా వ్యవహరించారు. 9,696 ఎంపీటీసీల్లో 2,362 స్థానాలు, 652 జెడ్పీటీసీల్లో 140 వైకాపా అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇవన్నీ జగన్‌రెడ్డి అప్రజాస్వామికంగా గెలిచినవి కావా? పురపాలక ఎన్నికల్లో కూడా ప్రతిపక్షం నామినేషన్ వెయ్యలేకపోయింది. బెదిరింపులతో, వేధింపులతో అక్కడా అధిక స్థానాలను వైసీపీ ఏకగ్రీవం చేసుకుంది. ప్రతిపక్ష అభ్యర్థులను పోలీస్ స్టేషన్లకు పిలిపించి మరీ వారి నామినేషన్లను ఉపసంహరింపజేశారు. 'ఎన్నికల ఫలితాల రోజు కౌంటింగ్‌ను ఆలస్యంగా మొదలుపెట్టించడం, ఆ సమయంలో కరెంటు కట్ చేయించడం, పోలీసులు ఎన్నికల ఏజెంట్లను బెదిరించి బయటకు పంపడం, తక్కువ ఓట్లతో ప్రతిపక్షం ఓడిపోయి రీ కౌంటింగ్ అడిగినా చెయ్యకపోవడం, అధికార పక్షమైన వైసీపీ తక్కువ ఓట్లతో ఓడిపోతే ఒకటికి రెండుసార్లు రీకౌంటింగ్ చేయించడం...' వంటి వికృతాలు జగన్ పాలనలో ఎన్నో జరిగాయి. ఇవి స్వయంగా ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులు చెప్పిన వివరాలే సుమా! కార్పొరేషన్స్, మున్సిపల్ ఎన్నికల్లోనూ వైసీపీ నాయకులు నిస్సిగ్గుగా వ్యవహరించారు. వాటిలో 578 ఏకగ్రీవాలు అయితే, అందులో 571 అధికార పార్టీ అభ్యర్థులు ఏకగ్రీవం అయినట్లు డబ్బాలు కొట్టుకున్నారు. అక్కడా ఏకగ్రీవాల వెనుక ఉన్నవి బెదిరింపు రాజకీయాలే. రాష్ట్ర రాజకీయాలను భ్రష్టుపట్టించి, ప్రజాస్వామ్యాన్ని మేడిపండుగా మార్చారు. చట్టబద్ధ పాలనకు జగన్‌రెడ్డి సమాధి కట్టారు. 'ప్రజాస్వామ్యం' అన్న పదం ఆయన నోటి వెంట తప్ప ఆచరణలో ఎక్కడా కనిపించదు.

■ కలిశెట్టి అప్పలనాయుడు
ఎంపీ, విజయనగరం


త్రివర్ణ కాంతులీనుతున్న శ్రీశైలం జలాశయం

'శ్రీశైలం' మూడు గేట్ల నుంచి నీటి విడుదల

నంద్యాల, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయం మూడు క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 79,956 క్యూసెక్కులు, శ్రీశైలం కుడి ఎడమగట్టు జల ఉత్పాదన కింద 66,224 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేసుల, హంద్రీల నుంచి 1,27,130 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరుతోంది. జలాశయంలో గురువారం రాత్రి 9 గంటలకు 881.90 అడుగుల నీటి నిల్వ ఉండగా.. నీటి లభ్యత 198.3623 టీఎంసీలుగా నమోదైంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా డ్యాం గేట్లకు అధికారులు జాతీయ పతాక రంగుల్లో విద్యుత్ దీపాలంకరణ చేశారు. దీంతో శ్రీశైలం జలాశయం త్రివర్ణ శోభను సంతరించుకుంది.

వచ్చే నెల 17 లేదా 18 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- అన్ని పార్టీలూ హాజరైతే ప్రజాసమస్యలపై ఆరోగ్యకర చర్చ: అయ్యన్న
- శాసనసభలో కొత్త ప్రింటింగ్ యంత్రాలను ప్రారంభించిన స్పీకర్


శాసనసభలో ఆధునిక ముద్రణా యంత్రాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్న

అమరావతి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు సెప్టెంబరు 17 లేదా 18 నుంచి నిర్వహించనున్నట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. గురువారం శాసనసభ ప్రాంగణంలో అత్యాధునిక ప్రింటింగ్ యంత్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాల సమావేశాలను 10 రోజులపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని పార్టీల సభ్యులు హాజరైతే ప్రజాసమస్యలపై ఆరోగ్యకరమైన చర్చ జరగడానికి ఆస్కారం ఉంటుందన్నారు. కొత్త ప్రింటింగ్ యంత్రాలు అత్యంత వేగవంతమైనవే కాకుండా, అత్యుత్తమ ప్రింట్ నాణ్యతను అందిస్తాయని చెప్పారు. శిక్షణ పొందిన సిబ్బందితో పాటు కొత్తగా చేరిన సిబ్బంది కూడా ఈ యంత్రాలను సులభంగా నిర్వహించగలరన్నారు. ప్రింటింగ్‌తో పాటు ఆటోమేటిక్ స్పైరల్ బైండింగ్ సదుపాయం కూడా వీటిలో ఉందని చెప్పారు. శాసనసభకు సంబంధించిన ప్రశ్నలు, సమాధానాలు, ప్రకటనలు, కార్యాచరణ నివేదికలు తదితరాలను వీటి ద్వారా అత్యంత వేగంగా ముద్రించవచ్చన్నారు.

అంకితభావానికి అందలం

- రాష్ట్రంలో 25 మందికి పోలీసు పతకాలు
- జాబితాలో ఐజీ రవికృష్ణ, ఎస్పీ భద్రయ్య
- జైళ్ల శాఖ డీఐజీ వరప్రసాద్‌తో పాటు మరో ఇద్దరికి విశిష్ట సేవా పురస్కారాలు


ఐజీ రవికృష్ణ | జైళ్ల శాఖ డీఐజీ వరప్రసాద్ | ఎస్పీ భద్రయ్య

అమరావతి/న్యూఢిల్లీ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ధైర్యసాహసాలు, అంకితభావం ప్రదర్శించిన పోలీసు సిబ్బంది జాతీయ స్థాయి పురస్కారాలకు ఎంపికయ్యారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా యూనిఫాం సర్వీసులకు కేంద్రం పతకాలు ప్రకటించింది. రాష్ట్రపతి పోలీసు సేవ, విశిష్ట సేవ, కరెక్షనల్ సర్వీస్ విభాగాల్లో రాష్ట్రానికి చెందిన 25 మంది పోలీసులు, జైళ్ల శాఖ అధికారులు ఈ జాబితాలో ఉన్నారు. సీఎం చంద్రబాబుకు నిరంతరం రక్షణ కల్పిస్తున్న ఐపీఎస్‌డబ్ల్యూ ఎస్పీ చెన్నుపాటి భద్రయ్యతో పాటు డీఎస్పీ రాజీవ్‌కుమార్‌ను రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం వరించింది. 'ఈగల్' ఐజీ ఆకే రవికృష్ణ ప్రతిభా పూర్వక సేవా పతకానికి ఎంపికయ్యారు. పార్వతీపురం, చింతపల్లి, కొత్తగూడెం ప్రాంతాల్లో పనిచేసిన రవికృష్ణ మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో 'గాంధేయ పోలీసింగ్'తో ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. 'అమ్మ పిలుపు' కార్యక్రమం ద్వారా మావోయిస్టులను అడవుల నుంచి సమాజంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేశారు. కర్నూలు జిల్లా ఎస్పీగా ఉన్న సమయంలో ఫ్యాక్షన్ గ్రామం కప్పట్రాళ్లను దత్తత తీసుకుని శాంతి పథంలో నడిపించి ప్రశంసలు అందుకున్నారు. ఆ తర్వాత ఐబీలో చేరి భారత్ తరపున చైనాలో పనిచేశారు.

జైళ్లలో సంస్కరణలకు మార్గదర్శి డాక్టర్ వరప్రసాద్

రాష్ట్రంలోని జైళ్లలో పరిపాలన సంస్కరణలకు నాంది పలికి అత్యుత్తమ ఫలితాలు సాధించిన డీఐజీ ఎం.వరప్రసాద్‌కు సేవా పురస్కారం లభించింది. కస్టడీ, కేర్, కరెక్షన్ అనే మూడు ప్రధాన లక్ష్యాలను సమర్థంగా అమలు చేస్తూ ఖైదీల జీవితాల్లో మార్పు తీసుకొచ్చిన ఆయన పనితీరును కేంద్రం గుర్తించింది. ఖైదీల్లో నైపుణ్యాభివృద్ధి పెంచడం ద్వారా విడుదల అనంతరం వారి ఉపాధికి మార్గం చూపారు. సీఎస్ఆర్ నిధులు సమీకరించి జైళ్లలో వసతులు కల్పించడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 18 పెట్రోలు బంకులు ఏర్పాటు చేయించి పునరావాసం పొందిన ఖైదీలకు ఉపాధి కల్పించారు. ఏపీ మోడల్ ప్రిజన్స్ యాక్ట్-2023 రూపకల్పనలో ఆయన కీలకంగా వ్యవహరించారు. వినూత్న ఆలోచనలతో జైళ్ల శాఖను నూతన దిశగా నడిపించారు.

పతకాలకు ఎంపికైనవారు...

ప్రతిభా పూర్వక సేవా పతకాలు పొందినవారిలో వల్లూరు శ్రీనివాసరావు(డీఎస్పీ), వీరవెంకట ప్రతాప్ కుమార్ (డీఎస్పీ), కె. రామచంద్రరాజు (అసిస్టెంట్ కమాండెంట్), మామిడి గోవిందరావు (ఇన్‌స్పెక్టర్), జి. రామకృష్ణ (ఇన్‌స్పెక్టర్), బొడ్డు శ్రీనివాసరావు (హెడ్ కానిస్టేబుల్), కె. సీతారాము (సబ్ ఇన్‌స్పెక్టర్), పెద్దిరెడ్డి చంద్రశేఖర్ (ఏఎస్ఐ), నాగమల్లేశ్వరరావు (ఏఎస్ఐ), వెంకట రామశర్మ (ఏఎస్ఐ), ఉస్మాన్ ఘనీ ఖాన్ (ఏఎస్ఐ), కురువ గోపాల్ (సబ్ ఇన్‌స్పెక్టర్), కొత్తకోట కోటేశ్ (సబ్ ఇన్‌స్పెక్టర్), డి. నాగేశ్వరరావు (ఏఎస్ఐ), పామర్తి సీతారామాంజనేయులు (ఏఎస్ఐ), నాగబాబు కొప్పిశెట్టి (ఏఎస్ఐ), జి. గోపాలకృష్ణ (హెడ్ కానిస్టేబుల్), సురేశ్ కుమార్ మురుగేశన్ (హెడ్ కానిస్టేబుల్), జి. దానం (హెడ్ కానిస్టేబుల్)తో పాటు జైళ్లశాఖకు చెందిన రవికుమార్ కరణం (చీఫ్ హెడ్ వార్డర్), తలపర్తి వీరవెంకట సత్యనారాయణ (హెడ్ వార్డర్) ఉన్నారు.

ఇద్దరు ఆర్‌పీఎఫ్ అధికారులకూ..

రాష్ట్రానికి చెందిన ఇద్దరు ఆర్‌పీఎఫ్ అధికారులు రాష్ట్రపతి పోలీసు సేవ పతకానికి ఎంపికయ్యారు. గుంటూరులో ఆర్‌పీఎఫ్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ జి. మధుసూదనరావు, రేణిగుంటలో ఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ కె. రాజగోపాలరెడ్డి ఈ అవార్డులు అందుకోనున్నారు. ఐఆర్‌పీఎఫ్ఎస్ అధికారి అయిన మధుసూదనరావు 1989లో ఆర్‌పీఎఫ్‌లో సబ్-ఇన్‌స్పెక్టర్‌గా విధుల్లో చేరారు. 2016లో ఇండియన్ పోలీస్ మెడల్, 2014లో డీజీ/ ఆర్‌పీఎఫ్ ఇన్సిగ్నియా, జీఎం మెడల్, వీసీఎస్‌సీ అవార్డులు, 16 డీఆర్ఎం అవార్డులు అందుకున్నారు. ఇక రాజగోపాల్‌రెడ్డి 2012లో ఇండియన్ పోలీస్ మెడల్‌తో పాటు తన పరిశోధనాత్మక నైపుణ్యాలకు గాను అనేక జాతీయ అవార్డులు గెలుచుకున్నారు. కొసావో, దక్షిణ సూడాన్‌లో ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక మిషన్లలో పోలీసు సలహాదారుగా సేవలు అందించినందుకు నాలుగు పతకాలు అందుకున్నారు. కాగా, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ వీరిద్దరినీ అభినందించారు. రైల్వే ఆస్తులు, ప్రయాణికుల భద్రత విషయంలో వారు చూపించిన అంకితభావాన్ని ఆయన ప్రశంసించారు.

ఎనిమిదేళ్లలో ఆరుసార్లు!

- తెలుగు తేజానికి మరోసారి శౌర్య పురస్కారం
- ప్రస్తుతం శ్రీనగర్ సీనియర్ ఎస్పీగా విధుల్లో


డాక్టర్ జీవీ సందీప్ చక్రవర్తి

కర్నూలు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరానికి చెందిన డాక్టర్ జీవీ సందీప్ చక్రవర్తి ఆరోసారి రాష్ట్రపతి శౌర్య పురస్కారానికి ఎంపికయ్యారు. కర్నూలు సర్వజన వైద్యశాల రిటైర్డ్ ఆర్ఎంఓ డాక్టర్ జీవీ రామగోపాల్‌రావు, పీసీ రంగమ్మ (ఆరోగ్యశాఖ రిటైర్డ్ అధికారి) దంపతుల మూడో సంతానం సందీప్ చక్రవర్తి. కర్నూలు మెడికల్ కళాశాల (కేఎంసీ)లో ఎంబీబీఎస్ పూర్తిచేసి డాక్టర్ పట్టా అందుకున్నారు. తొలి ప్రయత్నంలోనే సివిల్స్-2014లో ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. శిక్షణ అనంతరం శ్రీనగర్ అడిషనల్ ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. జమ్మూ కశ్మీర్‌లోని పలు జిల్లాల్లో ఏఎస్పీ, ఎస్పీగా విధులు నిర్వర్తించిన ఆయన ప్రస్తుతం శ్రీనగర్ సీనియర్ ఎస్పీగా పని చేస్తున్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, విద్రోహ, అరాచక శక్తులను అణచివేయడంలో చూపించిన ధైర్యసాహసాలకు 2017లో తొలిసారిగా రాష్ట్రపతి శౌర్య పతకం అందుకున్నారు. రాష్ట్రపతి శౌర్య పురస్కారాలతో పాటు ఇప్పటి వరకూ నాలుగుసార్లు జమ్మూ కశ్మీర్ పోలీస్ మెడల్ ఫర్ గ్యాలెంట్రీ, ఇంకా పలు అవార్డులను సందీప్ అందుకున్నారు.

'ఆపరేషన్ సిందూర్' వీరులకు శౌర్య పతకాలు

16 మంది బీఎస్ఎఫ్ సిబ్బందికి ప్రకటించిన కేంద్రం

న్యూఢిల్లీ, ఆగస్టు 14: ఆపరేషన్ సిందూర్ సమయంలో అసాధారణ ధైర్యసాహసాలు, అసమాన శౌర్యపరాక్రమాలు ప్రదర్శించిన 16 మంది సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) సిబ్బందికి శౌర్య పతకాలు లభించాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం వివిధ దళాలకు పురస్కారాలు ప్రకటించింది. సరిహద్దుల్లోని వేర్వేరు పోస్టుల్లో విధులు నిర్వర్తించిన సబ్ ఇన్‌స్పెక్టర్ వ్యాస్ దేవ్, కానిస్టేబుల్ సుద్ది రభా, అసిస్టెంట్ కమాండెంట్ అభిషేక్ శ్రీవాస్తవ్, హెడ్ కానిస్టేబుల్ బ్రిజ్ మోహన్ సింగ్, కానిస్టేబుళ్లు భూపేంద్ర బాజ్‌పాయ్, రాజన్ కుమార్, బసవరాజ శివప్ప సుంకడ, దేపేశ్వర్ బర్మన్, డిప్యూటీ కమాండెంట్ రవీంద్ర రాథోడ్, ఇన్‌స్పెక్టర్ దేవీ లాల్, హెడ్ కానిస్టేబుల్ సాహిబ్ సింగ్, కానిస్టేబుల్ కన్వరాజ్ సింగ్, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఉదయ్ వీర్ సింగ్, ఏఎస్ఐ రాజప్ప, కానిస్టేబుల్ మనోహర్ క్సాల్క్సో, అసిస్టెంట్ కమాండెంట్ అలోక్ నేగి అవార్డుకు ఎంపికయ్యారు. వీరిలో కొందరు పాక్ డ్రోన్లను కూల్చివేయగా, మరికొందరు శత్రు దేశ నిఘా వ్యవస్థలను ధ్వంసం చేశారు. గాయపడిన సహచరులను రక్షించారు. కాగా, వివిధ ఆపరేషన్లలో పాల్గొన్న ఇతర పోలీసులు, కేంద్ర సాయుధ పోలీసు దళాల సిబ్బందికి కూడా శౌర్య పతకాలు ప్రకటించింది. వీరిలో జమ్మూ కశ్మీర్ పోలీసులు 128 మంది, 20 మంది సీఆర్‌పీఎఫ్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు 14 మంది ఉన్నారు.

1,090 మందికి పోలీసు మెడల్స్

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా 1,090 మంది పోలీసు సిబ్బందికి కేంద్రం సేవా పతకాలను ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ గురువారం అవార్డుల జాబితాను విడుదల చేసింది. 233 మందికి గ్యాలంట్రీ పతకాలు(జీఎం), 99 మందికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు(పీఎస్ఎం), 758 మందికి పోలీసు విశిష్ట సేవా (ఎంఎస్ఎం) పతకాలను ప్రకటించింది. శౌర్య పతకాలు పొందిన వారిలో జమ్మూ కశ్మీర్ నుంచి అత్యధికంగా 152 మంది ఉండగా, నక్సల్ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్న 54 మందికి, ఇతర ప్రాంతాలకు చెందిన 27 మందికి అవార్డులు ఇవ్వనుంది.


ఆలయం ముందు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, జస్టిస్ లలిత, జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎన్వీ రమణ

శ్రీవారి సేవలో న్యాయమూర్తులు

తిరుమల, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గురువారం ఉదయం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, సుప్రీం కోర్టు న్యాయమూర్తి జేకే మహేశ్వరి, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లలిత రాత్రి నైవేద్య విరామ సమయంలో శ్రీవారి దర్శనం చేసుకున్నారు.

ఏసీబీ వలలో అనకాపల్లి ఎస్ఐ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సీజ్ చేసిన దుకాణం తాళాలు ఇవ్వడానికి యజమాని నుంచి రూ.50 వేలు లంచం తీసుకుంటూ అనకాపల్లి పట్టణ ఎస్ఐ దాసరి ఈశ్వరరావు అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ నాగేశ్వరరావు వెల్లడించిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన ఎస్ఆర్‌జే అప్పారావుకు మెయిన్‌రోడ్డులోని చిననాలుగురోడ్ల జంక్షన్ సమీపంలో ఒక దుకాణం ఉంది. పశ్చిమ బంగకు చెందిన నలుగురు యువకులు ఈ ఏడాది మే నెలలో ఆ దుకాణాన్ని అద్దెకు తీసుకుని రూ.రెండు లక్షలు అడ్వాన్స్ ఇచ్చారు. అయితే జూలై 16న ఆ నలుగురు అద్దెకు తీసుకున్న దుకాణం పక్కన ఉన్న బుద్ద శ్రీనివాసరావుకు చెందిన బంగారు ఆభరణాల దుకాణంలో చోరీకి యత్నించారు. ఆ ప్రయత్నం విఫలం కావడంతో పరారయ్యారు. ఫిర్యాదు అందడంతో పట్టణ పోలీసులు దుకాణ యజమాని అయిన అప్పారావును పిలిపించారు. ఎస్ఐ ఈశ్వర రావు.. షాపు తాళాలు స్వాధీనం చేసుకొని తన వద్ద ఉంచుకున్నారు. అంతే కాకుండా యువకులు ఇచ్చిన అడ్వాన్స్ కూడా అప్పారావు నుంచి తీసుకున్నారు. ఆగస్టు రెండో తేదీన అప్పారావును రఘురాం కాలనీలో తాను నివాసం ఉంటున్న ఇంటికి పిలిపించి తాళాలు తిరిగి ఇచ్చేందుకు, చోరీ యత్నం కేసులో పేరు రాకుండా చూడడానికి రూ.50 వేలు లంచం ఇవ్వాలని కోరారు. దీనిపై అప్పారావు బుధవారం ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి సూచన మేరకు అప్పారావు గురువారం మధ్యాహ్నం ఎస్ఐ ఇంటికి వెళ్లి రూ.50 వేలు లంచం ఇస్తుండగా, ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎస్ఐ ఈశ్వరరావు అరెస్టు చేశామని, శుక్రవారం ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ నాగేశ్వరరావు తెలిపారు.

పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలి

- ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్

విజయవాడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి సంబంధించిన స్త్రీ శక్తి పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం విజయవాడ బస్టాండులో ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జీ.వీ. నరసయ్య స్త్రీ శక్తి పథకం విజయవంతం కావడానికి ఏపీపీటీడీ(ఆర్టీసీ) ఉద్యోగులంతా సంపూర్ణ సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నామని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో మహిళా ప్రయాణికులకు స్త్రీ శక్తి పథకం ద్వారా శుభవార్త అందించినట్టే పదోన్నతుల ఫైల్‌పై సంతకం చేసి ఉద్యోగులకు శుభవార్త అందించాలని వారు కోరారు.

నిద్రిస్తున్న చిన్నారిని ఈడ్చుకెళ్లిన చిరుత!

- స్థానికులు కేకలు వేయడంతో పొదల్లో వదిలేసి పరుగు
- పాప తలకు, పొట్ట భాగంలో తీవ్ర గాయాలు
- ప్రకాశం జిల్లాలోని పెద్దదోర్నాల మండలంలో ఘటన


చిరుతపులి దాడిలో గాయపడిన చిన్నారి అంజమ్మ

ఆత్మకూరు/పెద్దదోర్నాల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం సమీపంలోని ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండలం చిన్నారుట్ల చెంచుగూడెంలో చిరుత కలకలం రేపింది. నిద్రిస్తున్న సమయంలో ఓ మూడేళ్ల చిన్నారిని చిరుత పులి ఈడ్చుకెళ్లే ప్రయత్నం చేయగా.. గూడెం వాసులు కేకలు వేయడంతో పొదల్లో వదిలేసి వెళ్లింది. బుధవారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటనలో బాధిత పాపకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీశైలానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్నారుట్ల చెంచుగూడెంకు చెందిన కుడుముల అంజయ్య, భార్య లింగేశ్వరి, వారి కుమార్తె అంజమ్మ బుధవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో వచ్చిన చిరుతపులి అంజయ్య పక్కనే నిద్రిస్తున్న అంజమ్మ తలను నోటికి కరుచుకొని అక్కడి నుంచి నెమ్మదిగా వెళ్లసాగింది. ఈ క్రమంలోనే ఆ చిన్నారి ఏడవడంతో తల్లిదండ్రులు ఒక్కసారిగా లేచి.. కర్ర చేతపట్టుకుని కేకలు వేస్తూ దాని వెంటపడ్డాడు. విషయం తెలుసుకున్న గూడెంవాసులు కూడా వారికి తోడయ్యారు. దీంతో కొంత దూరంలో పులి ఆ చిన్నారిని చెట్లపొదల్లో వదిలేసి వెళ్లిపోయింది. ఈ ఘటనలో చిన్నారి తలకు, పొట్ట భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. సున్నిపెంట ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయడంతో ప్రాణాపాయం తప్పింది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ మహేష్ చిన్నారిని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్నారిని మెరుగైన వైద్యం కోసం దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

విద్యుత్ సదుపాయం లేకపోవడం వల్లే..

ఇదిలా ఉండగా తమ గూడేనికి విద్యుత్ సదుపాయం లేకపోవడం వల్లే వన్యప్రాణుల నుంచి ముప్పు వాటిల్లిందని, విద్యుత్ సరఫరా అందించాలని స్థానికులు గురువారం దోర్నాల-శ్రీశైలం రోడ్డుపై ధర్నా చేపట్టారు. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దోర్నాల పోలీసు, అటవీ అధికారులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పారు. గూడేనికి విద్యుత్ సరఫరా అందించేలా చొరవ తీసుకుంటామని చెప్పడంతో వారు శాంతించారు. గూడెంలోకి వన్యప్రాణులు రాకుండా అటవీ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వీరయ్య చౌదరి హత్య కేసులో ప్రధాన సూత్రధారి 'ముప్పా' సరెండర్

- ముందస్తు బెయిల్ తిరస్కరించిన సుప్రీం కోర్టు
- విధిలేక ఎస్పీ ఎదుట లొంగుబాటు.. గోప్యంగా విచారణ

ఒంగోలు క్రైం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకుడు ముప్పవరపు వీరయ్యచౌదరి హత్య కేసులో ప్రధాన సూత్రధారి ముప్పా సురేశ్ గురువారం ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ ఎదుట లొంగిపోయాడు. అతన్ని పోలీసులు గోప్యంగా విచారిస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో వీరయ్యచౌదరి ఒంగోలులో దారుణ హత్యకు గురైన విషయం విదితమే. ఈ కేసులో ఇప్పటికే 9 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మూడు నెలలుగా సురేశ్ పరారీలో ఉన్నాడు. ముందస్తు బెయిల్ కోసం జూలై 27న సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా ఈ నెల 11న విచారించింది. ఈ సందర్భంగా వీరయ్యచౌదరి హత్యకేసులో ప్రధాన నిందితుడు వినోద్‌కు సురేశ్ వ్యాపార సంస్థల నుంచి నగదు బదిలీ అయినట్లు పోలీసులు కోర్టుకు తెలిపారు. నిందితులతో మాట్లాడిన సురేశ్ కాల్ డేటాను కూడా సమర్పించారు. దీంతో ఆయన బెయిల్ పిటిషన్‌ను సుప్రీం కోర్టు తిరస్కరించింది. అప్పటికే అతనికి హైకోర్టులో కూడా చుక్కెదురవడంతో విధిలేని పరిస్థితుల్లో పోలీసులకు లొంగిపోయాడు. ఈ కేసులో అరెస్టు అయిన 9 మందిలో నలుగురికి ఇప్పటికే బెయిల్ మంజూరైంది. నలుగురు కిరాయి హంతకులతో పాటు ప్రధాన నిందితుడు వినోద్ రాజమండ్రి జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు.

తిరుమలలో చోరీ

- కారు అద్దాలు పగలగొట్టి బంగారు కమ్మల అపహరణ

తిరుమల, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): తిరుమలలో పార్కింగ్ చేసిన కారు నుంచి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. తమిళనాడులోని వేలూరుకు చెందిన నిత్యవేల్ తన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం రాత్రి కారులో తిరుమల వచ్చారు. నారాయణగిరి విశ్రాంతి భవనం ముందున్న ప్రదేశంలో కారు పార్కింగ్ చేశారు. దర్శనం అనంతరం గురువారం ఉదయం కారు వద్దకు రాగా, అద్దాలు పగిలిపోవడాన్ని గుర్తించారు. సీట్లోని బ్యాగులు కూడా చెల్లాచెదురుగా పడి ఉండటంతో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు జతల బంగారు కమ్మలు ఎత్తుకుపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

'నాలుగేళ్ల' స్థానికతతోనే ముందుకు!

- ఇంజనీరింగ్ సీట్ల కేటాయింపు పూర్తి
- తుది విడతలో 14,409 మందికి.. మొత్తంగా 1.20 లక్షల సీట్లు భర్తీ

అమరావతి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ సీట్ల కేటాయింపుపై ఉన్నత విద్యాశాఖ స్థానికత విషయంలో ఈ ఏడాది విడుదల చేసిన జీవో ఆధారంగానే నిర్ణయం తీసుకుంది. హైకోర్టు ఆదేశాలతో తుది విడత సీట్లు కేటాయింపు ప్రక్రియను సాంకేతిక విద్యాశాఖ గురువారం పూర్తి చేసింది. తుది విడతలో కొత్తగా 2,645 మంది దరఖాస్తు చేసుకున్నారు. అలాగే మొదటి విడతలోనే దరఖాస్తు చేసుకున్నా సీటు లభించని వారికి కలిపి మొత్తంగా 14,409 మందికి సీట్లు కేటాయించారు. అర్హత పరీక్షలకు ముందు నాలుగేళ్లలో ఒక్క ఏడాదైనా బయటి రాష్ట్రాల్లో చదివితే.. ఆ విద్యార్థులను స్థానికేతరులుగా గుర్తిస్తూ ప్రభుత్వం ఈ ఏడాది జీవో ఇచ్చింది. అంటే ఇంజనీరింగ్, మెడిసిన్‌లో చేరాలంటే అంతకుముందు ఇంటర్మీడియట్, పది, తొమ్మిది తరగతులు కచ్చితంగా రాష్ట్రంలోనే చదివి ఉండాలి. అందులో ఒక్క ఏడాదైనా బయట చదివితే, రాష్ట్రంలో పదేళ్లు నివసించినట్లు సర్టిఫికెట్ పొందాలి. అది ఉన్న వారికి స్థానికేతరుల కోటాలో సీట్లు కేటాయిస్తారు. అందుకు అనుగుణంగానే ఉన్నత విద్యాశాఖ వైద్య విద్య, ఇంజనీరింగ్ సీట్ల కౌన్సెలింగ్ ప్రారంభించింది. అయితే ఈ నిబంధన కారణంగా తాము స్థానిక కోటా కోల్పోతున్నామని పలువురు విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ప్రభుత్వ వాదనతో ఏకీభవించిన న్యాయస్థానం విద్యార్థుల పిటిషన్లను తోసిపుచ్చింది. కోర్టు విచారణ కారణంగా ఇంజనీరింగ్ తుది విడత సీట్ల కేటాయింపు ఇప్పటివరకూ ఆగింది.


కన్వీనర్ కోటాలో మిగిలిన 34,298 సీట్లు

తొలి విడతలో 1.18 లక్షల మందికి సీట్లు కేటాయించగా, సుమారు 13 వేల మంది కాలేజీల్లో చేరలేదు. మొత్తంగా రెండు విడతల్లో కలిపి 1,19,666 సీట్లు భర్తీ అయ్యాయి. 28,735 మంది కాలేజీలు, కోర్సులు మార్చుకున్నారు. కన్వీనర్ కోటా కింద 1,53,964 సీట్లు అందుబాటులో ఉండగా.. 34,298 మిగిలిపోయాయి. యూనివర్సిటీ కాలేజీల్లో 1,361, ప్రైవేటు కాలేజీల్లో 31,811, ప్రైవేటు యూనివర్సిటీల్లో 1,126 సీట్లు మిగిలాయి. ఈనెల 20లోగా విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేయాలని సాంకేతిక విద్యాశాఖ స్పష్టం చేసింది. 18వ తేదీ నుంచి తరగతులకు హాజరు కావొచ్చని తెలిపింది.

పీజీ కోర్సుల మార్పులకు నోటిఫికేషన్

అమరావతి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పీజీ కోర్సుల కన్వర్షన్, కొత్త కోర్సులకు అనుమతి, ప్రస్తుత కోర్సుల ఉపసంహరణకు అవకాశం కల్పిస్తూ ఉన్నత విద్యామండలి గురువారం నోటిఫికేషన్ జారీచేసింది. ప్రైవేటు కాలేజీలు, ఎయిడెడ్ కాలేజీలు ఈ మార్పుల కోసం ఈ నెల 15 నుంచి 21వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపింది. 29 నుంచి వచ్చే నెల 1 వరకు తనిఖీలు చేపట్టి, 6న మార్పులపై ప్రొసీడింగ్స్ జారీచేస్తారని తెలిపింది.

ఆధ్యాత్మిక స్ఫూర్తిదాతలు...



నేడు స్వాతంత్ర్య దినోత్సవం

భారత స్వాతంత్ర్య సమరం ఎన్నో వాగులు, వంకలు కలిసి ఎగసిన మహా ప్రవాహం. అహింసావాదం, సాయుధ విప్లవవాదం, సంఘ సంస్కరణవాదం... ఇలా అన్ని రకాల భావజాలాలు 'దేశ విముక్తి' అనే లక్ష్యం కోసం ఏకోన్ముఖంగా సాగిన అపూర్వ సందర్భం అది. ఆ ఉద్యమానికి ఎందరో ఆధ్యాత్మిక గురువులు స్ఫూర్తిని, నైతిక మార్గదర్శకత్వాన్ని అందించడమే కాదు... స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనేలా ఎందరికో ప్రేరణగా నిలిచారు. అలాంటి వారిలో కొందరిని స్మరించుకుందాం.

దయానంద సరస్వతి

ఆధ్యాత్మికవేత్తగా, సంఘ సంస్కర్తగా ఆర్య సమాజ్ వ్యవస్థాపకుడు దయానంద సరస్వతి సుప్రసిద్ధులు. 1824లో గుజరాత్‌లోని తంకారా అనే పట్టణంలో ఆయన జన్మించారు. 1857 నుంచి ప్రారంభమైన భారత స్వాతంత్ర్య పోరాటంలో ఆయన ప్రత్యక్షంగా పాల్గొనక పోయినా... ఆయన బోధనలు, ముఖ్యంగా ఆయన రచించిన 'సత్యార్థ ప్రకాశం' గ్రంథం ఎందరినో ప్రభావితం



చేశాయి. విదేశీ ఆధిపత్యాన్ని తిరస్కరించాలని, జాతి గౌరవాన్ని నిలబెట్టుకోవాలని, స్వయం సమృద్ధి సాధించాలని ఆయన ఇచ్చిన సందేశాలు తదుపరి కాలంలో స్వాతంత్ర్య యోధులకు మంత్రాలుగా మారాయి. సుసంపన్నమైన భారతీయ సంస్కృతి ఏ విదేశీ సంస్కృతికన్నా తక్కువ కాదనీ, మన వారసత్వాన్ని గర్వంగా భావించాలనీ స్వామి దయానంద బోధించారు. కుల వివక్ష, అస్పృశ్యత, మహిళలను తక్కువగా చూడడం లాంటి వైఖరులను ఆయన తీవ్రంగా ఖండించారు. ఒక జాతిగా అందరూ సమైక్యంగా ఉండాల్సిన ఆవశ్యకతను చాటి చెప్పారు. ఆర్యసమాజ్... భారత స్వాతంత్ర్య పోరాటానికి ఎందరో నాయకులను అందించింది. లాలా లజపతిరాయ్ లాంటి అనేకమంది జాతీయవాదులు ఆ సంస్థ నుంచి వచ్చినవారే. ఆర్యసమాజ్ విద్యా సంస్థలు, సామాజిక కార్యక్రమాలు స్వాతంత్ర్య పోరాటం దిశగా ప్రజలను మళ్ళించడంలో కీలకపాత్ర పోషించాయి.

అరబింద్ ఘోష్

మన దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన ఆగస్టు 15వ తేదీ శ్రీ అరవిందుల జన్మదినం కూడా. 1872లో కోల్‌కతాలో పుట్టిన ఆయన విదేశాల్లో విద్యాభ్యాసం చేశారు. వివిధ భాషలు నేర్చుకున్నారు. మన దేశ ఆధ్యాత్మికత, సంస్కృతుల ఔన్నత్యం గురించి అవగాహన ఏర్పరచుకున్నారు. బెంగాల్ విభజన ఆయనకు తీవ్ర వేదన కలిగించింది. బరోడాలో చేస్తున్న ఉద్యోగాన్ని వదిలేశారు. స్వాతంత్ర్యోద్యమంలోకి అడుగుపెట్టారు. తిరిగి కోల్‌కతాకు వచ్చి... నేషనలిస్ట్ పార్టీకి నాయకత్వ బాధ్యతలు చేపట్టారు. 'వందేమాతరం' అనే పత్రికను స్థాపించి, తన రచనల ద్వారా ప్రజల్లో స్ఫూర్తి రగిలించారు. బ్రిటిష్ పాలకుల చెర నుంచి దేశాన్ని విడిపించాలంటే విప్లవ పంథాయే అనుసరణీయం అనేది మొదట్లో ఆయన సిద్ధాంతం. అయితే ఆలీపూర్ బాంబు కేసులో జైలుకు వెళ్ళిన తరువాత... ఆయనలో ఆధ్యాత్మిక భావనలు మరింత బలపడ్డాయి. జైలు నుంచి విడుదలయ్యాక పుదుచ్చేరి చేరుకొని, అక్కడ యోగ సాధనను కొనసాగించారు. కాంగ్రెస్ నాయకత్వం చేపట్టాలనే అభ్యర్థనను తిరస్కరించారు. 'సంపూర్ణ స్వరాజ్యం' అనే నినాదాన్ని సృష్టించినది ఆయనే. ఆధ్యాత్మిక శక్తికి నిలయమైన భారతదేశమే ప్రపంచానికి గురువు అవుతుందని స్పష్టం చేసిన శ్రీ అరవిందుల ప్రభావం ఆనాటి ఎందరో జాతీయోద్యమ నాయకుల మీద ప్రగాఢంగా ఉంది.

శ్రీమద్ రాజ్‌చంద్రజీ

ఆధ్యాత్మికంగా సంక్షోభానికి గురైన సమయంలో... నేను ఆశ్రయించేది శ్రీమద్‌జీనే- ఇది మహాత్మాగాంధీ తన 'సత్యశోధన' గ్రంథంలో చెప్పిన మాట. ప్రజలందరినీ ఒక్కతాటిపై నడిపించి, దేశ స్వాతంత్ర్య సాధనను సుగమం చేసిన గాంధీకి ఆధ్యాత్మిక మార్గదర్శి అయిన ఆ శ్రీమద్‌జీ ఎవరు? శ్రీమద్ రాజ్‌చంద్రజీగా శిష్యులు పిలుచుకొనే ఆ జైన యోగి అసలు పేరు లక్ష్మీనందన్ మెహతా. 1867లో గుజరాత్‌లోని వవానియాలో పుట్టారు. చిన్నప్పుడు ఒక శవ దహనాన్ని చూసిన ఆయనకు గత జన్మలన్నీ గుర్తుకు వచ్చాయి. అప్పుడే ఆయనలో వైరాగ్య భావాలకు పునాది



పడింది. ఏడేళ్ళ చదువును రెండేళ్ళకే పూర్తి చేసిన ఆయన బాల్యంలోనే కవిత్వం రాయడం ప్రారంభించారు. అష్టావధానిగా, శతావధానిగా ప్రఖ్యాతి పొందారు. అయితే ఆధ్యాత్మిక పురోగతే ఎప్పుడూ ఆయన లక్ష్యంగా ఉండేది. ముక్తిని వెతుకుతూ ప్రయాణం ప్రారంభించారు. ఇరవై మూడేళ్ళ వయసులో ఆయన జ్ఞానాన్వేషణ ఫలించింది. యోగిగా మారారు. అనేక రచనలు చేశారు. గాంధీ ఆయనను 1891లో... ముంబయిలో తొలిసారి కలుసుకున్నారు. శ్రీమద్‌జీలోని విశ్లేషణా నైపుణ్యం, విషయ పరిజ్ఞానం, నైతిక నిష్ఠ గాంధీని ఆకర్షించాయి. వారిద్దరి మధ్య గురుశిష్యుల అనుబంధం క్రమంగా బలపడింది. "ఆధ్యాత్మిక విషయాలకు సంబంధించి నా హృదయాన్ని ఇంతగా ఆక్రమించుకున్న వ్యక్తి ఇప్పటివరకూ మరొకరు లేరు" అని గాంధీ ఒక వ్యాసంలో పేర్కొన్నారు. గాంధీ దక్షిణాఫ్రికాలో ఉన్నప్పుడు గాంధీకీ, శ్రీమద్‌జీకి మధ్య ఉత్తరప్రత్యుత్తరాలు సాగుతూ ఉండేవి. ఒకసారి మానవుల ఉనికి, గుర్తింపు, మతం లాంటి అంశాలపై ఎన్నో సంశయాలు గాంధీకి కలిగాయి. ఇరవై ఏడు ప్రశ్నలను శ్రీమద్‌జీకి పంపారు. వాటన్నిటికీ సమాధానాలిస్తూ ఆ సందేహాలన్నిటినీ ఆయన నివృత్తి చేశారు. నిస్వార్థ సేవ, అహింసా మార్గం, నిరాడంబరత లాంటి అంశాల్లో గాంధీజీకి ఆదర్శంగా నిలిచిన వ్యక్తి శ్రీమద్‌జీ. గాంధీ ఆలోచనలను తీర్చిదిద్దడంలో, విశ్వాసాలను స్థిరపరచడంలో, మహాత్ముడిగా మారడంలో శ్రీమద్‌జీ ప్రభావం అపారంగా ఉంది.



ప్రపంచవ్యాప్తంగా హిందువులందరూ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకొనే పండుగలలో శ్రీకృష్ణ జన్మాష్టమి ఒకటి. ఈ పవిత్రమైన రోజు మన జీవితాల్లో ఆధ్యాత్మిక ఆనందాన్ని నింపుతుంది. శ్రీకృష్ణుని దివ్య ఆవిర్భావ లీలను తెలియజేస్తుంది. మనకు, భగవంతుడికి ఉన్న సనాతనమైన బంధాన్ని గుర్తు చేస్తుంది.

దివ్య లీల

రేపు శ్రీకృష్ణాష్టమి

శ్రీకృష్ణుడు సకల సృష్టికీ మూల పురుషుడు. ఆయన రూపం, నామం, లీలలు, గుణగణాలు... అన్నీ ఆకర్షణీయమైనవే. శ్రావణ మాసంలోని బహుళ పక్ష అష్టమి రోజున ఆయన అవతరించాడు కాబట్టి... ఆ తిథి 'శ్రీకృష్ణ జన్మాష్టమి'గా ప్రసిద్ధి చెందింది. శ్రీకృష్ణుని జననం సాధారణ శిశువుల మాదిరిగా సంభవించినది కాదు. ఎందుకంటే ఆయన పుట్టుక లేనివాడు. దేవాదిదేవుడు, సర్వశక్తిమంతుడు. కాబట్టి తన స్వీయ సంకల్పంతోనే అవతరిస్తాడు గానీ.. భౌతిక ప్రకృతి నియమాలకు బద్ధుడై కాదు. శ్రీకృష్ణుడు ఈ లోకంలో... మానవుల మధ్య జన్మించడం ఆయన దివ్య లీలల్లో ఒకటి. మధురలోని కంసుడి కారాగారంలో శ్రీకృష్ణుడు జన్మించినప్పుడు... శంఖ, చక్ర, గదా, పద్మాలతో... చతుర్భుజ విష్ణుమూర్తిగా దర్శనమిచ్చాడు. ఆ తరువాత తల్లి దేవకి ప్రార్థించడంతో... సామాన్య బాలుడిగా రూపాంతరం చెందాడు. కేవలం ఏడేళ్ళ వయసులో... తన చిటికెన వేలు మీద గోవర్ధన పర్వతాన్ని నిలబెట్టడం ఆయన అసాధారణ శక్తిని నిరూపిస్తుంది. సజ్జనులను రక్షించి, దుర్జనులను శిక్షించి, ధర్మాన్ని పునఃస్థాపించడానికి తాను యుగయుగానా అవతరిస్తానని ఆయన స్వయంగా ప్రకటించాడు.

శ్రీకృష్ణాష్టమినాడు ఏం చేయాలి?

శ్రీకృష్ణాష్టమినాడు ఆ శ్రీకృష్ణుని కృపను పొందడానికి భక్తులు కొన్ని ఆచారాలను పాటిస్తారు. వాటిలో ముఖ్యమైనవి: స్వామి ఆవిర్భవించిన సమయమైన అర్ధరాత్రి పన్నెండు గంటల వరకూ ఉపవాసం ఉండడం. ఆరోగ్యం సహకరించనివారు పండ్లు, పాలు, ఇతర ప్రసాదాలను తీసుకోవచ్చు. హరేకృష్ణ మంత్రాన్ని జపించడం ముఖ్యమైన విధిగా భావించాలి. కనీసం నూట ఎనిమిది సార్లు జపించాలి. భగవద్గీత, శ్రీమద్భాగవతం లాంటి గ్రంథాల నుంచి శ్రీకృష్ణుని లీలలను, ఉపదేశాలను పఠించడం పుణ్యప్రదం. శ్రీకృష్ణుని ఆలయాలకు వెళ్ళి, ఆయన సుందర రూపాన్ని దర్శించాలి. ఉదయం బ్రహ్మీ ముహూర్తంలో శ్రీకృష్ణుని విగ్రహానికి లేదా చిత్రపటానికి హారతి ఇవ్వాలి, తులసీదేవిని పూజించాలి.

ప్రభుపాదుల కృషితో విశ్వవ్యాప్తం

వివిధ కారణాల రీత్యా శ్రీకృష్ణ జన్మాష్టమి రోజున ఆలయాలకు వెళ్ళలేని భక్తులు కూడా శ్రీకృష్ణుడి అపారమైన కృపను పొందవచ్చు. శ్రీ చైతన్య మహాప్రభువు బోధించినట్టు... కపటంతో, కలహాలతో నిండిన కలియుగంలో హరినామ సంకీర్తనమే ఏకైక ముక్తి మార్గం. 'హరేకృష్ణ' మంత్ర జపం కలి కల్మషాలను నాశనం చేస్తుంది. హరేకృష్ణ ఉద్యమ సంస్థాపకాచార్యులైన శ్రీల ప్రభుపాదులు శ్రీకృష్ణ జన్మాష్టమిని ప్రపంచమంతటా వ్యాప్తి చేయడంలో అపారమైన కృషి చేశారు. 1965లో... 70 ఏళ్ళ వయసులో... కేవలం నలభై రూపాయలు, కొన్ని శ్రీమద్భాగవత గ్రంథాలతో ఆయన అమెరికా బయలుదేరారు. భగవద్గీతా సారాన్ని, 'హరేకృష్ణ' నామాన్ని పశ్చిమ దేశాల్లో ప్రచారం చేశారు. ఆరు ఖండాల్లో 108 కృష్ణ దేవాలయాలను స్థాపించారు. ప్రపంచంలోని ప్రసిద్ధ నగరాల్లో జగన్నాథ రథ యాత్రలను నిర్వహించి, ఆలయాన్నే ప్రజల దగ్గరకు తీసుకువచ్చారు. శ్రీకృష్ణ చైతన్యంపై 70కి పైగా గ్రంథాలను రచించారు. ఆయన స్ఫూర్తితో... హైదరాబాద్‌లోని 'హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్'లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా జరగనున్నాయి. రాధాగోవిందులు, స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్న ఈ ఆలయంలో... సప్త నదుల నుంచి సేకరించిన పవిత్ర జలాలతోను, పంచామృతంతోను అభిషేకం, ఊంజల్ సేవ, సంకీర్తనాలాపన, జపం, అన్నదానం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వీటిలో భక్తులు ఉచితంగా పాల్గొనవచ్చు. అలాగే హైదరాబాద్‌లోని నార్సింగిలో నిర్మితమవుతున్న హరేకృష్ణ హెరిటేజ్ టవర్, సంగారెడ్డి జిల్లా కందిలోని హరేకృష్ణ కల్చరల్ సెంటర్‌లలో కూడా ఈ ఉత్సవాల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

• శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9396956984



సహజయోగ

వేణువులా మారుదాం...



"త్రేతాయుగంలో శ్రీరాముడు ఆదర్శవంతుడైన కుమారుడిగా, సోదరుడిగా, భర్తగా, రాజుగా... మానవులు ఎలా జీవించాలో మనకు చూపించాడు. అయితే దానివల్ల మానవులందరూ ధర్మాన్ని పాటించడమే ధ్యేయంగా... గంభీరంగా మారిపోయి, ఆనందాన్ని విడిచిపెట్టేశారు. జీవితాన్ని ఉత్సాహంగా ఆనందించడం వారికి నేర్పడం కోసం ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడు జన్మించాడు. తన మధురమైన సంభాషణలతో అందరినీ సమ్మోహితులను చేశాడు" అంటూ శ్రీకృష్ణావతార పరమార్థాన్ని తన ప్రవచనాలలో శ్రీమాతాజీ నిర్మలాదేవి వివరించారు.

శరణాగతులం కావాలి...

శ్రీకృష్ణ తత్త్వం... ప్రధానంగా రాధాకృష్ణుల అనుబంధం ఎంతో మార్మికమైనవి. సంస్కృతంలో 'రా' అనే శబ్దానికి 'శక్తి' అని, 'ధ' అనే శబ్దానికి 'ధరించినది' అని అర్థం. రాధాదేవి శక్తి స్వరూపిణి. ఆమె యమునా నదిలో తన పాదాలను ఉంచడం వల్ల ఆ నది నీరు మొత్తం చైతన్యాన్ని పొందేది. ఆ నీటి ద్వారా గోపికలలో కుండలినీ శక్తిని శ్రీకృష్ణుడు జాగృతం చేసేవాడు. విశుద్ధ చక్రాన్ని ఆయన జాగృతం చేసి... కుండలినీ శక్తి ఉత్థానానికి మార్గాన్ని ఏర్పరిచాడు. ఆ చక్రానికి పదహారు దళాలు ఉంటాయి. ఆ దళాలు మన తలలోని సహస్రారంలో ఉండే వెయ్యి నాడులతో ఏకీకృతం అయినప్పుడు.... పదహారువేల శక్తులు ఏర్పడతాయి. శ్రీకృష్ణుడితో భూమిపై అవతరించిన ఆ పదహారువేల శక్తులే గోపికలు. వాటికి రక్షణ కల్పించడానికే ఆయన ఆ పదహారు వేల గోపికలను వివాహం చేసుకున్నాడు. యోగీశ్వరుడైన ఆయన లీలలను సరిగ్గా అర్థం చేసుకోగలిగితే... మన లోపల



ఉన్న విశుద్ధి చక్రం జాగృతమై... మనలో శ్రీకృష్ణ తత్త్వం స్థిరపడుతుంది. ఒక కథ ప్రకారం... శ్రీకృష్ణుడి నిరంతరం దగ్గరగా ఉండే వేణువును చూసి రాధాదేవి అసూయ చెందిందట. "నువ్వు ఇంతటి ఉన్నత స్థానాన్ని ఎలా పొందగలిగావు?" అని అడిగిందట. అప్పుడు వేణువు "కేవలం భగవంతుడికి గానాన్ని వినిపించడం తప్పితే నా లోపల ఏదీ ఉంచుకోను" అని చెప్పిందట. మనం కూడా కామ క్రోధాది శత్రువులను మన లోపల ఉంచుకోకుండా... మన అంతరంగాన్ని భగవంతుడికి పరిపూర్ణంగా సమర్పించి, సంపూర్ణ శరణాగతులం కావాలి. మన ద్వారా జరిగేవన్నీ భగవంతుడి అభీష్టం ప్రకారమే. కాబట్టి ఆ పనులన్నిటినీ సాక్షిలా గమనిస్తూ, కలత చెందకుండా ఉండగలిగితే... కొంతకాలానికి శ్రీకృష్ణుడి చేతిలో ఉండే వేణువులా తయారవుతాం. ఆ పరంధాముడి మధురమైన గానామృతాన్ని ఈ ప్రపంచానికి పంచగలుగుతాం.

ఆయన ఆచరించి చూపించాడు...

మన సూక్ష్మ శరీరంలో... గొంతు దగ్గర ఉండే విశుద్ధి చక్రానికి అధిష్ఠాన దైవం శ్రీకృష్ణుడు. ఈ చక్రం తాలూకు స్వభావం... సామూహికత. 'మానవులు సంఘంలో ఎలా జీవించాలి, అందరితో కలిసి ఎలా ఆనందించాలి' అనేది శ్రీకృష్ణుడు చూపించాడు. ఆయన బృందావనంలో తన తోటి వారిని బృందాలుగా తయారు చేశాడు. చిన్నతనంలోనే తన అల్లరితో వారందరి మనస్సుల్లో ఆయన స్థానం సంపాదించాడు. ధర్మాన్ని అనుసరించడం అంటే నవ్వడం మరచిపోయి, గంభీరంగా బతకడం కాదని, అది కూడా ఆనందంగా, ఒక లీలలా సాగాలని ఆచరించి చూపించాడు. అందుకే ఆయనను 'లీలాధర' అని పిలుస్తారు. సహజయోగ ధ్యాన సాధన ద్వారా కుండలినీ శక్తి జాగృతమై.... ఆత్మసాక్షాత్కారం పొందినప్పుడు, మన విశుద్ధ చక్రం పూర్తిగా పరిశుద్ధమై వికాసం చెందుతుంది. ఆ చక్రాన్ని అధిష్ఠించి ఉన్న శ్రీకృష్ణుని తత్త్వం మనలో జాగృతం అవుతుంది. ఆయన లక్షణాలైన స్థితప్రజ్ఞత, విచక్షణ, మాటల్లోని మాధుర్యం లాంటివి మనలో స్థిరపడతాయి.

డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



చింతన



ఆలోచన... ఆయుధం, అవరోధం!

'ఆలోచన అంటే మనసుతో చూడడం, గ్రహించడం. అన్నిటికీ ఆలోచనే మూలం' అని మనకు తెలుసు. జంతువు నుంచి మనిషిని వేరు చేసేది ఆలోచనే. ఈ అద్భుతమైన ప్రపంచం మొత్తాన్ని సృష్టించినది కూడా మనిషి ఆలోచనే. కానీ గమనించినట్టయితే... అదే ఆలోచన మనిషి జీవితానికి సమస్యాత్మకం అయింది. మనసు సృష్టించిన 'అహం' ('నేను' అనే ఆలోచన), దాని తాలూకు విపరిణామాలే మనిషి ఆనందానికి అవరోధమయ్యాయి.

నిజానికి మనిషికి అతని జీవనం సాధ్యం కావడానికి అహమే మూలం. 'నేను ఉన్నాను' అనే ఆలోచన ఉంటేనే కదా... నన్ను నేను గుర్తించగలిగేది, నన్ను నేను రక్షించుకోగలిగేది! అలా స్వీయ రక్షణ కోసం, మనుగడ కోసం, కనీస అవసరాలైన ఆహారం, దుస్తులు, నివాసం లాంటివి సంపాదించుకోవడానికి కూడా ఆలోచన అత్యవసరం. అయితే వచ్చిన చిక్కేమిటంటే, ఈ అహం... 'నేను' చుట్టూ గిరిగీస్తుంది, విభజనకు దారి తీస్తుంది. ఆ విభజనే క్రమంగా పేర్లకు, పోలికలకు, విశ్లేషణలకు, తీర్పులకు... అంతిమంగా సంఘర్షణకు, దుఃఖానికి కారణం అవుతుంది. ఈ విభజన ఏ స్థాయికి చేరిందంటే... తాను ప్రకృతిలో అంతర్భాగమనే మౌలిక సత్యాన్ని మనిషి పూర్తిగా విస్మరించాడు.

మేధస్సు, వివేకం

నిరంతరం భద్రత కోసం పాకులాడే మనసు.. ఏదైనా సరే మరింత కావాలని కోరుతుంది. అలా పరిణామ క్రమంలో మనిషి ఆలోచనే... వ్యవసాయాన్ని, మిగులు ధాన్యాన్ని, నాగరికతను, సౌకర్యాలను సృష్టించేలా చేసింది. నిన్న మొన్నటి శాస్త్ర-సాంకేతిక విజ్ఞానం నుంచి... నేటి కృత్రిమ మేధ వరకూ అన్నీ మనిషి ఆలోచన పుణ్యమేనని మనకు తెలుసు. అయితే మనిషి ఆలోచన, మేధస్సు పెరిగాయి కానీ, వాటి ఫలాలను ఎంత మేరకు, ఎలా వినియోగించుకోవాలి అనే వివేకమే క్రమంగా కరువైపోతూ వస్తోంది. ఆధునిక కాలంలో ఈ అవగాహనారాహిత్యం పరాకాష్టకు చేరి... మానవాళికి భస్మాసుర హస్తంగా మారింది.

"జీవనాధారమైన వాస్తవ ప్రకృతిని నాశనం చేస్తూ... ఊహాజనితమైన సంఖ్యలు, సంకేతాల మీద దృష్టి పెరిగిపోవడమే మానవాళికి దాపురించిన అతి పెద్ద సమస్య" అంటారు ప్రఖ్యాత పాశ్చాత్య తాత్త్వికుడు ఆలన్ వాట్స్. ఒకవైపు 'నేను-నాది' అనే స్వార్థం, మరోవైపు మరింత సంపద, సౌకర్యాలు కావాలనే కాంక్ష, పోటీ. ఇలా క్రమంగా ఆలోచన ఉచ్చులో, మనసు చేసే మాయలో మనిషి పడిపోయాడు. ప్రతి రంగంలోనూ వృద్ధికోసం పాకులాటే. వ్యక్తుల నుంచి దేశాల వరకూ- ఆస్తి విలువలు, బ్యాంకు నిల్వలు, సంపదల లెక్కలు, జీడీపీ రేట్లు... అన్నీ అమాంతం పెరిగిపోవాలనే ఆశ! "ఇంత చేసిన మనిషి... భూగ్రహాన్ని భోగిమంటలో వేస్తున్న మనిషి... పోనీ ఆనందంగా ఉన్నాడా? అంటే అదీ లేదు" అంటారు సద్గురు జగ్గీ వాసుదేవ్. అనుక్షణం ఏదో తీరని ఆరాటం, ఏదో తెలియని వెలితి, ఆందోళన, అశాంతి. కెరటాలతో అల్లకల్లోలమైన సముద్రంలా, ఎడతెగని ఆలోచనల పుట్టలాగా మారింది మనిషి మనసు.

ముఖ్యంగా నేటి మొబైల్-సోషల్ మీడియా కాలంలో ఆలోచన ఒక వ్యసనంగా మారిందంటే, నిద్రలేమి ఒక మహమ్మారిలా వ్యాపిస్తోందంటే అతిశయోక్తి కాదు. ఏకాంతం, నిశ్శబ్దం, ప్రశాంతత అన్నవి మనిషి జీవితంలో అరుదుగా లభించే బ్రహ్మపదార్థాలైపోయాయి.

నిరంతర ఎరుక

ఇదంతా చూసినప్పుడు ఆలోచన అనేది రెండు అంచుల పదునైన కత్తి లాంటిదని తెలుస్తుంది. మనం అద్భుతాలు అనుకుంటున్నవాటిని ఎన్నో సృష్టించిన ఆలోచనే మన ఆందోళనకూ, అశాంతికీ కారణమౌతోంది. అది విలయానికీ, మానవ వినాశనానికీ కూడా కారణం కాగలదు. మితిమీరిన ఆలోచన వల్ల వచ్చిన అనర్థాలను గ్రహించిన జ్ఞానులు "మనో వ్యాపారాన్ని పరిమితం చేయడం, మితంగా కర్మలు ఆచరించడమే ఆధ్యాత్మిక వివేకం" అన్నారు. అదే మనిషి జీవితంలో ప్రశాంతతకూ, ఆనందానికీ మార్గమని సూచించారు. అదే నిజమైన ధ్యానం. అంటే ఆలోచన పట్ల నిరంతర ఎరుక కలిగిఉండడం, మనసు పోకడలను కనిపెట్టడం, 'నేను' ఎలా పనిచేస్తోందో గమనిస్తూ... దాని తీరుతెన్నుల పట్ల అప్రమత్తంగా ఉండడం, కర్మలను పరిమితం చేయడం, కనీసావసరాలతో సరళ జీవనం గడపడం. ఆలోచనను ఎలా, ఎంతమేరకు ఉపయోగించాలో తెలియడం... ఇదే మనిషి వివేకానికి కొలమానం. అదే నిజమైన ఆధ్యాత్మిక సాధన. ఆ వివేకం నుంచే జీవితంపట్ల స్పష్టత, నిజమైన స్వేచ్ఛ, అసలైన ఆనందం లభిస్తాయి.

• ఈదర రవికిరణ్

తెలుసుకుందాం

ఆలయం... సమున్నత సంస్కృతికి ప్రతీక

భగవంతుడు సర్వాంతర్యామి. ఈ జగత్తు అంతటా నిండి ఉన్నాడు. ఆయన లేని చోటు ఈ విశ్వంలో ఎక్కడ వెతికినా కనిపించదు. అనాదిగా వేదాలు, ఆగమాలు, స్మృతులు, పురాణాలు, ఇతిహాసాలు చెబుతున్న సత్యం ఇదే. వేదకాలం నుంచి ఎందరో మహర్షులు, మునులు, సిద్ధులు, ఆచార్య పురుషులు ఇదే సత్యాన్ని తెలుసుకొని... భగవంతుడి అర్చారూపాన్ని మనకు అందించారు. సాక్షాత్తూ మహా విష్ణువే అయిదు రాత్రుల్లో అయిదుగురు దేవతలకు ఉపదేశించిన పాంచరాత్రం 'భగవంతుడి స్వరూపాలు అయిదు' అని పేర్కొంది. అవి: పర స్వరూపం, వ్యూహ స్వరూపం, విభవ స్వరూపం, అంతర్యామి స్వరూపం, అర్చా స్వరూపం.

పరమపదమైన వైకుంఠంలో కొలువుతీరిన పరావాసుదేవమూర్తిని 'పర స్వరూపం' అని, క్షీరసాగరంలో శేషశయనుడై ఉండే అనంతశయనమూర్తిని 'వ్యూహ స్వరూపం' అని, దుష్ట శిక్షణకోసం, శిష్ట రక్షణ కోసం భూలోకంలో అవతరించిన శ్రీరాముడు, శ్రీకృష్ణుడి లాంటి రూపాలను 'విభవ స్వరూపం' అని, సకల చరాచర జీవరాశులలో... అణువు నుంచి మహత్తు వరకూ అన్నీ తానై ఉన్న స్వామిని 'అంతర్యామి స్వరూపం' అని, నేడు కలియుగంలో మానవులైన మనల్ని అనుగ్రహించడానికి ఆలయంలో కొలువుతీరి, విగ్రహ రూపంలో అర్చనలు అందుకొనే స్వామిని 'అర్చా స్వరూపం' అని అంటారు. పైన పేర్కొన్న అయిదు స్వరూపాల్లో చివరిదైన అర్చా స్వరూపమే... భగవంతుణ్ణి సులభంగా దర్శించుకొనే మార్గం. మనం అందరం ఆ అర్చా స్వరూపాన్నే భగవంతుడిగా దర్శించుకుంటున్నాం.

ఎన్నో పేర్లు

విశ్వమంతటా వ్యాపించిన భగవంతుడి శక్తిని ఒకచోట కేంద్రీకరింపజేసి, అక్కడ ఆలయాన్ని నిర్మించి, అర్చామూర్తిని ప్రతిష్ఠించే విధానాన్ని శిల్ప, ఆగమ గ్రంథాలు అద్భుతంగా వర్ణించాయి. 'దేవాలయం' అంటే 'దేవుని రూపం ఉండే చోటు' అని మనందరికీ తెలుసు. నిజానికి... భక్తుల జీవాత్మను ఆ పరమాత్మలో లయం చేసే ఆత్మానాత్మ సంయోగానికి మన మహర్షులు నిర్దేశించిన పవిత్రమైన స్థలమే దేవాలయం. ఆలయానికి ఉన్న అనేక పేర్లను శిల్ప, ఆగమ గ్రంథాలు వివరించాయి. అవి: ప్రాసాదం, సదనం, సద్మం, గృహం, ధామం, నికేతనం, విమానం, హర్మ్యం, వాసం, మందిరం... ఇలా ఆలయానికి ఎన్నో పర్యాయపదాలు ఉన్నాయి.

ఎప్పుడు మొదలైంది?

ఆలయం అనేది మన హైందవ సంస్కృతి సమున్నత రూపానికి ప్రతీక. దేవతలందరూ కొలువుతీరే పరమ పవిత్రమైన ప్రదేశం. పురాణాల లోతుల్లోకి వెళితే మనకు ఎన్నో అద్భుతమైన విషయాలు తెలుస్తాయి. ఆలయాలు ఏ యుగంలో ఆకృతి దాల్చాయనే సంగతులతో పాటు వాటి వికాసం, జనాదరణ లాంటి అంశాలను కూడా అవి ఎంతో విస్పష్టంగా చెప్పాయి. విష్ణు ధర్మోత్తర పురాణాన్ని ఆధారంగా తీసుకుంటే... కృతయుగంలో ఈ భూమి మీద దేవాలయ నిర్మాణమే లేదు. అప్పుడు దేవతలను ప్రత్యక్షంగా దర్శించడానికి, పూజించడానికి అవకాశం ఉండేది. త్రేతా, ద్వాపర యుగాల్లో కూడా దేవతలను ప్రత్యక్షంగా దర్శించేవారు. అయితే దేవతా విగ్రహాలను గృహాల్లో పెట్టుకొని పూజించే... గృహార్చా విధానం త్రేతాయుగంలోనే ప్రారంభమయిందని చెప్పవచ్చు. విగ్రహారాధన కూడా ఆ యుగంలోనే వ్యాప్తిలోకి వచ్చినట్టు స్పష్టమవుతోంది. అరణ్యవాసంలో ఉన్న రాముడు తన పూర్వీకులను విగ్రహరూపంలో పూజించడం, అలాగే లంకానగర ప్రవేశానికి ముందు శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజించడం, రావణుడు తన నగరంలో శివలింగారాధన చేయడం లాంటివి వాల్మీకి రామాయణంలో మనకు కనిపిస్తాయి. ద్వాపర యుగంలో కూడా అరణ్యాలు, గుహలు, పర్వత ప్రదేశాల్లో, ఆశ్రమాల్లో ఋషులు, సిద్ధులు, మునులు విగ్రహ ప్రతిష్ఠ చేసి పూజించడం కొనసాగింది. నేటి కలియుగంలో... మన దేశంలోని పవిత్ర ప్రదేశాలతోపాటు గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో దేవాలయాలను నిర్మించి, ఆగమోక్త విధితో ప్రతిష్ఠాదులు చేసి, పూజలు చేయడం ప్రాచుర్యంలోకి వచ్చింది.



• దగ్గుపాటి నాగవరప్రసాద్ స్థపతి
9440525788

భారీ వర్షం.. నష్టం కష్టం


అమరావతి : ధ్యానబుద్ధ ఘాట్ పై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు


గుంటూరు : చుట్టుగుంటలో మోకాలి లోతు నీటిలో కమిషనర్ శ్రీనివాసులు

అల్పపీడన ప్రభావం జిల్లాను వీడలేదు. గురువారం వరుణుడి ప్రభావం అంతగా లేకపోయినా అక్కడక్కడ ఓ మోస్తరు వర్షాలు పడ్డాయి. బుధవారం అర్ధరాత్రి పలు ప్రాంతాల్లో భారీగా వర్షం పడింది. వర్షాలతో వాగులు, డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తు న్నాయి. దీంతో పొలాల్లోని నీరు బయటకు పోయే మార్గం లేకుం డా పోయింది. మూడు రోజులుగా చేలు చెరువుల్లా మారాయి. పెట్టుబడులు వర్షార్పణమేనని రైతులు కన్నీటి పర్యంత మవుతు న్నారు. ఇప్పటికి రెండు సార్లు సాగు చేపట్టి తీవ్రంగా నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. మూడు రోజులుగా కురిసిన వర్షాలతో జిల్లా కేంద్రాలైన గుంటూరు, బాపట్ల, నరసరావుపేటలతో పాటు పలు పట్ట ణాలు, గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు గురువారం కూడా ముంపులోనే ఉండటంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ముంపు నుంచి తేరుకున్న ప్రాంతాల్లో అపరిశుభ్రతతో దుర్వాసనతో ప్రజలు అల్లాడిపోతున్నారు. శ్రీశైలం నుంచి ప్రకాశం బ్యారేజీ జలాశయాల వరకు వరద కొనసాగుతుండటంతో వచ్చిన నీటిని వచ్చినట్లుగా దిగువకు విడుదల చేస్తు న్నారు. దీంతో కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహి స్తోంది. నదీ తీరంలో గ్రామస్థులను, రైతులను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.

- ❖ చెరువుల్లా మారిన పొలాలు
- ❖ ఉధృతంగా ప్రవహిస్తోన్న కృష్ణమ్మ
- ❖ కొనసాగుతోన్న అల్పపీడన ప్రభావం
- ❖ పెట్టుబడి వర్షార్పణమేనని రైతుల ఆవేదన

పొంగి ప్రవహిస్తోన్న వాగులు.. రాకపోకలకు అంతరాయం

(తెనాలి, గుంటూరు, ఆంధ్రజ్యోతి)

ఎన్నో ఒడిదు డుకుల మధ్య ఆలస్యంగా ఖరీఫ్ సేద్యానికి సిద్ధమైన అన్నదాతలను ఎడతెరిపి లేకుండా కురిసిన వానలు కోలుకోకుండా చేశాయి. మొన్నటి వరకు తీవ్ర వర్షాభావంతో సాగు చేసిన పంటలు బెట్టకు వచ్చాయి. ప్రస్తుత వర్షాలతో పంటలు నీటి మునిగాయి. జిల్లాలో పంటలకు అపార నష్టం వాటిల్లింది. వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతులకు కంటిమీద కును కు లేకుండా పోతోంది. రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదు కావడంతో వాగులు, కా ల్వలు, డ్రెయిన్లు పొంగిపొర్లి పంట పొలా లను ముంచెత్తాయి. పొలాల్లో నిలిచిన నీటిని బయటకు పంపేందుకు అవస్థలు పడుతున్నారు. వర్షాలతో వరి విత్తనాలు చల్లిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొన్ని చోట్ల మొలకెత్తిన వరి నారు వర్షాలకు కొట్టుకుపోయింది. భారీ వర్షాలకు నారు కోసం చల్లిన విత్తనాలు కొన్ని ప్రాంతాల్లో కొట్టుకుపోయాయి. ఆదిలోనే వరి రైతులకు వర్షాలు నష్టాన్ని మిగిల్చాయి. గురువారం తెల్లవారుజాము నుంచి నాదెండ్ల మండల పరిధిలో కుప్పగం జి వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. చిల కలూరిపేట నుంచి శివ ప్రియనగర్ మీదుగా గణపవరం మార్గంలో ఉన్న కుప్పగంజి వాగు చప్టాపై నుంచి (మిగతా 10లో)


పొన్నూరు : ఉధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర డ్రెయిన్


తెనాలి నియోజకవర్గంలో రోడ్డు పనులకు సంబంధించిన వివరాలను అధికారుల నుంచి తెలుసుకుంటున్న మంత్రి మనోహర్


పొన్నూరు : నిడుబ్రోలులో నీట మునిగిన వరి పొలాలు


ప్రకాశం బ్యారేజి దిగువకు ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

వరద.. విడుదల

- సాగర్ నుంచి 26 క్రస్ట్‌గేట్ల ద్వారా..
- ప్రకాశం బ్యారేజ్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక


సాగర్ 26 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

విజయపురిసౌత్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో కురుస్తోన్న భారీ వర్షాలతో ప్రాజెక్టులకు భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. శ్రీశైలానికి వస్తున్న వరద వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీల నుంచి కూడా నీటిని దిగువకు విడుదల చేస్తుండటంతో కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తోంది. సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి గురువారం 1,72,774 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. సాగర్ జలాశయం నీటిమట్టం 587.50 అడుగులు ఉంది. ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 29,534, కుడి కాల్వ ద్వారా 1540, 26 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 2,03,762 మొత్తం ఔట్‌ఫ్లో 2,37,056 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

బ్యారేజి నుంచి 5,45,412 క్యూసెక్కులు..

తాడేపల్లి టౌన్: గురువారం కూడా ప్రకాశం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. వరద ఉధృతి క్రమేపీ పెరుగుతుండడంతో దిగువ ప్రాంతాల వారు, లంక భూముల రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాల ని అధికారులు సూచించారు. ఎగువ నుంచి 5లక్షల 46 వేల 018 క్యూసెక్కుల వరదనీరు ఇన్‌ఫ్లోగా నమోదైంది. రిజర్వాయర్‌లో 14.5 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా మొత్తం 70 గేట్లను ఎత్తి దిగువకు 5 లక్షల 45 వేల 422 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు జేఈ రాజేష్ తెలిపారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాల్వలకు నీటి విడుదల నిలిపివేశారు.


రొంపిచర్ల ప్రాంతంలో వర్షానికి కొట్టుకుపోయిన వరి నారుమడి


లాంలో వర్షం నీటిలో పత్తి పైరు


కొల్లూరు మండలం తిప్పలకట్ట వద్ద కోతకు గురవుతున్న పంట పొలాలు

చివరి భూములకు నీరందించాలి

- సాగునీరు, పంట కాల్వలను పరిరక్షించాలి
- సాగునీటి సంఘాల చైర్మన్లతో సీఎం చంద్రబాబు


వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సాగునీటి సంఘాల అధ్యక్షులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, హాజరైన కలెక్టర్

గుంటూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందించడమే నీటి వినియోగదారుల సంఘాల లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన సాగు నీటి సంఘాల చైర్మన్లు, కలెక్టర్, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గుంటూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ నాగలక్ష్మి, పలు డీసీల చైర్మన్లు ఈ కార్యక్రమంలో పాల్గొనగా నీటి నిర్వహణ, చివరి భూములకు నీరందించడం, సమర్థ నీటి వినియోగం వంటి అంశాలపై ముఖ్యమంత్రి వారితో చర్చించారు. నీటి వనరుల సంరక్షణతోనే భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. సమర్థ నీటి నిర్వహణతో ప్రాజెక్టుల్లో నీటిని నిల్వ చేసుకోగలిగామన్నారు. రిజర్వాయర్లు, బ్యారేజీల్లో మొత్తంగా కలిపి 82.29 శాతం మేర నింపుకోగలిగామని, ఎగువ నుంచి వస్తున్న వరదతో పాటు రాష్ట్రంలో పడుతున్న వర్షపు నీటిని సమర్థంగా రిజర్వాయర్లకు మళ్లించడంలో ప్రభుత్వం విజయవంతమైందన్నారు. నీటిని ఒడిసి పట్టి ప్రాజెక్టులను ఏ విధంగా నింపామో.. ఇదే విధంగా గ్రామాల్లోని చెరువులను కూడా నీటితో నింపుకోవాలన్నారు. సాగునీరు, పంట కాల్వలను పరిరక్షించుకోవాలని సూచించారు. మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల ద్వారా భారీ ఎత్తున నీటిని నిల్వ చేసుకోవచ్చని చెప్పారు. సమర్థ నీటి నిర్వహణతో కరవును తరిమేయవచ్చని తెలిపారు. నీటి వనరులు నిర్వహణపై జిల్లాలకు రేటింగ్ ఇస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంయుక్త కలెక్టర్ భార్గవతేజ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ కల్యాణ చక్రవర్తి, నీటి సంఘాల కృష్ణ డెల్టా ప్రాజెక్టు వైస్ చైర్మన్ సునీల్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

దేశ విభజన సమయంలో అనేక విద్వేషాలు

నాటి చిత్రాలతో రైల్వేస్టేషన్‌లో ఎగ్జిబిషన్ సందర్శనలో డీఆర్ఎం

గుంటూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): 1947లో దేశ విభజన సమయంలో అనేక విద్వేషాలు తలెత్తాయని గుంటూరు రైల్వే డీఆర్ఎం సుధేష్ణ సేన్ తెలిపారు. దేశ విభజన భయానక దినోత్సవం సందర్భంగా గురువారం ఆనాటి చిత్రాలతో గుంటూరు రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ని డీఆర్ఎం సందర్శించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ నాడు లక్షలాది మంది అనేక బాధలు అనుభవించారని, ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ప్రస్తుత తరంలో వాటిపై ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ దినోత్సవాన్ని జరపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డీపీవో షాబాజ్ హనూర్, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, డీసీఎం కే కమలాకర్‌బాబు పాల్గొన్నారు.


రైల్వేస్టేషన్‌లో దేశ విభజన భయానక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనని తిలకిస్తున్న డీఆర్ఎం సుధేష్ణ సేన్

స్త్రీ శక్తికి... సిద్ధం

- ◆ నేడు కార్యక్రమం ప్రారంభం
- ◆ మహిళల ఉచిత ప్రయాణానికి శ్రీకారం
- ◆ స్థానిక ప్రజాప్రతినిధులకు ఆర్టీసీ ఆహ్వానాలు
- ◆ జీరో టిక్కెట్‌కు టిమ్ మిషన్‌లో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్
- ◆ గుర్తింపు కార్డుతోనే మహిళలకు ఉచిత ప్రయాణం

గుంటూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్‌లో హామీ ఇచ్చిన మేరకు మహిళల ఉచిత ప్రయాణానికి ప్రభుత్వం సిద్ధమైంది. స్త్రీ శక్తిగా ఈ పథకానికి ప్రభుత్వం నామకరణం చేయగా 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున సాయంత్రం ప్రారంభోత్సవానికి ఆర్టీసీ సన్నాహాలు చేస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి ఆర్టీసీ సర్వం సిద్ధం చేసింది. ముందుగా సీఎం చంద్రబాబు విజయవాడలో ఈ పథకాన్ని ప్రారంభించిన తర్వాత గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా కేంద్రాల్లో ఆయా ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రారంభిస్తామని జిల్లా ఇన్‌చార్జి ప్రజారవాణాధికారి (డీపీటీవో) సామ్రాజ్యం గురువారం తెలిపారు. ఇందుకు సంబంధించి జిల్లాల్లో ఎక్కడికక్కడ డిపోల్లో ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఆర్టీసీ యంత్రాంగం నిర్దేశించిన ఉచిత బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవసరమైన ఏర్పాట్లు జరిగాయి. మహిళలకు ఉచిత ప్రయాణంలో భాగంగా జీరో టిక్కెట్ అందించనున్నారు. ఈ టిక్కెట్‌కు సంబంధించి టిమ్ మిషన్లలో సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేశారు. జీరో టిక్కెట్ జారీపై కండక్టర్లకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు ఇప్పటికే ఆర్టీసీ అధికారులు నిర్వహించారు. అయితే ఉచిత ప్రయాణం పొందే మహిళలు ఈ రాష్ట్రానికి చెందిన వారేనని ఆధార్ వంటి ఏదో ఒక గుర్తింపు కార్డు తప్పనిసరిగా చూపించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. జిల్లా పరిధి అధిక శాతం గ్రామీణ నేపథ్యం కలిగి ఉండడం, దాదాపు 75 శాతం ఊళ్లకు పల్లె వెలుగు సర్వీసులే నడుస్తుండడం వల్ల మహిళలకు పెద్దఎత్తున లబ్ధి చేకూరనున్నది. అన్ని చోట్లా స్త్రీశక్తి పథకం మార్గదర్శకాల గురించి మహిళలకు (మిగతా 10లో)


గుంటూరు ఆర్టీసీ బస్టాండ్

స్వాతంత్ర్య దినోత్సవానికి ముస్తాబు

- జెండా ఆవిష్కరించనున్న మంత్రి లోకేశ్
- పోలీసు కవాతు మైదానంలో భారీగా ఏర్పాట్లు
- పరిశీలించిన కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్

గుంటూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయిలో స్వాతంత్ర్య దిన వేడుకలకు పోలీసు కవాతు మైదానం ముస్తాబైంది. వేడుకల నిర్వహణకు అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. వర్షాల నేపథ్యంలో ప్రాంగణంలో బురద లేకుండా గులకరాళ్లు, చిప్స్ పోసి ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఏర్పాట్లను ఎస్పీ సతీష్‌కుమార్, జేసీ భార్గవ్‌తేజతో కలిసి కలెక్టర్ నాగలక్ష్మి పరిశీలించారు. ప్రధాన రహదారి, వేదిక, గ్యాలరీలు, సందర్శకుల ప్రవేశ మార్గాలు, వివిధ శాఖల వారి ఏర్పాటు చేసే స్టాళ్లు, శకటాల ప్రదర్శన మార్గాలను పరిశీలించారు. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలను అధికారులు సమన్వయంతో చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పరేడ్ గ్రౌండ్‌లో వేదిక, వివిధ శాఖలు ఏర్పాటు చేస్తున్న స్టాల్స్, వీఐపీ, స్టూడెంట్స్, పబ్లిక్, మీడియా గ్యాలరీలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మంత్రి నారా లోకేశ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని కలెక్టర్ తెలిపారు. గౌరవ వందనం, శకటాల పరిశీలన, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం ఉద్యోగులకు కమాండేషన్ సర్టిఫికెట్లను మంత్రి అందజేస్తారన్నారు. వేడుకలకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

వర్షం వస్తే.. వేదిక మార్పు

గురువారం రాత్రి వర్షం కురిసిన పక్షంలో వేడుకలకు అంతరాయం తప్పదని అధికారులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లోవేడుకలు నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. వాతావరణం అనుకూలిస్తుందా లేదా అనే దానిపై అధికారులు హైరానా పడుతున్నారు. ఏఎస్పీ(ఏఆర్) ఏ.హనుమంతు ప ర్యవేక్షణలో పరేడ్ కమాండర్ ఏఆర్ డీఎస్పీ ఏడు కొండలరెడ్డి, పోలీస్ బలగాలతో పోలీస్ కార్యా లయంలో కవాతు రిహార్సల్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, డీఆర్ఓ ఖాజావలి, ఆర్డీవో శ్రీనివాసరావు, జడ్పీ సీఈఓ జ్యోతిబసు, సీపీఓ శేషశ్రీ, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, డీఎస్పీలు అరవింద్, ఏడుకొండలరెడ్డి, సీఐలు అళహరి శ్రీనివాస్, రాంబాబు, నజీర్‌బేగ్, ఆర్ఐలు సురేష్, శివరామకృష్ణ పాల్గొన్నారు.


ముస్తాబైన వేదిక


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్


విద్యుత్ దీపాల అలంకరణలో కలెక్టరేట్

స్మార్ట్ మీటర్లపై గృహ విద్యుత్ వినియోగదారులకు

అవగాహన కల్పించాలి

- గృహ వినియోగదారులకు అభ్యంతరాలుంటే నచ్చచెప్పండి
- ఏపీ సీపీడీసీఎల్ టెక్నికల్ డైరక్టర్ మురళీకృష్ణయాదవ్

సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడిలో రైళ్ల స్టాపేజ్‌ల పునరుద్ధరణ

8

గాంధీజీ.. గుర్తులు

- స్వాతంత్ర్య సంగ్రామంలో మహాత్ముడి పర్యటనలు



10

కడప అడ్డాలో.....టీడీపీ జెండా

- ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా వైఎస్ ఇలాఖాలో 50 ఏళ్ల అరాచకాలకు, హింసకు ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగిన ఎన్నికలతో తెరపడిందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీకి జరిగిన ఉప ఎన్నికలలో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించడం పట్ల ఎమ్మెల్యే యరపతినేని సంతోషం వ్యక్తం చేస్తూ 40 ఏళ్లుగా ప్రజాస్వామ్యానికి పాతర వేస్తూ ఎవరినీ పోటీ చేయనీయకుండా ఓటింగ్‌లో పాల్గొనకుండా రిగ్గింగ్ చేసి గెలుస్తూ తమది గొప్ప కుటుంబం అని చెప్పుకునే వైఎస్ కుటుంబం పులివెందులలో డిపాజిట్ కూడా తెచ్చుకోలేక పోయిందన్నారు. కొన్ని దశాబ్దాలుగా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ ఓటింగ్‌లో పాల్గొనకుండా ప్రజాస్వామ్యానికి పాతర వేస్తూ హత్యలు, దాడులు, ఆస్తుల ధ్వంసం వంటి చరిత్రతో గెలుస్తూ వచ్చిన జగన్‌రెడ్డికి ఇప్పుడు ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగిన ఎన్నికలను చూసైనా బుద్ధి తెచ్చుకోవాలన్నారు. చంద్రబాబు వయసును కూడా గుర్తెరగకుండా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. జగన్, చంద్రబాబుతో పోటీ పడి ఇప్పుడైనా తిరుపతి మెట్లు ఎక్కగలడా అని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికలలో కూడా ప్రజాస్వామ్యాన్ని బతికించి అరాచక పార్టీలను భూస్థాపితం చేయాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఓటర్లను, ప్రజలను కోరారు.

ఎన్నికల ఫలితాలతో జగన్‌కు నిద్రలేని రాత్రులు

- ప్రత్తిపాటి ఎద్దేవా



చిలకలూరిపేట, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): ప్రజాగ్రహం పెల్లుబికితే డిపాజిట్లు గల్లంతేనని జగన్‌కు ఉప ఎన్నికల ఫలితాలతో తెలిసొచ్చిందని, ఇక ఆయనకు నిద్రలేని రాత్రులేనని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడుతూ, వైఎస్ కుటుంబం నాలుగు దశాబ్దాలుగా పులివెందులలో నడిపించిన రాజారెడ్డి రాజ్యాంగానికి ఉప ఎన్నికల ఫలితాలతో శుభం కార్డు పడిందని చెప్పారు. పులివెందుల గడ్డ తన కబంధ హస్తాల నుంచి జారిపోవడంపై జగన్ రగలిపోతున్నాడని, ఉపఎన్నికలు ప్రజాస్వామ్యయుతంగా జరగలేదని గొంతుచించుకునే ముందు తన హయాంలో జరిగిన ప్రతి ఎన్నికపై జగన్ ఒక్కసారి ఆత్మావలోకనం చేసుకోవాలని అన్నారు. పులివెందుల, ఒంటిమిట్టలో టీడీపీ అభ్యర్థుల్ని గెలిపించి అరాచకశక్తుల ఆటకట్టించిన అక్కడి ప్రజానీకానికి ధన్యవాదాలు తెలిపారు.

17న స్కూల్ గేమ్స్ వాలీబాల్ ఎంపికలు

గుంటూరు (క్రీడలు) ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఉర్దూ పాఠశాలలో జరగవలసిన వాలీబాల్ పోటీలు వర్షం కారణంగా వాయిదా పడినట్టు జిల్లా కార్యదర్శి ఎం రవి తెలిపారు. మరలా ఈ పోటీలను వేజెండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో ఈ నెల 17న నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అండర్-15 బాల బాలికల విభాగంలో జరగనున్న ఈ పోటీలకు ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు క్రీడాకారులు మాత్రమే ఎంపికకు హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావుని (9912110749) సంప్రదించాలని కోరారు.

స్మార్ట్ మీటర్లపై గృహ విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించాలి

ఏపీ సీపీడీసీఎల్ టెక్నికల్ డైరక్టర్ మురళీకృష్ణయాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న డైరక్టర్ మురళీకృష్ణయాదవ్, పక్కన ఎస్ఈ రమేష్, హాజరైన అధికారులు

గుంటూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పాటు చేయనున్న స్మార్ట్ మీటర్లపై గృహ విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించాలని ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ సంస్థ టెక్నికల్ డైరక్టర్ ఆవుల మురళీకృష్ణ యాదవ్ అధికారులకు సూచించారు. గుంటూరు విద్యుత్ భవన్‌లోని స్కాడా సమావేశ మందిరంలో గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్‌తో కలిసి గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. స్మార్ట్ మీటర్లపై ఉన్న అపోహలను తొలగించేలా వినియోగదారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ముందుగా ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సంబంధిత కనెక్షన్‌లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయటమే తొలి ప్రాధాన్యంగా ఉండాలని స్పష్టం చేశారు. సాంకేతిక అంతరాయాలపై ఫిర్యాదులొస్తున్నాయని, అటువంటి సమస్యల్లేకుండా చూడాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షించి విద్యుత్ సరఫరాలో లో వోల్టేజ్ సమస్యలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. అలానే వినియోగదారుల నుంచి ప్రభుత్వం ఎప్పటికప్పుడు అభిప్రాయసేకరణ చేస్తోందని, విద్యుత్‌శాఖ పనితీరుపై ప్రజల్లో ప్రస్తుతం 70 శాతంగా ఉందని, దాన్ని 80 శాతానికి పైగా పెంచాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ పనుల్లో పురోగతిని అడిగి తెలుసుకున్నారు. సమీక్షా సమావేశంలో సంస్థ ఫైనాన్స్ డైరక్టర్ వెంకటేశ్వర్లు, గుంటూరు టౌన్-1 ఆపరేషన్ ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో యూకో బ్యాంక్ జోనల్ కార్యాలయం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అధికారులు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతా ప్రధాన కేంద్రంగా నడుస్తున్న యూకో బ్యాంక్ ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ జోనల్ కార్యాలయాలన్ని తాడేపల్లి మణిపాల్ ఆసుపత్రి ఎదురుగు గురువారం యూకో బ్యాంక్ ఎండి అండ్ సీఈవో అశ్వనికుమార్ వర్చువల్‌గా పాల్గొని లాంఛనంగా ప్రారంభించారు. డిప్యూటి జనరల్ మేనేజర్ మరియు జోనల్ మేనేజర్ ఎస్ శరవణన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటి జోనల్ హెడ్ అండ్ ఏజిఎం ప్రశాంతకుమార్, అధికారులు పాల్గొన్నారు. సీఈవో అశ్వనికుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 48 బ్రాంచ్‌లు ఉన్నాయన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 8 బ్రాంచ్‌లు, ఉమ్మడి కృష్ణా జిల్లాలో 9 బ్రాంచ్‌లు ఉన్నాయన్నారు. త్వరలో మరో 8 బ్రాంచ్‌లు ప్రారంభం కాబోతున్నాయని తెలిపారు. యూకో బ్యాంక్ తరపున ప్రస్తుతం సుమారుగా రూ.49160 కోట్ల టర్నోవర్ ఉందని దాన్ని మరింత పెంచుతామని జోనల్ మేనేజర్ శరవణన్ తెలిపారు. వినియోగదారులకు అన్ని పథకాలను యూకో బ్యాంక్ చేరువ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు స్థానికులు పాల్గొన్నారు.

తుమ్మలపాలెం సర్పంచ్‌కు అరుదైన గౌరవం

- ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనే అవకాశం



చల్లా నాగమల్లేశ్వరి

ప్రత్తిపాడు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తుమ్మలపాలెం సర్పంచ్ చల్లా నాగమల్లేశ్వరికి అరుదైన గౌరవం దక్కింది. ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనే అవకాశం దక్కింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆహ్వానం లభించడంతో ఆమె ఢిల్లీకి పయనమయ్యారు. స్వచ్ఛ గ్రామం, స్వచ్ఛ పంచాయతీలో ఈ గ్రామం ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ గ్రామంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, రాష్ట్రంలోనే ఆదర్శప్రాయంగా నిలిచింది. ప్రస్తుతం జిల్లాలో ట్రైనింగ్ సెంటర్‌గా కూడా ఉంది. ఈ క్రమంలో ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనేందుకు రాష్ట్రం నుంచి ఇద్దరు సర్పంచ్‌లకు ఈ అవకాశం దక్కగా వారిలో తుమ్మలపాలెం సర్పంచ్ చల్లా నాగమల్లేశ్వరి ఒకరు కావడం విశేషం.

వైసీపీ నేత అంబటి మురళిపై కేసు నమోదు

పొన్నూరుటౌన్, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అంబటి మురళీకృష్ణపై పొన్నూరు రూరల్ పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రూరల్ ఎస్ఐ గండు కిరణ్ కథనం ప్రకారం మండల పరిధిలోని ఆలూరు గ్రామానికి చెందిన పౌలు రాజు అనే యువకుడికి ఆయన భార్యకు మనస్పర్థలు ఏర్పడగా పౌలు రాజు భార్య ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. అయితే ఈ వివాదం నేపథ్యంలో వైసీపీ నాయకుడు అంబటి మురళీకృష్ణ కల్పించుకొని పౌలు రాజుపై అసత్యాలు ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేయడమే కాకుండా తన పరువుకు భంగం కలిగించాడని ఆరోపిస్తూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పౌలు రాజు ఫిర్యాదు మేరకు అంబటి మురళీకృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు.

నాలుగో రోజుకు చేరిన బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి నిరసన

తెనాలి అర్బన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి పద్మావతి చేపట్టిన నిరసన దీక్ష గురువారం నాలుగో రోజుకు చేరింది. కస్టమర్ సర్వీస్ సెంటర్ ప్రైవేటీకరణను రద్దు చేయాలని కోరుతూ నిరసన దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. అధికారులు దిగి వచ్చే వరకు పోరాటం ఆగదన్నారు.

మద్యానికి బానిసైన యువకుడి ఆత్మహత్య

గుంటూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని రెడ్డిపాలెంకు చెందిన నన్నెపోగు ఎలీషా అనే యువకుడు మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పిడుగురాళ్ల పరిధిలోని జానపాడు గ్రామానికి చెందిన నన్నెపోగు రాహేలు, నాగయ్య దంపతులకు ఒక కుమార్తె, ఇరువురు కుమారులు ఉన్నారు. కొద్ది సంవత్సరాలుగా వారు రెడ్డిపాలెంలో ఉంటున్నారు. రాహేలు అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్‌గా ఉంటుండగా ఆమె భర్త నాగయ్య లారీడ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. చిన్న కుమారుడు ఎలీషాకు వివాహం జరిగింది. ఎలీషా, ఆయన భార్య భార్గవి ఇరువురూ రెడ్డిపాలెంలో రాహేలు ఉంటున్న అపార్టుమెంట్ పక్కనే ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నారు. ఎలీషా సమీపంలోని స్కూల్ హాస్టల్లో దోబీగా పనిచేస్తుంటాడు. ఎలీషా మద్యానికి బానిస అయ్యాడు. ఇలా ఉంటే రాహేలు, చిన్న నాగయ్య దంపతులు పది రోజుల క్రితం వారి ఊరెళ్ళారు. కాగా గురువారం మధ్యాహ్నం ఎలీషా మద్యం సేవించి వచ్చాడు. భార్గవి ప్రస్తుతం ఎనిమిదో నెల గర్భవతి. ఎలీషా భార్య భార్గవి సమీపంలోని పెద్దమ్మ ఇంటికి వెళ్ళింది. ఆ సమయంలో ఎలీషా ఒక్కడే ఇంటిలో ఉన్నాడు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఎలీషా ఇంటిలో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొని ఉన్నాడు. మృతుడి తల్లి రాహేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారిగా సీహెచ్ ఆశారాణి



గుంటూరు(తూర్పు), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారిగా సీహెచ్ ఆశారాణిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. విజయవాడలో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమె జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్‌గా పదోన్నతి పొందారు. గుంటూరు కార్మిక శాఖ కార్యాలయంలో గురువారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆశారాణి మాట్లాడుతూ గతంలో గుంటూరు, తెనాలి ప్రాంతాల్లో సహాయ కమిషనర్ ఆఫ్ లేబర్‌గా విధులు నిర్వహించానని, పదోన్నతిపై జోన్‌కు రావడం సంతోషంగా ఉందన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే కార్మికులు నేరుగా కలవచ్చన్నారు. ఈ శ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడిలో రైళ్ల స్టాపేజీల పునరుద్ధరణ

గుంటూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడితో పాటు గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని మిర్యాలగూడ, నల్గొండలో కొన్ని రైళ్లకు తొలగించిన స్టాపేజీలను రైల్వే శాఖ పునరుద్ధరించింది. నంబరు. 12603 చెన్నై సెంట్రల్ - హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 15వ తేదీ నుంచి సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండలో స్టాపేజీలను పునరుద్ధరించారు. నంబరు. 12733 తిరుపతి - లింగంపల్లి నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌కి పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడలో, నంబరు. 17015 భువనేశ్వర్ - సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్‌కి సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండలో నిలుపుదల పునరుద్ధరించారు. నంబరు. 17212 యశ్వంత్‌పూర్ - మచిలీపట్నం కొండవీడు ఎక్స్‌ప్రెస్‌కి కంభం, నంబరు. 17256 లింగంపల్లి - నరసపూర్‌కు మంగళగిరి, నంబరు. 17625 కాచీగూడ - రేపల్లె ఎక్స్‌ప్రెస్‌కి వేజండ్ల, నంబరు. 17255 నరసపూర్ - లింగంపల్లికి నల్గొండ, నంబరు. 17643 చెంగల్‌పట్టు - కాకినాడ రైలుకు మంగళగిరి, న్యూగుంటూరు, నంబరు. 17216 ధర్మవరం - విజయవాడ ఎక్స్‌ప్రెస్‌కి మార్కాపురం రోడ్డులో స్టాపులను పునరుద్ధరించారు. ఈ నెల 18వ తేదీ నుంచి నంబరు. 17232 నాగర్‌సోల్ - నరసపూర్ ఎక్స్‌ప్రెస్‌కి సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండలో నిలుపుదల సౌకర్యాన్ని తిరిగి అమలులోకి తీసుకొచ్చినట్లు డీఆర్ఎం సుధేష్ణ సేన్ ఒక ప్రకటనలో తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

దారి దోపిడీ కేసులో ఇద్దరు అరెస్టు

మేడికొండూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మేడికొండూరు సమీపంలో ఈ నెల 5న రాత్రి జరిగిన దారి దోపిడీ కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. దోపిడీకి గురైన సొత్తులో కొంత భాగాన్ని స్వాధీనం చేసుకున్నారు. మేడికొండూరు పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిందితుల వివరాలను తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. ఈ నెల 13న పిడుగురాళ్లలో సూర్య సెమ్ కంపెనీ వద్ద కార్లను తనిఖీ చేస్తుండగా ఈ కేసులో నిందితులైన అంకుష్, మహాదేవ్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా రూ.70 లక్షల నగదును దోపిడీ వ్యవహారం వెలుగుచూసిందన్నారు. వారి కారులో 40 లక్షల నగదు, ఆరు లక్షల విలువ చేసే బంగారం, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు రంజిత్ మారుతి పటేల్‌తో పాటు మిగిలిన వారు పరారీలో ఉన్నారని వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. నిందితులను అరెస్టు చేసిన సీఐ నాగూర్ మీరా సాహెబ్, సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐలు సుబ్బారావు, సత్యనారాయణ, కానిస్టేబుళ్లు జాన్ సైదా, బాజీ సాహెబ్‌లకు ఎస్పీ సతీష్ కుమార్ అభినందనలు తెలిపారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

ఆర్టీఈ రెండో విడత సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు(విద్య), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం ద్వారా ఒకటో తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు(రెండో విడత) ఆహ్వానిస్తున్నట్లు డీఈవో సీవీ రేణుక గురువారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 20 లోగా విద్యార్థుల తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ నివాసం నుంచి ఐదు కిలోమీటర్ల దూరం లోపు ఉన్న పాఠశాలల్లో మాత్రమే ప్రవేశాలకోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సీఎస్‌ఈఏపీ.జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

రాష్ట్ర అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

గుంటూరు(తూర్పు), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఇటీవల చీరాలలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా క్రీడాకారులు ఏపీ స్టేట్ అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. వివిధ అంశాలలో 14 బంగారు, 11 వెండి, 6 రజత మొత్తం 31 పతకాలను కైవసం చేసుకున్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా సంఘ ఛైర్మన్ జి శేషయ్య, కార్యదర్శి ప్రసాదు, ఏఐసీసీ కార్యదర్శి ఉషారాణి అభినందించారు.

అలరించిన శ్రీకృష్ణ భక్తి గీతాలాపన

గుంటూరు(తూర్పు), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బృందావన గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం పద్మావతీ కల్యాణ వేదికపై గురువారం భక్త నారద గాన సభ ఆధ్వర్యంలో జరిగిన శ్రీకృష్ణ భక్తిగీతాలాపన ప్రేక్షకులను ఆకట్టుకుంది. సంగీత విద్వాంసుడు డాక్టర్ ఆకురాతి కోదండరామయ్య గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఏపీ విశ్రాంత డీజీపీ మాలకొండయ్య, విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

నేటి నుంచి పోలేరమ్మ తల్లి పొంగళ్ళ మహోత్సవం

గుంటూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): చుట్టుగుంట శ్రీపోలేరమ్మతల్లి పొంగళ్ళ మహోత్సవాలు శుక్రవారం నుంచి ఆదివారం వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు భక్తబృందం తెలిపారు. 15న ఉదయం అమ్మవారికి 108 బిందెలతో పంచామృత స్నానాలు, అనంతరం విశేష పూజలు, 16న మధ్యాహ్నం 12గంటలకు పల్లకీసేవ, సాయంత్రం 4కి నవమ రథోత్సవం పురవీధుల్లో ఊరేగింపు జరుగుతుందన్నారు. 17న అమ్మవారికి సద్ది, పొంగళ్ళు, జాతర మహోత్సవాలు, మధ్యాహ్నం అన్నదానం జరుగుతుందన్నారు. రాత్రి 7 గంటలకు సాంస్కృతికకార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

ఆర్‌వీఆర్ జేసీలో నూరుశాతం సీట్ల భర్తీ

గుంటూరు(విద్య), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక చోడవరంలోని ఆర్‌వీఆర్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి నూరు శాతం సీట్లు భర్తీ అయినట్లు కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఈఏపీ సెట్ కన్వీనర్ కోటా రెండోవిడత సీట్ల కేటాయింపు గురువారం జరిగినట్లు తెలిపారు. ఇంజనీరింగ్ సీట్ల ప్రవేశ, ప్రారంభ, ముగింపు ర్యాంకులు గత సంవత్సరం కన్నా ముందస్తు మెరుగైన ర్యాంకులతో సీట్ల భర్తీ జరిగిందన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, విద్యార్థులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.


డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

సమస్యలు పరిష్కారం కాకపోతే ప్రత్యక్ష ఆందోళన

గుంటూరు(విద్య), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలను అమలుపరచాలని యూటీఎఫ్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు డీఈవో రేణుకకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఆర్జేడీ ఉత్తర్వుల ప్రకారం ఎన్ అజయ్ కుమార్‌కు తుళ్లూరు ఎంఈఓ(ఎఫ్ఏసీ) బాధ్యతలు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ఎంఈఓ 1 ఉత్తర్వులు పద్ధతి ప్రకారం జరగడంలేదని యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజశేఖరరావు ఎం కళాధర్ ఆందోళన వ్యక్తం చేశారు.

వర్ష ప్రభావిత ప్రాంతాల్లో అండగా జీఎంసీ

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నగరంలో వర్షపు నీటికి ప్రభావితమైన చుట్టుగుంటలోని మురికిపేట ప్రాంత ప్రజలకు నగరపాలక సంస్థ అండగా ఉంటుందని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గురువారం వర్షపు నీటి ప్రభావిత ప్రాంతాలైన చుట్టగుంట, మురికిపేట ప్రాంతాలలో కమిషనర్‌తో కలిసి మేయర్ పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో, చుట్టుపక్కల ప్రాంతాలలో గత రెండు రోజులుగా కురుస్తున్న వానల కారణంగా ఈ ప్రాంతాలలో భారీగా వరదనీరు ఇళ్లలోకి చేరిందన్నారు. ఆయా ప్రాంతాలలో అధికారులతో కలిసి పర్యటించి ముంపు కారణమైన డ్రెయిన్ ఆక్రమణలను గుర్తించి యుద్ధప్రాతిపదికన తొలగించామన్నారు. స్థానికులకు ఆహారప్యాకెట్లను అందజేశారు. ఏమైనా ఇబ్బందులుంటే ప్రజలు, నగరపాలకసంస్థ కాల్‌సెంటర్ 0863-2345103కి ఫోన్‌చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, అచ్చాల వెంకటరెడ్డి, డిప్యూటీ కమిషనర్ టి. వెంకటకృష్ణయ్య, ఇన్‌ఛార్జ్ ఎస్ఈ సుందరరామిరెడ్డి, డీసీపీ సూరజ్‌కుమార్, ఇన్‌ఛార్జి ఎంహెచ్ఓ రామారావు ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.


పేదలకు సహాయం అందిస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్

పులివెందుల కోటలో సైకిల్ సవారి: ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందుల కంచుకోటలో సైకిల్ సవారీ చేసిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఫలితాల్లో వైసీపీని మట్టికరిపించి టీడీపీ విజయం సాధించిన సందర్భంగా గుంటూరు తూర్పు కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ వైనాట్ 175 అని విర్రవీగిన జగన్మోహన్ రెడ్డి సైన్యానికి వైనాట్ పులివెందుల అని ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. సొంత నియోజకర్గంలోనూ ప్రజలకు జగన్‌ను నమ్మే పరిస్థితిని కోల్పోయారని తెలిపారు. రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ విధ్వంసం సృష్టించడమే జగన్‌కు తెలిసిన పాలన అని విమర్శించారు.


పులివెందులలో గెలుపుతో సంబరాలు చేసుకుంటున్న ఎమ్మెల్యే నసీర్, తెలుగు తమ్ముళ్లు

● నూనెవారి ట్రస్ట్ ఆధ్వర్యంలో..

నూనెవారి ట్రస్ట్ సేవలు అభినందనీయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నూనెవారి ట్రస్ట్ ఆధ్వర్యంలో నాజ్‌సెంటర్లోని సత్రంలో రూ.1.10కోట్ల వ్యయంతో చేపట్టిన నిర్మాణాలను ఎమ్మెల్యే నసీర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన బ్లాక్‌లో ఆరు దుకాణాలు, రెండు గోడౌన్ల నిర్మాణాలు చేపట్టారని, ఇవి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు.

నిఘా వ్యవస్థలు బలోపేతమైతేనే నేరాలు తగ్గుముఖం

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్


సంస్థ బ్రోచర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి, ఎస్ఐఎస్ఎస్ ఎండీ సత్యనారాయణ, ఆడిటర్ భార్గవి తదితరులు

గుంటూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సమాజంలో నిఘా వ్యవస్థలు బలోపేతమైతేనే నేరాలు తగ్గుతాయని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోనున్న కాటన్ అసోసియేషన్ హాల్లో గురువారం సత్య ఇన్వెస్టిగేషన్ సెక్యూరిటీ సర్వీసెస్ (ఎస్ఐఎస్ఎస్)పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మాజీ ప్రిన్సిపాల్ యలమంచిలి శ్రీధర్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ ఆలపాటి మాట్లాడుతూ జనాభా పెరుగుదలకు అనుగుణంగా పోలీసుల సంఖ్య పెరగలేదన్నారు. అందువల్ల ప్రభుత్వ, ప్రైవేట్ నిఘా, రక్షణ వ్యవస్థల ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. రాష్ట్రంలో ఎస్ఐఎస్ఎస్ తన సేవలను విస్తృత పరిచి ప్రజల మన్ననలను పొందారని కితాబునిచ్చారు. సంస్థ వెబ్‌సైట్‌ను ప్రారంభించిన రేరా మాజీ ఛైర్మన్ డాక్టర్ ఎలమాటి రామనాథం మాట్లాడుతూ విశ్రాంత ఏఎస్పీ సత్యనారాయణ పోలీస్ శాఖలో తన అనుభవాలను సంస్థపై కేంద్రీకరించడం వలన మూడు రాష్ట్రాల్లో కార్పొరేట్, అంతర్జాతీయ సంస్థలకు ఆధునిక సాంకేతికపరిజ్ఞానాన్ని అనుసంధానం చేసి రక్షణ వ్యవస్థను బలోపేతం చేశారని ప్రశంసించారు. ఎస్ఐఎస్ఎస్ ఎండీ కాళహస్తి సత్యనారాయణ మాట్లాడుతూ గత 15 ఏళ్ల నుంచి ప్రముఖ సంస్థలకు నాణ్యమైన సేవలు అందించామన్నారు. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వెబ్‌సైట్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, బ్రోచర్ల ద్వారా తమ సేవలను విస్తృత పరుస్తామన్నారు. కార్యక్రమంలో ఆడిటర్ వి.భార్గవి, సంస్థ సలహాదారులు, విశ్రాంత ఐజీ రవిచంద్ర, ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ చందు సాంబశివరావు, విశ్రాంత డీఎస్పీలు సుబ్బారెడ్డి, కేవీ నారాయణ, పోతురాజు, ఏపీ కాటన్ అసోసియేషన్ కార్యదర్శి కొర్రపాటి రామారావు, పెదనందిపాడు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాఘవయ్య, మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, పాతూరి శ్రీనివాసరావు, వాణిజ్యపన్నుల శాఖ రిటైర్డ్ డీసీ కోదండరామయ్య, దివ్యభారతి, మేరిగ విజయలక్ష్మి తదితరులున్నారు.


బస్టాండ్‌లో నిరసన తెలియజేస్తున్న ఎన్ఎంయూ ఉద్యోగులు

ఆర్టీసీ బస్టాండ్‌లో ఎన్ఎంయూ ఉద్యోగుల నిరసన

● పీఆర్‌సీని ప్రకటించాలని ఉద్యోగుల డిమాండ్

గుంటూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఆర్టీసీ బస్టాండ్‌లో నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన ప్రదర్శన చేశారు. ఉద్యోగులకు వెంటనే పీఆర్‌సీని ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎంయూ జిల్లా ఛైర్మన్ సుబ్బారావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే చెల్లించాలని కోరారు. ఆర్టీసీలో ఉన్న 8వేల ఖాళీలను రిక్రూట్‌మెంట్‌తో భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు అమర్నాథ్, పీఎస్ రావు, కే లక్ష్మయ్య తదితరులున్నారు.

ఇంజనీరింగ్ రెండో విడత సీట్ల కేటాయింపు పూర్తి చేయాలి

● ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం కిరణ్ డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు కిరణ్ తదితరులు

గుంటూరు(విద్య), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ రెండో విడత సీట్ల కేటాయింపు సత్వరం పూర్తిచేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్ డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించి దాదాపు 20 రోజులు గడిచినా నేటికీ విద్యార్థులకు సీట్లు కేటాయించలేదన్నారు. ప్రైవేట్ యూనివర్సిటీల గొంతెమ్మ కోరికలు తీర్చేందుకు అనేక రకాలుగా ప్రభుత్వం విద్యార్థులను ఇబ్బంది పెడుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎస్కే సమీర్, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి ఏ యశ్వంత్, ఉపాధ్యక్షుడు సుభాని తదితరులు పాల్గొన్నారు.

ప్రజల తరపున స్వరమై వినిపించాలి

● జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులు విజయ భారతి సయాని

గుంటూరు (విద్య), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మానవహక్కులకు భంగం కలిగినప్పుడు బాధితుల తరపున విద్యార్థులు తమ స్వరాన్ని వినిపించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులు విజయ భారతి సయాని అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని గురువారం విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లా, నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రోల్ ఆఫ్ ఎన్‌హెచ్ఆర్‌సీ ఇన్ ప్రొటెక్షన్ ఆఫ్ ఫండమెంటల్ అండ్ హ్యూమన్ రైట్స్ అనే అంశంపై జాతీయస్థాయి వర్క్‌షాప్‌లో ముఖ్య అతిథిగా విజయ భారతి సయాని మాట్లాడారు. వ్యక్తుల ప్రాణం, స్వేచ్ఛ, గౌరవం, సమానత్వం వంటి మౌలిక హక్కులను కాపాడటంలో ఎన్‌హెచ్ఆర్‌సీ ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు వ్యక్తి స్వేచ్ఛ, సమానత్వం, గౌరవాన్ని కాపాడటానికి ఉద్దేశించబడ్డాయన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ కల్నల్ ప్రొఫెసర్ పీ.నాగభూషన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, డైరెక్టర్లు, లా డిపార్ట్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భారతి సయాని

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

గుంటూరు(విద్య), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక పలకలూరులోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో గురువారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా విద్యార్థులు ఉట్టికొట్టే కార్యక్రమాలు ఉత్సాహంగా పాల్గొన్నారు ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వీ అనురాధ పాల్గొన్నారు

బీహెచ్ కళాశాలలో..

స్థానిక బ్రాడీపేటలోని బండ్లమూడి హనుమాయమ్మ డిగ్రీ కళాశాలలో గురువారం కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు కృష్ణ చరితం నాటికను ప్రదర్శించి అలరించారు. పుట్టి కొట్టే కార్యక్రమం, సాంస్కృతి కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బీ కౌసల్యాదేవి, వైస్ ప్రిన్సిపల్ రాధా మాధురి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం

● తూర్పు ఎమ్మెల్యే నజీర్

గుంటూరు మెడికల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు రూపొందించిన పి4 విధానం ద్వారా రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి వేగంగా ముందుకు సాగుతున్నట్లు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ తెలిపారు. సాంబశివపేట ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో అహల్యా చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్, రాజకుమారి దంపతులచే మాజీ మంత్రి శనక్కాయల అరుణ పేరున రూ.25 లక్షల వ్యయంతో మహిళా కళాశాలలో నిర్మించిన మూడు తరగతి గదులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సభకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీఆర్ జ్యోష్నకుమారి అధ్యక్షత వహించారు. అనంతరం డాక్టర్ అరుణ, డాక్టర్ గౌరీశంకర్ దంపతులను ఎమ్మెల్యే నజీర్, కళాశాల యాజమాన్యం, పూర్వ విద్యార్థుల సంఘం, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు ఎస్ నరేంద్ర కుమార్, ఎస్ చందన, స్టూడెంట్ కౌన్సిల్ కన్వీనర్ డాక్టర్ విజయశ్రీ, డాక్టర్ విజయలక్ష్మి, ఉమానిశ్చల్ పాల్గొన్నారు.


గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నసీర్, డాక్టర్ గౌరీశంకర్

పులివెందుల ఫలితాలతో జగన్‌రెడ్డి పతనం

● ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల ఫలితాలతో జగన్‌రెడ్డి పతనం మొదలైందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. నియోజకవర్గ కార్యాలయంలో గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగడంతో, తన ఓటమిని ముందే పసిగట్టిన జగన్‌రెడ్డి అసహనంతో చంద్రబాబును దూషిస్తూ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సూపర్ సిక్స్ హామీలలో భాగంగా ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే మాధవి తెలిపారు.





దొండ పందిరిని ముంచెత్తిన వరద నీరు, పోతార్లంక వద్ద వరద నీటిలో చిక్కుకున్న బీర తోట, కంద పంటలో చేరిన వరద నీరు

వరదకు.. లంకలు విలవిల

● ఉధృతంగా కృష్ణానది ప్రవాహం.. ● పల్లపు ప్రాంతాలను ముంచెత్తుతున్న వైనం.. మునిగిన వాణిజ్య పంటలు, ఇటుక బట్టీలు ● కొల్లూరు కరకట్టను తాకిన వరద ప్రవాహం.. గంట గంటకు పెరుగుతున్న వరద

కొల్లూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానదిలో వరద ఉధృతి పెరుగుతూ లోతట్టు ప్రాంతాలను వరద నీరు ముంచెత్తుతోంది. కొల్లూరు మండలంలోని చింతల్లంక, పోతార్లంక గ్రామాల వద్ద లోతట్టు ప్రాంతాల్లోని వాణిజ్య పంటలు అరటి, కంద, పసుపు, కూరగాయ తోటలు వరద ముంపునకు గురయ్యాయి. అరవింద వారధి ఎగువన ఉన్న గండిలో నుంచి వరద నీరు పెసర్లంక గ్రామాన్ని చుట్టుముట్టి గోతులను ముంచెత్తుతూ కొల్లూరు కరకట్టను తాకింది. పోతార్లంక, గాజుల్లంక మధ్యలో నదీ అంచులు కోతకు గురై వరద నీరు ఆ గండ్లలో నుంచి పల్లపు ప్రాంతాలను ముంచెత్తింది. గాజుల్లంక, పోతార్లంక, పెసర్లంక, కొల్లూరు గ్రామాల పరిధిలో ఉన్న ఇటుక బట్టీలన్ని వరద నీటిలో చిక్కుకున్నాయి. గురువారం ఉదయం 4.50 లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీటిని దిగువకు విడుదల చేశారు. గంట గంటకు వరద నీరు పెరుగుతూ సాయంత్రం సమయానికి 5.65 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయడంతో కొల్లూరు కరకట్ట దిగువన ఆవులవారిపాలెం శివారులో రోడ్లపై ప్రవహించే విధంగా వరద నీరు పోటెత్తింది. 6 లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీరు వస్తే లంక గ్రామాల్లో రోడ్లపై వరద నీరు ప్రవహించి లంక గ్రామాల రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. ఎగువ నుంచి ఎంత వరద నీరు దిగువకు వస్తుందో చెప్పలేని పరిస్థితి నెలకొందని వచ్చిన నీటిని వచ్చినట్లుగానే ప్రకాశం బ్యారేజీ నుంచి విడుదల చేస్తున్నట్లుగా అధికారులు చెబుతున్నారు. వరద ఉధృతి మరింత పెరిగితే లంక గ్రామాల్లోని ప్రజలను ఏ క్షణమైన ఖాళీ చేసేందుకు యంత్రాంగం సమాయత్తమైంది. పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, కొల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో మకాం వేసి వరద పరిస్థితిపై ఎప్పటికప్పుడు అధికారులను సమీక్షిస్తూ ముందస్తు చర్యలకు సిద్ధమవుతున్నారు.



ముంపు బారిన అరటి తోట



కొల్లూరు వద్ద వరద నీటిలో ఇటుక బట్టీలు

రైతులందర్నీ ఆదుకుంటాం

● నాలుగు నెలల్లో కురవాల్సిన వర్షాలు ఒక్కరాత్రిలోనే ● నష్టపోయిన రైతుల బాధలు మనస్సును కలిచివేశాయి ● నీరు తగ్గాక వ్యవసాయాధికారులు నష్టం అంచనా వేస్తారు ● తెనాలి డివిజన్‌లో పంట నష్టం పరిశీలించిన మంత్రి మనోహర్



నీటమునిగిన పంటపొలాలను పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి రూరల్, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): నాలుగు నెలల పాటు కురవాల్సిన వర్షం నాలుగు గంటల్లో కువడం వల్లనే పంటలు మునిపోయి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంటలు నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం తరుపున ఆదుకుంటాం.ఎవ్వరూ అధైర్యపడవద్దు. అన్నదాత కష్టం తెలిసిన ప్రభుత్వం మనదని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. గురువారం తెనాలి నియోజవర్గంలో ముంపుకు గురై పంటలు నష్టపోయిన రైతులను మంత్రి మనోహర్ అధికారులతో కలిసి పరామర్శించారు. పంటలు నీటమునిగి చెరువులను తలపిస్తున్న తీరును గమనించి రైతులతో మాట్లాడారు. ఇప్పటికే మూడు సార్లు వెద పద్ధతిలో నాట్లు వేశామని ఒక్కోసారి వెద పెట్టడానికి దాదాపుగా రూ.15వేల వంతున ఖర్చు చేశామని తెలిపారు. భారీ వర్షానికి పంటలన్ని మునిగిపోయి నీరు బటయకు వెళ్లే దారిలేక నష్టం వాటిల్లిందని ఆదుకోవాలని కోరారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ, వర్షం పూర్తిగా తగ్గిన తరువాత వ్యవసాయశాఖ అధికారులు పర్యటించి నష్టం అంచనావేస్తారని తెలిపారు. తప్పనిసరిగా నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించేలా ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందన్నారు. వాణిజ్యపంటలపై కూడా నష్టం అంచనావేస్తున్నామన్నారు. కౌందరు కౌలు రైతులు తిరిగి వెద పెట్టుకునేందుకు విత్తనాలు అడిగారని వాటిని అందించేలా చూస్తానని వివరించారు.

అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి

ప్రకాశం బ్యారేజ్ రెండో ప్రమాద హెచ్చరిక నేపథ్యంలో కొల్లిపర మండలం లంక గ్రామాల్లో వరద నీటి తాకిడికి ఆస్తి, ప్రాణ నష్టం కలుగుకుండా తీసుకోవల్సిన ముందస్తు జాగ్రత్తలపై అధికార యంత్రాంగాన్ని మంత్రి మనోహర్ అప్రమత్తం చేశారు. వరద నీటి ప్రవాహాన్ని ముందుగా అంచనా వేయాలన్నారు. ముంపు ప్రాంతాల ప్రజల కోసం ముందస్తుగా రెండు బోట్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా బియ్యం, నూనె, గ్యాస్, ఇతర నిత్యవసర సరుకులు అందుబాటులో ఉంచాలన్నారు.

గాంధీజీ.. గుర్తులు

● స్వాతంత్ర్య సంగ్రామంలో మహాత్ముడి పర్యటనలు

బ్రిటీష్ వారి కబంధ హస్తాల్లో చిక్కుకుని విలవిలలాడిన ఎందరో గాంధీజీ స్ఫూర్తితో స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములయ్యారు. ఎందరో ఆస్తులను త్యాగం చేయగా.. పలువురు సంతానాన్ని కూడా వదులుకుని స్వాతంత్ర్య సంగ్రామంలో కీలక పాత్ర పోషించారు. ఈ క్రమంలో గాంధీజీ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. గాంధీజీతో నడిచిన ఎందరో నేతలు ఆయా ప్రాంతాలకు ప్రత్యేకతను తీసుకువచ్చారు. స్వాత్రంత్ర్య దినోత్సవం సందర్భంగా నాటి గాంధీజీ గుర్తులు ఆంధ్రజ్యోతి పాఠకుల కోసం..



పొన్నూరు పట్టణంలో నిర్మించిన గాంధీజీ ఆలయం

పొన్నూరులో.. గాంధీజీకి గుడి

పొన్నూరుటౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర సంగ్రామంలో పొన్నూరు ప్రాంతానికి ప్రత్యేక స్థానం ఉంది. నిడుబ్రోలుకు చెందిన ఆచార్య ఎన్జీరంగా మహాత్మా గాంధీ సమకాలికుడిగా ఆయన అనుచరుడిగా గుర్తింపు పొందారు. ఆచార్య ఎన్జీరంగా సతీమణి భారతీదేవి కూడా స్వాతంత్ర సంగ్రామంలో పాల్గొన్నారు. వీరు సంతానాన్ని సైతం వద్దనుకుని స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్నారు. పొన్నూరుకి చెందిన చేనేత ఉద్యమనేత ప్రగడ కోటయ్య ఆచార్య ఎన్జీరంగా, మహాత్మా గాంధీల వెంట నడిచి అనేకమార్లు ఆంగ్లేయుల నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు. పొన్నూరు మండలం తాళ్లపాలెం గ్రామానికి చెందిన ఆయుర్వేద వైద్యుడు జీయర్ దాస్ మహాత్మా గాంధీ ప్రియ శిష్యుడుగా పేరుపొందారు. ఎన్జీరంగా, జీయర్ దాసుల విజ్ఞప్తి మేరకు గాంధీ నిడుబ్రోలు రైల్వే స్టేషన్లో దిగి పాదయాత్రగా తాళ్లపాలెం చేరుకుని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుతం ఆ మార్గం గాంధీ మార్గంగా వినతికెక్కింది. గాంధీజి పర్యటనకు గుర్తుగా గ్రామంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి నేటికీ స్మరించుకుంటున్నారు. స్వాతంత్ర సమరయోధుడు అదరాపురపు శేషగిరిరావు గాంధీజీకి పొన్నూరులోని భావనారాయణ స్వామి ఆలయ సమీపంలో 1955లో గుడిని నిర్మించారు.



తాళ్లపాలెం గ్రామానికి వెళ్లే గాంధీ మార్గం

ఉద్యమానికి ఊపిరిలూదిన నల్లూరు

రేపల్లె: రేపల్లె మండలం నల్లూరు గ్రామం స్వాతంత్ర పోరాటానికి ఊపిరిలూదింది. గ్రామస్థుల స్ఫూర్తిని మెచ్చిన మహాత్మాగాంధీ గ్రామంలో పర్యటించారు. ఈ సమయంలో నల్లూరు వాసులు తమ దేహాలపై ఉన్న అభరణాలను గాంధీకి విరాళంగా అందించారు. స్వాతంత్ర్యపోరాటంలో ఒకరి భావాలు ఒకరు అర్థం చేసుకోవాలంటే అందరికీ ఒకే భాష ఉండాలని నేతలు గుర్తించి గ్రామస్థులకు తెనాలికి చెందిన వెంకటప్పయ్య హిందీతోపాటు ఉద్యమ తరగతులు నిర్వహించారు. ఉప్పు సత్యాగ్రహం, విదేశీ వస్తు బహిష్కరణ, ఇలా అనేక ఉద్యమాలు ఆనాడు సాగించారు. 1934 జనవరి 18న గాంధీ స్థూపం నిర్మించారు. అది నాటి త్యాగాలకు జ్ఞాపక చిహ్నంగా నిలిచింది.



నాడు ఉద్యమకారులు నల్లూరులో నిర్మించిన గాంధీ స్థూపం



పేటేరులో స్వాతంత్ర్య సమర యోధుల గుర్తుగా ఏర్పాటు చేసిన స్థూపం

పేటేరులో నడియాడిన గాంధీజీ

రేపల్లె: రేపల్లె మండలం పేటేరు గ్రామంలో గాంధీ 1943లో ఆంధ్రరత్న గోపాలకృష్ణయ్య గ్రంధాలయంలో బసచేసి ఉద్యమకారులను చైతన్య పరిచారు. ఉద్యమాలకు ఊపిరిగా ఉన్న పేటేరు గ్రామంలో 28 మంది స్వాతంత్ర్య ఉప్పు సత్యాగ్రహంలో కీలక పాత్ర పోషించి జైలు జీవితాన్ని గడిపారు. గాంధీజీ నడియాడిన ప్రాంతంలో గుర్తుగా 1955లో విగ్రహాన్ని నిర్మించారు. నల్లూరుపాలెం గ్రామాన్ని కూడా గాంధీజీ సందర్శించారు. దీనికి గుర్తుగా 1946లో గ్రామ నడిబొడ్డులో గాంధీజీ విగ్రహాన్ని నెలకొల్పారు.



పేటేరులో గాంధీజీ బస చేసిన భవనం


రెంటచింతలలో గాంధీ బహిరంగ సభ



మహాత్మాగాంధీ బహిరంగ సభ ఏర్పాటు చేసిన వైఆర్ఎస్ హైస్కూల్

రెంటచింతల: జాతిపిత మహాత్మాగాంధీ రెంటచింతలలో 95 ఏళ్ల క్రితం ఏప్రిల్ 21, 1929న పర్యటించారు. ఉప్పుసత్యాగ్రహం ప్రారంభానికి ముందు గాంధీ వైఆర్ఎస్ హైస్కూల్ ప్రాంగణానికి వచ్చి భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. నాళం మట్టపల్లి, పెరుమాళ్ల శాయన్న, దుగ్గరాజు నరసింహయ్య, ఏచూరి వెంకయ్య, గుండా వెంకటరత్నం, కట్టమూరి సంజీవయ్యలు చీరాల వెళ్లి దుగ్గిరాల గోపాలకృష్ణయ్యను కలిసి మహాత్ముడ్ని రెంటచింతలకు వచ్చేలా ఒప్పించాలని కోరారు. సదరు నేతలు బందర్‌లో ఉన్న గాంధీని కలిసి రెంటచింతలకు వచ్చేలా చేశారు. పాఠశాల ప్రాంగణంలో తాటాకు పందిళ్లు వేసి 800 పై చిలుకు రాట్నాలు వేశారు. జలియన్‌వాలాబాగ్ ఘటనలో తీవ్రంగా గాయపడిన పంజాబ్‌కేసరి లాలాజిపతిరాయ్ పేరున రెంటచింతలలో అదేరోజున ఎలిమెంటరీ పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరగా అందుకు అంగీకరించిన గ్రామ పెద్దలు ఎల్ఎల్ఆర్ స్కూల్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పటికీ ఆ పాఠశాల కొనసాగుతూనే ఉంది.

గాంధీ నాటిన మొక్కకు 92 ఏళ్లు



కావూరు వినయాశ్రమంలో పెరిగిన గాంధీ నాటిన అశ్వద్ధ వృక్షం



కావూరు వినయాశ్రమంలో 23-12-1933న అశ్వద్ధమొక్క నాటుతున్న గాంధీ

రేపల్లె, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): చెరుకుపల్లి మండలం కావూరు గ్రామానికి చెందిన తుమ్మల బసవయ్య, దుర్గాంబ దంపతులు మహాత్మాగాంధీ స్ఫూర్తితో 50 ఎకరాల భూమిని వి నయాశ్రమం స్థాపనకు ఇచ్చారు. 1933లో ఇక్కడకు వచ్చిన గాంధీజీ అశ్వద్ధ వృక్షాన్ని నాటారు. ఈ మొక్కకు ప్రస్తుతం 92 ఏళ్లు. వినయాశ్రమం ప్రారంభించి రాజకీయ పాఠశాలకు తెరతీశారు.

స్త్రీ శక్తికి.. సిద్ధం

(7వ పేజీ తరువాయి)

అవగాహన కల్పించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఫ్లెక్సీల రూపంలో డిస్‌ప్లే చేశారు. మహిళల ఉచిత ప్రయాణానికి పల్నాడు జిల్లాలో 399 బస్సులను ఆర్టీసీ సిద్ధం చేసింది. చీరాల బస్టాండ్ వేదికగా శుక్రవారం సాయంత్రం స్త్రీశక్తి పథకాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 87 రూట్లలో ఆర్టీసీ సర్వీసులు నడుస్తుండగా, 90 శాతం రూట్లలో స్త్రీశక్తి పథకం అమలుకానుంది.

రద్దీ దృష్ట్యా భద్రతపై ప్రత్యేక శ్రద్ధ..

శుక్రవారం నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలవుతున్న దృష్ట్యా భద్రతపై ఆర్టీసీ ప్రత్యేక శ్రద్ధ పెట్టనున్నది. గతంతో పోలిస్తే బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్యలో దాదాపు 25 శాతం పెరుగుదల నమోదు కానుందనే అంచనాలు ఉన్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని అటు బస్సుల్లో, ఇటు డిపోలు, బస్టాండ్ ప్రాంగణాల్లో కూడా పెరిగే రద్దీని సమర్ధంగా నిర్వహించడానికి సిబ్బందికి ఇప్పటికే కొన్ని సూచనలు చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. మహిళల భద్రతతో పాటు వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి చెబుతున్నారు. ఆరంభంలో అవగాహన లేక అనుమతి లేని బస్సుల్లో కూడా మహిళలు ఎక్కే అవకాశం ఉందని, సంయమనంతో ఉండి వారికి సమాధానం చెప్పాలని ప్రభుత్వం సిబ్బందికి సూచిస్తోంది.

ఉచిత ప్రయాణం వర్తించే బస్సులు..

స్త్రీ శక్తి పథకంలో భాగంగా ఆర్టీసీలో ఐదు రకాల బస్సులకు మహిళలకు ఉచిత ప్రయాణం వర్తించేలా ప్రభుత్వం ఇప్పటికే జీవో జారీ చేసింది. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సుల్లో మహిళల రద్దీ 20 నుంచి 30 శాతం మేరా పెరిగే అవకాశం ఉందని ఆ మేరకు ఏర్పాట్లు చేశారు. పల్లెవెలుగు బస్సుల్లో ఫుట్ బోర్డు విస్తరణ, లోపల నిల్చొన్న మహిళలు పట్టుకునేలా హ్యాండిల్ స్లింగ్స్, అత్యవసర ద్వారం వంటి ఏర్పాట్లు చేశారు.





అమరావతిలో నిర్మించే బసవ తారకం కేన్సర్ ఆసుపత్రి నమూనా

అత్యాధునికంగా బసవ తారకం ఆసుపత్రి

గుంటూరు మెడికల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్‌లో పాతికేళ్లుగా క్యాన్సర్ సంరక్షణలో విశ్వసనీయమైన పేరుగాంచిన బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, తన ప్రయాణంలో సరి కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది. విభజిత ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలోని తుళ్లూరు సమీపంలో బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ కొత్త క్యాన్సర్ కేర్ క్యాంపస్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కాపిటల్ రీజియన్ అమరావతిలోని తుళ్లూరులో పదేళ్ల కిందట గత టీడీపీ ప్రభుత్వం 15 ఎకరాల స్థలం కేటాయించింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆసుపత్రి నిర్మాణ పనులు ఏమాత్రం ముందుకు సాగలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోనికి రావడంతో ఎట్టకేలకు కేన్సర్ ఆసుపత్రి నిర్మాణం ప్రారంభమైంది. ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించి చిత్రాలు గురువారం బయటకు వచ్చాయి.

భారీ వర్షం.. నష్టం.. కష్టం

(7వ పేజీ తరువాయి)

నీరు ప్రవహించడంతో రాకపోలకు అంతరాయం ఏర్పడింది. క్రోసూరు మండలంలోని దొడ్లేరులో గృహాల్లోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. అమరావతి మండలంలో నరుకుళ్లపాడు, ఎండ్రాయి వాగుల వెంబడి వరదనీరు భారీగా ప్రవహిస్తుంది. వరద ప్రభావంతో నరుకుళ్లపాడు వద్ద అమరావతి గుంటూరు రహదారి పక్కన మట్టి కొతపడింది. వరదనీటిలో ఉన్న మొక్కలు నల్లబడుతూ మొక్కలు ఎండిపోయే పరిస్థితి నెలకుంది. తుంగభద్ర, కొల్లిమర్ల డ్రైయిన్‌తో పాటు చేబ్రోలు మండలంలోని గుంటూరు నల్లడ్రెయిన్ ఉధృతి రెండో రోజు కూడా కొనసాగింది. డ్రెయిన్‌పై నుంచి వచ్చే వరద నీటితో పొన్నూరు, చేబ్రోలు మండలాల్లోని వరి పొలాల్లోని వాన నీరు బయటకు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. తాడికొండ మండలంలో భారీ వర్షానికి 11,461 ఎకరాల్లో పంటలు నీటమునిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు నివేదికలు సిద్ధం చేశారు. గురువారం కూడా కొండవీటి వారు, ఎర్రవాగు ఉధృతంగా ప్రవహించాయి.

వెద వెతలు

గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో తొలుత వర్షాభావ పరిస్థితుల్లో ఖరీఫ్‌లో వరి సాగు విషయంలో అధికశాతం రైతులు వెద పద్ధతి వైపే మొగ్గు చూపారు. ఎకరానికి రూ.పది వేల వరకు ఖర్చు చేశారు. గత నెలలో, ప్రస్తుతం కురిసిన భారీ వర్షాల ధాటికి వరి నష్టపోయినట్లు రైతులు వాపోతున్నారు. పెట్టిన పెట్టుబడి మొత్తం వర్షార్పణమైనట్లేనని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. వరిపైరు లేత దశలో ఉందని ఇప్పటికే 48 గంటల నుంచి నీళ్లలోనే ఉందని, అది కుళ్లిపోవడం ఖాయమని, పెట్టిన పెట్టుబడి అంతా నష్టపోవడమేననే రైతులు వాపోతున్నారు. వరుణుడు గురువారం శాంతించినా రెండు రోజుల నుంచి పైర్లు ముంపులోనే ఉండడంపై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో నష్టం తేలడానికి మరో రెండు రోజుల సమయం పడుతుందని వ్యవసాయశాఖ చెబుతోంది. పొలాల్లో నిలిచిన నీళ్లను బయటకు పంపడానికి ఉన్న అన్ని అవకాశాలను పరిశీలిస్తున్నామని, రైతులకు కూడా ఈ విషయంలో ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

బాపట్ల జిల్లాలో 16,309 హెక్టార్లు ముంపు

గురువారం బాపట్ల జిల్లా వ్యాప్తంగా 13 మీమీ. సగటు వర్షపాతం కురవగా అత్యధికంగా కారంచేడు మండలంలో 23 మీమీ. వర్షం కురిసింది. వర్షాల ధాటికి జిల్లా వ్యాప్తంగా ముంపు బారిన పడిన పైర్ల విస్తీర్ణంపై వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనాలు రూపొందించింది. 9 మండలాల పరిధిలోని 69 గ్రామాలపై కుండపోత వర్షాల ప్రభావం ఉన్నట్లు తేల్చారు. వరి 16,197, వేరుశనగ 112 హెక్టార్లలో ముంపునకు గురికాగా 21,108 మంది రైతులపై ప్రభావం చూపినట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఇవి ప్రాథమిక అంచనాలేనని, పొలాల్లో వరద తగ్గుముఖం పట్టాక కచ్చితత్వంతో కూడిన గణన ఉంటుందని అధికారులు తెలిపారు.

నకరికల్లులో అత్యధికంగా 90.8 మీమీ..

పల్నాడు జిల్లాలోని నకరికల్లు మండలంలో అత్యధికంగా 90.8 మీమీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ గురువారం వెల్లడించింది. వెల్దుర్తి మండలంలో 84, కారంపూడి 82.6, రాజుపాలెం 77.2, పిడుగురాళ్ల 56.8, సత్తెనపల్లి 54.8, అమరావతి 50.8, పెదకూరపాడు 50.2 దాచేపల్లి 45.2, అచ్చంపేట 43.2, నరసరావుపేట 40.2, మాచర్ల 38, గురజాల 38.8, ఈపూరు 37.2, దుర్గి 26.8, బొల్లాపల్లి 30.8, వినుకొండ 23.8, నూజెండ్ల 22.8, శావల్యాపురం 23.6, రొంపిచర్ల 18.2, ముప్పాళ్ల 38.6, నాదెండ్ల 20.2, చిలకలూరిపేట 18.4, యడ్లపాడు మండలాల్లో 22.2 మీమీ వర్షపాతం నమోదైంది.



మువ్వన్నెల్లో.. ఎయిమ్స్

శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగరి ఎయిమ్స్ ఆస్పత్రి భవనాలను మువ్వన్నెల విద్యుద్దీప కాంతులతో శోభాయమానంగా అలంకరించారు. మూడు రంగుల్లో వెలుగులీనుతున్న ఎయిమ్స్ భవనాలు సందర్శకులను కట్టిపడేస్తున్నాయి. - ఆంధ్రజ్యోతి, మంగళగిరి



గుంటూరు రైల్వే డివిజన్... సెక్యూరిటీ కమిషనర్‌కి రాష్ట్రపతి పతకం



గుంటూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ జీ మధుసూదనరావుకు ప్రతిష్టాత్మకమైన రాష్ట్రపతి పోలీసు పతకం వరించింది. గురువారం కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డుని ప్రకటించింది. 1989లో ఆర్‌పీఎఫ్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా మధుసూదనరావు విధుల్లో చేరారు. గత 36 సంవత్సరాలుగా ఆయన చేసిన కృషి, చూపిన ధైర్యసాహసాలకు కేంద్రం ఈ ప్రతిష్టాత్మకమైన రాష్ట్రపతి పతకాన్ని ప్రకటించింది. అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్‌గా పదోన్నతిపై ఆయన 2014 నుంచి 2025 వరకు రైల్వేబోర్డు, రైల్ వీల్ ఫ్యాక్టరీ, మౌలాలి, విజయవాడ డివిజన్లలో విధులు నిర్వహించారు. గత నెల 23వ తేదీన డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్‌గా ఆయన ఉద్యోగోన్నతి పొందారు. 2016లో ఇండియన్ పోలీసు మెడల్, 2014లో జీఎం మెడల్, ఐదు పీసీఎస్‌సీ అవార్డులు, 16 డీఆర్‌ఎం అవార్డులను ఆయన గతంలో అందుకొన్నారు. ఆయన్ను డీఆర్‌ఎం సుదేష్ణ సేన్, ఏడీఆర్‌ఎం రమేష్, ఇతర అధికారులు అభినందించారు.

పార్టీలకు అతీతంగా 'అన్నదాత' నిధులు: సునీత

రైతులంతా చంద్రబాబు వెనకే: కందికుంట

ధర్మవరం/రామగిరి, కదిరి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): గతంలో జగన్‌రెడ్డి రూ.15వేలు ఇస్తామని చెప్పి కొంతమందికే ఇచ్చారని, సీఎం చంద్రబాబు పార్టీలకు అతీతంగా రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేశారని ఎమ్మెల్యే పరిటాల సునీత చెప్పారు. శ్రీసత్యసాయి జిల్లా రామగిరిలో 'అన్నదాత సుఖీభవ' పథకం అమలుపై హర్షంవ్యక్తం చేస్తూ రైతులతో కలిసి గురువారం భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సునీత స్వయంగా ట్రాక్టర్ నడిపారు. కాగా, 'అన్నదాత సుఖీభవ' పథకం అమలును హర్షిస్తూ కదిరిలో 500 ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ వాహనాలకు, రైతులకు డబ్బులు ఇవ్వకున్నా స్వచ్ఛందంగా తరలివచ్చి చంద్రబాబుకు మద్దతు తెలుపుతున్నారని, ఒక్క పిలుపుతో ఇంతమంది తరలివచ్చారంటే.. అది చంద్రబాబు పాలపై ప్రజలకు ఉన్న నమ్మకమేనని అన్నారు.



శ్రీసత్యసాయి జిల్లా రామగిరిలో ట్రాక్టర్ ర్యాలీలో పాల్గొన్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

పొలం చెరువైంది!

68,441 హెక్టార్లలో నీట మునిగిన పంటలు

భారీ వర్షాలు, వరదలతో రైతన్నకు కష్టం

పంటలు మునిగినా.. దెబ్బతినలేదు: వ్యవసాయ శాఖ

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలతో పొలాలు చెరువుల్లా మారాయి. రాష్ట్రవ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. గురువారం సాయంత్రం వరకు 68,441 హెక్టార్లలో పంటలు ముంపులో ఉన్నట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. 13 ఉమ్మడి జిల్లాల్లోని 79 మండలాల్లో వరి పంట 59,473 హెక్టార్లలో ముంపులో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అదేవిధంగా పత్తి 7,664, మినుము 549, పెసర 397, వేరుశనగ 257, కంది 51, మొక్కజొన్న 26, సజ్జ 24, నారుమళ్లు 18 హెక్టార్లలో మునిగినట్లు అంచనా వేశారు. గుంటూరు జిల్లాలో 28,645 హెక్టార్లలో, బాపట్ల 16,325, పశ్చిమ గోదావరి 7,555, ఎన్టీఆర్ 4,619, కృష్ణా 3,621, పల్నాడు 2,561, ఏలూరు 2,050, కోనసీమ 1,080, కాకినాడ 898, కర్నూలు 649, తూర్పుగోదావరి 250, అనంతపురం 143, కడప జిల్లాలో 45 హెక్టార్లలో పంటలు ముంపునకు గురైనట్లు తేల్చారు. వరద ముంపు ప్రాంతాల్లో పంటలు మునిగినా, పూర్తిగా దెబ్బతినలేదని వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు తెలిపారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే 33 శాతం కంటే ఎక్కువ పంట నష్టం సంభవించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కాగా, భారీగా వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ఏలూరు జిల్లా యంత్రాగం అప్రమత్తమైంది. కలెక్టరేట్‌తో పాటు, డివిజన్ కేంద్రాల్లో ప్రత్యేక కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో వరి పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. యానాం, ఉమ్మడి తూర్పులో పలుచోట్ల ఫ్లాష్ ఫ్లడ్ ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. కాకినాడ పోర్టులో మూడో ప్రమాద హెచ్చరిక జారీ అయింది. పిఠాపురంలో సుద్దగడ్డకు వరద పోటెత్తింది. రోడ్లపై వరద నీరు ప్రవహించగా పొలాలు ముంపులో చిక్కుకున్నాయి. గొల్లప్రోలు పట్టణ శివారు జగనన్న కాలనీకి వెళ్లే రహదారిపైకి గురువారం సుద్దగడ్డ వరద నీరు భారీగా నీరు చేరడంతో నిచ్చెన సహాయంతో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిని ఎక్కి, రహదారి అవతల వైపునకు చేరుకుని పాఠశాలలు, కళాశాలలకు వెళ్లారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో వందల ఎకరాల్లో పంటలు ముంపునకు గురికావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా పెద్దపప్పూరు మండలం ముచ్చుకోటలో సుబ్బమ్మ అనే మహిళ ఇంటి పైకప్పు కుంగి గురువారం మధ్యాహ్నం కూలిపోయింది. ఆ సమయంలో ఆమె ఇంట్లో లేకపోవడంతో ప్రమాదం తప్పింది.



బాపట్ల జిల్లా కొల్లూరులో ముంపు బారిన అరటి తోట

కోస్తా, సీమకు వర్ష సూచన

విశాఖపట్నం, అమరావతి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్రకు ఆనుకుని వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో బుధవారం ఉదయం ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతోంది. శుక్రవారం నాటికి దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర మీదుగా తీరం దాటనుంది. దీని ప్రభావంతో శుక్రవారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు, ఉత్తర కోస్తాలో అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయి. గుంటూరు, కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాలకు వరద ప్రమాదం ఉందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. కాగా.. బంగాళాఖాతంలో 18న అల్పపీడనం ఏర్పడుతుందని అంచనా వేస్తోంది. దీనిప్రభావంతో 17 నుంచి ఉత్తర కోస్తాలో, 18, 19 తేదీల్లో కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల వర్షాలు, ఉత్తర కోస్తాలో భారీవర్షాలు కురుస్తాయని వెల్లడించింది. మరోవైపు ప్రకాశం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. వరద తగ్గేవరకూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు. కాగా, భారీవర్షాలకు గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. గురువారం సాయంత్రానికి పోలవరం ఎగువన భద్రాచలం వద్ద 19.80 అడుగులకు చేరింది. మంజీర, శబరి, సీలేరు, ప్రవర, పర్ణ, ఇంద్రావతి నదులు పొంగి పొర్లుతూ గోదావరిలో కలుస్తున్నాయి. పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 1,90,566 క్యూసెకులు దిగువకు విడుదల చేసినట్టు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. స్పిల్‌వే ఎగువన 27.950 మీ, దిగువన 18.120మీ. నీటిమట్టం నమోదైంది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ఇక్కడ ఎవరి కుంపటి వారిదే!

అల్లు అరవింద్



'జాతీయ పురస్కారాల్లో తెలుగు సినిమాలకు ఏడు అవార్డులొచ్చాయి. అయినా మన సినీ పరిశ్రమ స్పందించలేదు. ఇక్కడ ఎవరి కుంపటి వారిదే' అని సంచలన వ్యాఖ్యలు చేశారు నిర్మాత అల్లు అరవింద్. ప్రతిష్ఠాత్మక సైమా(సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్) 2025 వేడుకలు సెప్టెంబరు 5, 6 తేదీల్లో దుబాయ్‌లో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయ అవార్డు విజేతలను 'సైమా' ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో అల్లు అరవింద్ మాట్లాడుతూ 'సైమా' స్పందించి, విజేతలను సత్కరించడం అభినందనీయం. నిజానికి దీన్ని ఒక పండగలా జరుపుకోవాలి. 'సైమా' దీన్ని అద్భుతంగా ముందుకు తీసుకెళ్తున్నందుకు అభినందనలు తెలియజేస్తున్నా' అని అన్నారు. కార్యక్రమంలో దర్శకులు అనిల్ రావిపూడి, ప్రశాంత్ వర్మ, సాయి రాజేశ్, నిర్మాత సాహు గారపాటి, హీరో సందీప్ కిషన్, హీరోయిన్లు మంచు లక్ష్మి, వేదిక, ఫరియా అబ్దుల్లా, 'సైమా' ఛైర్ పర్సన్ బృందా తదితరులు పాల్గొన్నారు.

తొలి అడుగులు పడింది అక్కడే



చెన్నైలోని అడయార్ హౌస్‌కు, రజనీకాంత్ నటజీవితానికీ ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ఆయన నటించిన తొలి చిత్రం 'అపూర్వ రాగంగళ్' షూటింగ్ అక్కడే జరిగింది. ఈ భవంతి గేటును తోసుకుంటూ లోపలికి వచ్చే షాటును రజనీకాంత్‌పై తొలిసారిగా దర్శకుడు కె.బాలచందర్ చిత్రీకరించారు. ఆ చిత్రం 1975లో ఆగస్టు 15న విడుదలైంది. అలా ఆ సినిమాతో కెరీర్‌ను ప్రారంభించిన రజనీకాంత్.. హీరోగా ఎదిగి దాదాపు 170పైకి పైగా చిత్రాల్లో నటించి 'తలైవర్' అనే బిరుదును దక్కించుకున్నారు. ఆయనతో నటనపరంగా తొలి అడుగులు వేయించిన ఈ అడయార్ హౌస్‌ను అభిమానులు ఓ టూరిస్ట్ స్పాట్‌గా భావిస్తుంటారు.

ఆలయం కట్టించిన అభిమాని

తమిళనాడులో మధురై జిల్లా తిరుమంగళంకు చెందిన రజనీకాంత్ వీరాభిమాని కార్తీక్ ఆయనకు గుడి కట్టించారు. రజనీపై అభిమానంతో తన ఇంటిలోని కొంత భాగాన్ని 2023లో గుడిగా మార్చినట్లు తెలిపారు. 'అరుల్మిగు రజనీ కోవిల్'గా నామకరణం చేసిన ఈ ఆలయంలో రజనీ చిత్రాల్లోని రెండు విగ్రహాలను ప్రతిష్ఠించి, నిత్యం పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

-చెన్నై (ఆంధ్రజ్యోతి)

సజీవ పాత్రలతో సాగే చిత్రం



పలు బాలల చిత్రాలు తీసి ప్రతిష్ఠాత్మక అవార్డులు దక్కించుకున్న దర్శకనిర్మాత భీమగాని సుధాకర్ గౌడ్ తెరకెక్కించిన తాజా చిత్రం 'ఆపద్బాంధవుడు'. సామాజిక సేవ చేసే పెంచల్ రెడ్డి జీవిత కథతో రూపొందించిన ఈ చిత్రాన్ని పెంచల్‌రెడ్డి, లీలావతి నిర్మించారు. పెంచల్‌రెడ్డి, సుధాకర్ గౌడ్, ఝాన్సీ, ప్రతిమ, నాగేశ్వరరావు కీలక పాత్రల్లో నటించారు. గురువారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో చిత్రదర్శకుడు సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ 'సజీవ పాత్రలతో సాగే చిత్రమిది. బయోపిక్‌లా, లైవ్‌గా, సరికొత్త పద్ధతిలో తెరకెక్కించాం. సెప్టెంబరు 5న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని చెప్పారు.

హిందీ హక్కులు ఆ సంస్థకే



తేజ సజ్జా కథానాయకుడిగా కార్తిక్ ఘట్టమనేని తెరకెక్కిస్తోన్న చిత్రం 'మిరాయ్'. రితికా నాయక్ కథానాయిక. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో తేజ సజ్జా సూపర్ యోధగా అలరించనున్నారు. కాగా, ఈ చిత్రం హిందీ థియేట్రికల్స్ రైట్స్‌ను ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు కరణ్ జోహార్‌కు చెందిన 'ధర్మ' ప్రొడక్షన్స్ దక్కించుకుంది. నార్త్‌లో 'బాహుబలి', 'దేవర' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను విజయవంతంగా విడుదల చేసిన చరిత్ర ఈ సంస్థకు ఉంది.

అరె ఓ సాంబా.. షోలేకు యాభై ఏళ్లట!



భారతీయ సినిమాను కొత్త దారుల్లో కదం తొక్కించిన సినిమా 'షోలే'. సరిగ్గా యాభై ఏళ్ల క్రితం అంటే 1975 ఆగస్టు 15న విడుదలైంది. వరుస అపజయాలతో ఉన్న అమితాబ్‌కు పెద్ద హిట్ ఇవ్వడమే కాకుండా విలన్ 'గబ్బర్ సింగ్' పాత్ర పోషించిన కొత్త నటుడు అంజాద్ ఖాన్‌ను ఓవర్‌నైట్ స్టార్‌ను చేసిన సినిమా 'షోలే'. 'అరె ఓ సాంబా' అంటూ ఆయన పలికిన ఊతపదం జనానికి తారక మంత్రమైంది. దర్శకుడు రమేశ్ సిప్పీ చేసిన ఈ అద్భుతమైన మ్యాజిక్ గురించి కొన్ని ఆసక్తికరమైన సంగతులు..

- షోలే' సినిమా విడుదలైన రోజు అంతటా ఫ్లాప్ టాక్. ఆడడం కష్టం అన్నారు. టికెట్లు అమ్ముడు కాని పరిస్థితి. అయితే అనూహ్యంగా పుంజుకుని ఫుల్ రన్‌లో దాదాపు 25 కోట్ల టికెట్లు అమ్ముడైన భారతీయ చిత్రంగా నిలిచింది.
- థ్రిల్ కలిగించే పోరాటాలు, హృదయాన్ని హత్తుకొనే భావోద్వేగాలు, నాటకీయత, ధర్మేంద్ర, అమితాబ్ మధ్య స్నేహబంధం, అంజాద్ ఖాన్ విలనీ, ఉర్రూతలూగించిన ఆర్.డి. బర్మన్ సంగీతం.. మిగిలిన చిత్రాల్లో 'షోలే'ను ప్రత్యేకంగా నిలిపాయి.
- మూడు గంటల ముప్ఫై నాలుగు నిముషాల నిడివి ఉన్న 'షోలే' బడ్జెట్ రూ. 3 కోట్లు. రూ. 35 కోట్లకు పైగా వసూలు చేసి సంచలనం సృష్టించింది.
- 50 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఇటలీలోని బాలోనా చిత్రోత్సవంలో జూన్ 27న రీస్టోర్డ్ వెర్షన్‌ను ప్రదర్శించారు మేకర్స్. ఇందులో ముగింపు సన్నివేశాన్ని మార్చడంతో పాటు కొన్ని తొలగించిన సీన్లను కూడా జతచేయడం విశేషం.

గణతంత్ర దేశంగా భారత్ ఆవిర్భవించడానికి రెండేళ్ల ముందే ప్రస్తుత ఎన్టీఆర్ జిల్లాలోని 'పరిటాల' ప్రాంతం ప్రత్యేక గణతంత్ర దేశంగా ఏర్పడిన సంగతి మీకు తెలుసా? తనకంటూ సొంత రాజ్యాంగం రాసుకుని ఏడాదికి పైగా ప్రజలకు అవినీతి, అక్రమాలకు తావులేని సుపరిపాలనను అందించిందని తెలుసా? పంద్రాగస్టు నేపథ్యంలో నాటి పరిటాల రిపబ్లిక్‌పై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- నిజాం అరాచకాలపై తిరుగుబాటు చేసి..
- స్వతంత్ర రిపబ్లిక్‌గా ప్రకటించుకున్న 'దేశం'
- ఇండియా రిపబ్లిక్‌గా మారాక అందులో విలీనం
- పరిటాలకు చరిత్ర పుటల్లో విశిష్ట స్థానం
- 21 మంది కేంద్ర కమిటీ సభ్యులతో పరిపాలన
- ప్రత్యేక రాజ్యాంగమూ రూపకల్పన
- అవినీతి, అక్రమాలకు తావులేని సుపరిపాలన

రిపబ్లిక్ ఆఫ్ పరిటాల!



(విజయవాడ/కంచికచర్ల -ఆంధ్రజ్యోతి)

1950 జనవరి 26వ తేదీన 'భారత రిపబ్లిక్' ఆవిర్భవించింది. కానీ... అంతకంటే ముందే మనదేశంలోనే ఒక ప్రాంతం 'రిపబ్లిక్'గా ఏర్పడింది. నిజాం నిరంకుశ పాలనపై తిరుగుబాటు చేసి... తనకుతాను స్వతంత్రం ప్రకటించుకుంది. అదే 'పరిటాల రిపబ్లిక్'! దీనికి ఘనమైన చరిత్ర ఉంది. హైదరాబాద్ కేంద్రంగా 1724లో నిజాం రాజ్యం ఏర్పడిన తర్వాత నిజాం ఆలీఖాన్.. ఆరు ఆంధ్ర జిల్లాలను బ్రిటిష్ ప్రభుత్వానికి అప్పగించారు. అయితే... విజయవాడ సమీపంలోని పరిటాలతో పాటుగా గని ఆత్కూరు, మోగులూరు, బత్తినపాడు (కంచికచర్ల మండలం), ఉస్తేపల్లి, కొడవటికల్లు (చందర్లపాడు మండలం), మల్లవల్లి (నూజివీడు ప్రాంతం) గ్రామాలను మాత్రం తన అధీనంలోనే ఉంచుకున్నాడు. ఇక్కడ విలువైన వజ్రాలు దొరుకుతుండడమే కారణం. ఈ ఏడు గ్రామాలతో పరిటాలను ప్రత్యేకంగా 'కానాత్'గా ప్రకటించి, పోలీసుస్టేషన్, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేశాడు. నిజాం పాలనలో దురాగతాలకు, దౌర్జన్యాలకు అడ్డే లేదు. రజాకార్ల ఆగడాలతో ధన, మాన, ప్రాణాలకు విలువ లేకుండా పోయింది. ప్రభుత్వ ఉద్యోగుల్లో అవినీతి జడలు విప్పింది. ఈ అరాచక పాలనతో జనం విసిగి వేసారిపోయారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో చదువుతున్న కొందరు పరిటాల యువకులు నిజాం దురాగతాలను ఎండగడుతూ.. ప్రజలకు మద్దతుగా నిలిచారు. దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినా... నిజాం పాలనకు మాత్రం తెరపడలేదు. అది 'ప్రత్యేక సంస్థానం'గా కొనసాగింది. ఈ క్రమంలో పరిటాల ప్రజల్లోనూ స్వాతంత్ర్యకాంక్ష రగిలింది. నిజాం సంకెళ్ల నుంచి విముక్తికి నడుం బిగించారు. ప్రభుత్వ ఉద్యోగులను నిర్బంధించారు. కొడవటికల్లులో ఎస్ఐపై దాడిచేశారు. అంతకు ముందు నరరూప రాక్షసుడుగా పేరొందిన ప్రభుత్వ ఉద్యోగి లంకా సుబ్బయ్య శాస్త్రిని హత్య చేశారు. 1947 నవంబరు 12 అర్ధరాత్రి పోలీసు స్టేషన్‌పైనే దాడిచేసి తుపాకులు స్వాధీనం చేసుకున్నారు. రెవెన్యూ కార్యాలయాన్ని, సబ్ ట్రెజరీని తమ అధీనంలోకి తీసుకున్నారు. భయపడిన పోలీసు, రెవెన్యూ అధికారులందరూ హైదరాబాద్‌కు పారిపోయారు.

పరిటాల రిపబ్లిక్ ఆవిర్భావం..

ఉద్యమ నేతలు 1947 నవంబరు 15వ తేదీన 'పరిటాల రిపబ్లిక్'ను ప్రకటించారు. మాదిరాజు దేవరాజును అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అయితే తిరుగుబాటుదార్లను దేశద్రోహులుగా చిత్రీకరించి, నిజాం ప్రభుత్వం వారిపై అరెస్టు వారెంట్లు జారీ చేసింది. ఇండియన్ యూనియన్ గ్రామాల మీదుగా తమ బలగాలు పరిటాల వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని నిజాం కోరడంతో మద్రాస్ రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇదే విషయాన్ని కృష్ణా జిల్లా కలెక్టర్ మలయప్పన్ పరిటాల రిపబ్లిక్ కేంద్ర కమిటీ సభ్యులకు తెలిపారు. నిజాం బలగాలకు అనుమతి ఇవ్వొద్దని కోరుతూ పరిటాల విశ్వనాథం, మాదిరాజు మాధవరావు, బండి వెంకయ్య, అవ్వా సత్యనారాయణ బృందం మద్రాస్ ప్రభుత్వం వద్దకు వెళ్లి, హోం మంత్రి సుబ్బరాయన్‌కు పరిస్థితి వివరించింది. మాదిరాజు సీతారామరాజు, మన్నెం చినకోటయ్యల బృందం ఢిల్లీ వెళ్లి గాంధీజీని, ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, ఉపప్రధాని-హోం మంత్రి సర్దార్ పటేల్ తదితరులను కలిసింది. ఎక్కడికక్కడ ఘర్షణలు జరుగుతాయని, శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని జిల్లా కలెక్టర్ కూడా నివేదికలు పంపడంతో నిజాం బలగాలకు మద్రాస్ ప్రభుత్వం అనుమతి రద్దు చేసింది. అప్పట్లో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, స్వామి రామానంద తీర్థ, కోదాటి నారాయణరావు, రావి నారాయణరెడ్డి, టి.హయగ్రీవాచారి, ప్రకాశం పంతులు, కాకాని వెంకటరత్నం, జయప్రకాశ్ నారాయణ్ తదితర నేతలు పరిటాలను సందర్శించి ఉద్యమానికి మద్దతు పలికారు.


మద్య నిషేధం... కుల మతాలకు అతీతం

హైదరాబాద్ సంస్థానంపై 1948 సెప్టెంబరు 17న భారత ప్రభుత్వం పోలీసు చర్యకు దిగడంతో నిజాం పదవీచ్యుతుడయ్యాడు. హైదరాబాద్ ఇండియన్ యూనియన్‌లో విలీనమైంది. ఆ తర్వాత భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా పరిటాల రిపబ్లిక్ కేంద్ర కమిటీ సభ్యులే భారత్‌లో కలిసిపోతామని ఢిల్లీ పెద్దలకు విజ్ఞప్తిచేశారు. వారి ఆమోదంతో పరిటాల రిపబ్లిక్ ఇండియాలో విలీనమైంది. ఏడాదికిపైగా స్వతంత్రంగా కొనసాగిన పరిటాల రిపబ్లిక్ దేశంలోనే మొదటి రిపబ్లిక్‌గా చరిత్ర పుటల్లో ప్రత్యేక స్థానం పొందింది.



పరిటాల వ్యూ


పరిటాల రాజ్యాంగ రూపకర్త..



పరిటాల రిపబ్లిక్‌కు ప్రత్యేకంగా రాజ్యాంగాన్ని రూపొందించిన అవ్వా సత్యనారాయణ పరిటాల వాసి. అక్కడే పుట్టారు. హైదరాబాద్‌లో చదువుకుని బారిస్టర్ పూర్తి చేశారు. 1946 నాటికి ప్రముఖ ప్లీడర్‌గా పేరొందారు. మాదిరాజు రామ్మోహనరావు, నరసింహారావుతో కలిసి ఉద్యమంలో పాల్గొన్నారు. వాక్చాతుర్యంతో పాటుగా న్యాయశాస్త్రంపై పట్టు కలిగిన ఆయన పరిటాల రిపబ్లిక్‌ను భారతదేశంలో విలీనం చేసేందుకు మద్రాస్, ఢిల్లీ ప్రభుత్వాల పెద్దలతో రాయబారాలు నడిపారు.

నిజాంపై తిరగబడిన తిరుపతయ్య

బత్తినపాడులో దళిత సామాజిక వర్గానికి చెందిన మాదాసు తిరుపతయ్య పరిటాల ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ప్రజల్లో పెల్లుబికిన అసంతృప్తిని ఆయుధంగా మలచుకుని నిజాంపై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. కేంద్ర కమిటీ సభ్యుడైన చిలంకూరి బ్రహ్మయ్య తొలుత బత్తినపాడుకు పటేల్‌గా పనిచేశారు. ఆయనకు ప్రజల్లో మంచి పట్టు ఉంది. ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచిన ఆయనతో కలిసి తిరుపతయ్య నిజాం ఆగడాలను ప్రతిఘటించారు. చివరివరకు నిరాడంబర జీవితం గడిపారు.




జనరంజక పాలన..

పరిటాల రిపబ్లిక్ పాలన కోసం ప్రతి గ్రామం నుంచి ముగ్గురేసి సభ్యుల వంతున మొత్తం 21 మందితో కేంద్ర కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాదిరాజు దేవరాజు.. ఉపాధ్యక్షుడిగా మాగంటి కోటి రామయ్య ఉన్నారు. పలు ప్రభుత్వ శాఖలను ఏర్పాటు చేశారు. ఎక్కడా అవినీతి, అక్రమాలకు తావు లేకుండా తగిన చర్యలు తీసుకున్నారు. మద్య నిషేధాన్ని పటిష్ఠంగా అమలు చేశారు. ఆదాయం, ఖర్చులకు సంబంధించి పారదర్శకంగా లెక్కలు చూపించారు. చెరువులకు మరమ్మతులు చేశారు.

ప్రమాణపత్రం


రిపబ్లిక్‌కు కంకణబద్ధుడిగా ఉంటానని ప్రతి సభ్యుడితో ఆరోజుల్లో ప్రమాణం చేయించారు. దీని కోసం ప్రత్యేకంగా గ్రామ క్షేమ ప్రమాణ పత్రాన్ని రూపొందించారు. 'బయటి నుంచి వచ్చే ప్రమాదాలను, అవాంతరాలను హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అనే భేదం లేకుండా కలిసికట్టుగా ధైర్యంగా ఎదుర్కొందాం, ఇతర మతాల వారికి నష్టాలను కలుగచేయం' అని అందులో పొందుపరిచారు.

మాదిరాజు గుంటూరు వాసి..



పరిటాల రిపబ్లిక్ అధ్యక్షుడిగా పనిచేసిన మాదిరాజు దేవరాజు 1918లో గుంటూరులో జన్మించారు. తండ్రి ఉద్యోగరీత్యా ఆయన చదువంతా హైదరాబాద్‌లో సాగింది. తెలుగు, ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ, పార్శీ భాషలపై మంచి నైపుణ్యం కలిగిన ఆయనకు యోగాలో కూడా మంచి ప్రావీణ్యం ఉంది. స్వామి రామానంద తీర్థ సలహా మేరకు పరిటాల ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించారు. మంచి మాటకారి, సమయస్ఫూర్తి కలిగిన దేవరాజు ఎనలేని ప్రజాభిమానం పొందారు.

నిజాంకు ఎదురొడ్డి పోరాడిన షేక్ మౌలా



ఈ ఉద్యమంలో చెప్పుకోదగిన పోరాటయోధుడు షేక్ మౌలా. ముస్లిం అయిన మౌలా నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడడం విశేషం. కొందరు మత పెద్దలు తలపై చెప్పులు పెట్టి అవమానించినప్పటికీ తన ప్రాణాలు పణంగా పెట్టి స్వేచ్ఛ కోసం పోరాడాడు. నిజాం మూకలు ఆయన్ను హత్య చేయబోతే హిందువులు రహస్యంగా ఓ ఇంట్లో దాచి కాపాడారు. మౌలా పోరాట స్ఫూర్తి అందరినీ కదిలించింది.

టెట్ మార్కుల సవరణకు నేడూ అవకాశం

అమరావతి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ మార్కుల స్కోర్ కార్డులో టెట్‌పై అభ్యంతరాలకు పాఠశాల విద్యాశాఖ మరో అవకాశం ఇచ్చింది. ఇప్పటికే రెండు సార్లు టెట్ మార్కుల్లో సవరణకు అవకాశం కల్పించగా, శుక్రవారం కూడా అభ్యంతరాలు తెలపవచ్చని డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే అభ్యంతరాలు లేవనెత్తిన అభ్యర్థుల సవరించిన తుది మార్కులను గురువారం విడుదల చేశారు.

త్యాగాలు స్మరించుకోవాలి: గవర్నర్ నజీర్

అమరావతి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మనం స్వేచ్ఛా ఫలాలను ఆస్వాదించడానికి మార్గం సుగమం చేసిన సమరయోధులను స్వాతంత్ర్య దినోత్సవం రోజున స్మరించుకోవాలని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ గుర్తు చేశారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రప్రజలందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

భారత్ త్యాగాల పునాదులపై నిర్మితం: పవన్

అమరావతి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మన దేశం ఎందరో మహనీయుల త్యాగాల పునాదులపై నిర్మితమైన స్వతంత్ర ప్రజాస్వామ్య సౌధమని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవానికి సన్నద్ధమైన దేశ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మువ్వన్నెల జెండా సగర్వంగా రెపరెపలాడుతోందంటే నాటి త్యాగధనుల ఆత్మార్పణల ఫలితమేనని పేర్కొన్నారు.

పోలవరంపై కాగ్ నివేదిక

అమరావతి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పోలవరం సాగునీటి ప్రాజెక్టుపై ఆడిట్ నివేదికను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) గురువారం గవర్నర్‌కు సమర్పించింది. ఈ నివేదికను శాసనసభ ముందుంచుతారు. వచ్చేనెలలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఈ నివేదికను ఉంచుతారు.

ఉద్యోగం నుంచి పట్నం ఎస్ఐ తొలగింపు

- గిరిజన మహిళను లైంగికంగా వేధించిన ఫలితం

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): గిరిజన మహిళను లైంగికంగా వేధించినందుకు శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం పట్నం ఎస్ఐ రాజశేఖర్ ఉద్యోగాన్ని కోల్పోయారు. న్యాయం కోసం పోలీసు స్టేషన్‌కు వెళ్లిన ముదిగుబ్బ మండలం గరుగుతండాకు చెందిన మహిళను ఆయన లైంగికంగా వేధించారు. రాత్రిళ్లు న్యూడ్ వీడియో కాల్స్ చేశారు. ఈ వీడియో కాల్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో ఎస్పీ వి.రత్న సమగ్ర విచారణకు ఆదేశించారు. మూడు రోజుల క్రితం ఆయనను వీఆర్‌కు పంపారు. వేధింపులు నిజమేనని విచారణలో తేలడంతో ఉద్యోగం నుంచి తొలగిస్తూ కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు.

కేతిరెడ్డి పెద్దారెడ్డికి భద్రత కల్పించండి: హైకోర్టు

అమరావతి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఈనెల 18న తాడిపత్రిలోని ఆయన ఇంటికి వెళ్లడానికి, అక్కడ నివసించడానికి తగిన భద్రత కల్పించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య తాడిపత్రి వెళ్లేందుకు పెద్దారెడ్డికి అనుమతి ఇచ్చింది. కాన్వాయ్‌లో 5 వాహనాలకు మించి ఉండకూడదని తేల్చిచెప్పింది. అనుచరులను రెచ్చగొట్టకూడదని, ఇంటివద్ద ఏ సమయంలో కూడా 50-60 మందికి మించి జనం ఉండటానికి వీల్లేదని స్పష్టం చేసింది. విచారణను సెప్టెంబరు 19కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ ఉత్తర్వులు ఇచ్చారు.

మిథున్‌రెడ్డితో భార్య, కుమారుడు ములాఖత్

రాజమహేంద్రవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న లిక్కర్ స్కామ్ నిందితుడు, వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని ఆయన సతీమణి లక్ష్మీదివ్య, కుమారుడు పి.వెంకట జశ్విన్‌రెడ్డి, మాజీ మంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ గురువారం ములాఖత్‌లో కలిశారు. వీరిని కలవడానికి వచ్చిన మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ మీడియాతో మాట్లాడారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందన్నారు.

నేటి నుంచే 'ఉచిత బస్సు'

- బెజవాడలో 'స్త్రీ శక్తి' పథకాన్ని ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు



బస్సులో ప్రయాణిస్తూ మహిళలతో మాట్లాడుతున్న సీఎం (ఫైల్)

అమరావతి/విజయవాడ (బస్‌స్టేషన్), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం(స్త్రీ శక్తి) హామీ అమలుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. శుక్రవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని 2.62 కోట్ల మంది మహిళలకు స్త్రీ శక్తి వర్తిస్తుందని, ప్రతి నెలా రూ.వెయ్యి నుంచి మూడు వేల రూపాయల వరకూ మహిళలకు ఆదా అవుతుందని ప్రభుత్వ అంచనా. ఈ పథకం కోసం ఏడాదికి రూ.1,942 కోట్ల భారాన్ని ప్రభుత్వమే భరించనుంది. ఆర్టీసీలోని మొత్తం బస్సుల్లో 8,458 బస్సుల్లో (74 శాతం) మహిళలు, యువతులు, థర్డ్ జెండర్లు ఉచితంగా ప్రయాణించవచ్చు. ఈ మేరకు ఇటీవలే ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో.. ఆధార్, రేషన్ కార్డు, ఓటర్ ఐడీలలో ఏదో ఒకటి చూపించి కండక్టర్ జారీ చేసే జీరో ఫేర్ టికెట్‌తో ప్రయాణించవచ్చు. స్త్రీ శక్తి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ఏపీఎస్ఆర్టీసీ యాజమాన్యం కసరత్తు పూర్తిచేసింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న బస్సులతో మొదలుపెట్టి, అవసరం మేరకు భవిష్యత్తులో కొత్త బస్సులు సమకూర్చుకోనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. డ్రైవర్ల కొరత ఉండటంతో ఆన్‌కాల్ డ్రైవర్లను నియమించుకుని ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్త పడ్డారు. నాన్‌స్టాప్, సూపర్ లగ్జరీ, ఏసీ బస్సులు, ఘాట్ రోడ్లలో తిరిగే బస్ సర్వీసుల్లో ఉచిత ప్రయాణం వర్తించదని అధికారులు తెలిపారు.

సూపర్ సిక్స్‌లో మరో అడుగు..

ఎన్నికల హామీల్లో భాగంగా ఇప్పటికే కూటమి ప్రభుత్వం వృద్ధులు-వికలాంగులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, రైతులకు అన్నదాత సుఖీభవ, నిరుద్యోగులకు మెగా డీఎస్సీ విడుదల చేసింది. విద్యార్థుల తల్లులకు తల్లికి వందనం, దీపం-2లో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్లు అమలు చేసింది. తాజాగా స్త్రీ శక్తి పథకాన్ని అమల్లోకి తెచ్చి రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించబోతోంది.

ఎలాంటి ఇబ్బందులు కలగొద్దు: ఆర్టీసీ ఎండీ

స్త్రీ శక్తి పథకంపై ఆర్టీసీ ఎండీ సీహెచ్.ద్వారకా తిరుమలరావు గురువారం తన చాంబర్ నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రయాణికులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి అధికారి ఆయా జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. మహిళా ప్రయాణికుల పట్ల సంస్థ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని ఆదేశించారు. సీఎం చంద్రబాబు స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించిన తర్వాత మహిళలకు జీరో టికెట్ల జారీ కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా ఏవిధమైన ఫిర్యాదులు రాకూడదని స్పష్టం చేశారు. సిబ్బందితో సమావేశాలు నిర్వహించి, జాగ్రత్తగా విధులు నిర్వహించేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్యారేజీ సిబ్బంది, ట్రాఫిక్ సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ఏ ఆటంకం లేకుండా చూడాలన్నారు. ఈ పథకం వలన ప్రభుత్వానికి, ఆర్టీసీకి మంచి పేరు వచ్చేలా అందరూ కృషి చేయాలని కోరారు.

ఆదాయార్జనపై మరింత శ్రద్ధ

- అధికారులకు చంద్రబాబు నిర్దేశం

అమరావతి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఆదాయార్జనపై మరింత శ్రద్ధ వహించాలని, కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పన్నుల్లో వాటాపై దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు సమగ్ర ప్రణాళికలు చేయడంతో పాటు సాంకేతిక వినియోగంపై దృష్టి సారించాలని సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ఆదాయం 8 శాతం మేర పెరిగే అవకాశం ఉందన్న అంచనాలపై గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఏపీ పన్ను సమాచార వ్యవస్థ ద్వారా పన్ను వసూళ్లు పర్యవేక్షించాలని, సేవల రంగం ద్వారా ఎక్కువ పన్ను ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని సీఎం స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వానికి మద్యం ఆదాయం కంటే ప్రజారోగ్యమే ముఖ్యమని అన్నారు. ఆర్థిక లావాదేవీలకు అనుగుణంగానే భూ రిజిస్ట్రేషన్ విలువలు ఉండాలన్నారు. పన్ను ఎగవేతలను గుర్తించడానికి ఏఐని వినియోగించాలని ఆదేశించారు. భూమి వివరాలను జీఐఎస్ ద్వారా ల్యాండ్ మ్యాపింగ్ చేయాలని, ఈ రిజిస్ట్రేషన్లు, బౌండరీలను జీఐఎస్ సాయంతో మ్యాప్ చేయాలని సూచించారు. ఆర్టీజీఎస్ ద్వారా వచ్చే వివరాలతో పాటు టెక్నాలజీ ఆధారంగా రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో ఆటోమ్యుటేషన్ జరగాలన్నారు. మున్సిపల్ రికార్డుల్లో తప్పులు సవరించి జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు.

ప్రతి నీటి బొట్టునూ సంరక్షించాలి

నీటి వనరులతో భూగర్భ జలాలు పెరుగుతాయి

జల సంరక్షణలో సాగునీటి సంఘాలకు భాగస్వామ్యం: చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి నీటి బొట్టునూ సంరక్షించాలని, నీటి వనరుల సంరక్షణతోనే భూగర్భ జల మట్టాలు పెరుగుతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. నీటి సంరక్షణలో సాగునీటి సంఘాల భాగస్వామ్యం ఉండాలని స్పష్టం చేశారు. సాగునీటి శాఖలో ఇంజనీరింగ్ వ్యవస్థను పటిష్ఠపరుస్తామని ప్రకటించారు. నీటిని ఒడిసి పట్టి ప్రాజెక్టులు నింపాలని అధికారులను ఆదేశించారు. వెలగపూడి సచివాలయం నుంచి సాగునీటి సంఘాలు, జిల్లా కలెక్టర్లు, అధికారులతో సీఎం చంద్రబాబు గురువారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. పాలకొల్లు నుంచి మంత్రి నిమ్మల రామానాయుడు వర్చువల్‌గా పాల్గొన్నారు. సమర్థ నీటి నిర్వహణతో రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో నీటిని నిల్వ చేసుకోగలిగామని సీఎం పేర్కొన్నారు. ఈ సందర్భంగా జల వనరుల శాఖను అభినందించారు. రిజర్వాయర్లు, బ్యారేజీల్లో మొత్తంగా 82.29 శాతం మేర నింపుకోగలిగామని సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై వెలుగోడు, ఉత్తరాంధ్ర, గాలేరు నగరి సుజల స్రవంతి ప్రాజెక్టులపై దృష్టి సారించి పూర్తి చేయాలని జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్‌ను ఆదేశించారు. సాగునీటి కాలువలను సంరక్షించుకోవాలని సూచించారు. ఇందుకోసమే సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్యపై దృష్టి సారించామని సీఎం వెల్లడించారు.

చిన్న తరహా చెరువుల ద్వారా నీటి నిల్వ

ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నా.. రాష్ట్రంలో 17శాతం వర్షపాతం లోటు ఉందని చంద్రబాబు చెప్పారు. ఈ పరిస్థితుల్లో నీటిని సంరక్షించుకోవడంపై దృష్టి సారించాలన్నారు. మొత్తంగా 38 చిన్నతరహా చెరువుల ద్వారా భారీగా నీటి నిల్వలను పెంచుకోవచ్చని సీఎం చెప్పారు. నీటి నిర్వహణపై జిల్లాల వారీగా రేటింగ్ ఇస్తామని ప్రకటించారు. సాగునీటి యాజమాన్య సంఘాలకు ఆయకట్టు ప్రాంతాలే కాకుండా క్యాచ్‌మెంట్ ఏరియాల్లోనూ బాధ్యతలు అప్పగిస్తామన్నారు. రానున్న 16 రోజుల్లోగా చెరువులు, కాలువలు, చెక్‌డ్యామ్‌ల మరమ్మతులు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. భూగర్భజలాల పెంపుతో అద్భుత ఫలితాలు వస్తాయని, భూగర్భాన్నే ఒక జలాశయంగా మార్చుకోవాలన్నారు. రాష్ట్రంలో 40 లక్షల ఎకరాల్లో బోరుబావుల మీద ఆధారపడి పంటలు పండిస్తున్నారని అన్నారు. వర్షాకాలం తర్వాత కూడా 8 మీటర్లకు తగ్గకుండా భూగర్భజలాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యుత్‌లో ఏఐ!

- స్వల్పకాలిక విద్యుత్ కొనుగోళ్ల వ్యయం తగ్గించాలి
- ఇంధన రంగంపై సమీక్షలో సీఎం చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగంలో కృత్రిమ మేథ (ఏఐ)ను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంధనశాఖ అధికారులను ఆదేశించారు. తద్వారా నాణ్యమైన విద్యుత్ సరఫరా, ఉత్పత్తి, కొనుగోళ్లకు అవకాశం ఉంటుందని చెప్పారు. స్వల్పకాలిక, దీర్ఘకాలిక విద్యుత్ డిమాండ్ ఎలా ఉంటుందో ముందే గుర్తించేందుకు ఏఐ బాగా ఉపయోగపడుతుందని అన్నారు. ఇంధన రంగంపై వరుసగా రెండోరోజు కూడా ఆయన సమీక్ష నిర్వహించారు. గురువారం జరిగిన ఈ సమీక్షలో సీఎం మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యుత్‌ను తక్కువ వ్యయంతో సరఫరా చేయాలన్న లక్ష్యంతో ఎనర్జీ పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈపీఎంఎస్)ను అమలు చేయాలన్నారు. దీన్ని విద్యుత్ కొనుగోళ్లకూ వినియోగించాలన్నారు. దీనివల్ల డిస్కమ్‌లకు గణనీయంగా ఆదా అవుతుందని, వినియోగదారులపై చార్జీల భారం కూడా తగ్గుతుందని తెలిపారు. రాష్ట్రంలో వేర్వేరు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా విద్యుదుత్పత్తి, పంపిణీ ప్రణాళికలు తయారు చేయాలని కోరారు. గతేడాది విద్యుత్తు కొనుగోళ్లు, వచ్చే ఏడాది అంచనాలను విశ్లేషించి తదనుగుణంగా మార్కెట్లో విద్యుత్‌ను సమీకరించాలని సూచించారు.


పంప్డ్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీపై ప్రత్యేక దృష్టి

భవిష్యత్తులో గ్రీన్‌ఎనర్జీ అత్యంత కీలకంగా మారుతుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ జల విద్యుదుత్పత్తి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. మిగులు విద్యుత్‌ను నిల్వ చేయడానికి బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్‌ను వినియోగించుకోవాలన్నారు. మార్కెట్‌లో కొనుగోళ్లకు బదులు.. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్‌కు ఎంత ఖర్చవుతుందో అధ్యయనం చేయాలన్నారు. ఆర్‌డీఎస్ఎస్ ద్వారా రూ.705 కోట్ల మిగులు సాధించామని అధికారులు ఈ సందర్భంగా చెప్పారు. డ్రోన్ ఆధారిత డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ మానిటరింగ్, పవన విద్యుత్ ప్రాజెక్టుల అవకాశాలను పరిశీలించాలన్నారు. విద్యుత్‌సంస్థల యాజమాన్య నిర్వహణ కోసం జూనియర్ లైన్‌మెన్ (జేఎల్ఎం), అసిస్టెంట్ ఇంజనీర్‌పోస్టులను అవసరమైన మేరకు భర్తీచేసుకోవాలని ఇంధనశాఖకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

'సోలార్'లో నారావారి పల్లెకు స్కోచ్ అవార్డు

సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటులో నారా వారి పల్లెకు స్కోచ్ అవార్డు దక్కింది. ఈ అవార్డు దక్కినట్లు వచ్చిన లేఖలను ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు ఈ సమీక్షలో చంద్రబాబుకు చూపించారు. అదేవిధంగా సోలార్ కార్పొరేషన్, నెడ్‌క్యాప్‌లకు దక్కిన 11 స్కోచ్ అవార్డుల గురించి కూడా ఆ సంస్థల ఎండీ ఎం కమలాకరబాబు ఈ సందర్భంగా సీఎంకు తెలిపారు. ఈ అవార్డులను వచ్చేనెల 20న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో కేంద్రం అందించనుందని అధికారులు తెలిపారు. ఈ సమీక్షలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, సీఎండీలు సంతోషరావు, పృథ్వీతేజ్, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మా వివేకా సార్‌కు న్యాయం చేయండి'



స్లిప్పుపై రాసి బ్యాలెట్‌ బాక్సులో వేసిన ఓటరు

30 ఏళ్ల తర్వాత ఓటు వేశామంటూ.. మరో స్లిప్పు

పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కొందరు ఓటర్లు స్లిప్పులు రాసి తమ ఓటుతోపాటు బ్యాలెట్‌ బాక్సులో వేశారు. ఇలాంటి ఓ స్లిప్పుపై 'మా వివేకా సార్‌కు న్యాయం చేయండి సార్‌' అని రాసి ఉండటం కౌంటింగ్‌ సందర్భంగా సిబ్బంది గుర్తించారు. 2019లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు మాజీ మంత్రి వైఎస్‌ వివేకానందరెడ్డి హత్యకు గురైన విషయం తెలిసిందే. ఇక..ఈ తరహాలోనే మరో రెండు కాగితాలను పోలింగ్‌ సిబ్బంది గుర్తించారు. '30సం.తర్వాత ఓటు వేశాను..అందరికి దండాలు' అని ఒక దానిపైనా, 'పోలీసన్న ధన్యవాదాలు.మీవల్లే ఓటు వేశానన్న. మా యబ్బ కూడా 30 ఏళ్లలో ఓటేయలేదన్న' అని మరోదానిపై రాసి ఉంది. ఈ స్లిప్పులు సోషల్‌ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

- పులివెందుల, ఆంధ్రజ్యోతి



పులివెందుల జడ్పీటీసీగా గెలుపొందిన మారెడ్డి లతారెడ్డికి కేక్‌ తినిపిస్తున్న మంత్రి సవిత, చిత్రంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, బీటెక్‌ రవి, శ్రీనివాసరెడ్డి తదితరులు



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ఒంటిమిట్టలో గెలిచిన ముద్దుకృష్ణారెడ్డి

వచ్చే ఎన్నికల్లో పులివెందుల టీడీపీదే

- వైసీపీని బాయ్‌కాట్‌ చేసిన ఓటర్లు: మంత్రి సవిత

కడప మారుతీనగర్‌, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పులివెందులలో టీడీపీ జెండా రెపరెపలాడిస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత ధీమా వ్యక్తం చేశారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ విజయబావుటా ఎగురవేయడాన్ని ప్రజాస్వామ్య విజయంగా భావిస్తున్నామన్నారు. గురువారం కడపలో పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్‌ రవి, జిల్లా అధ్యక్షుడు ఆర్‌.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు పుత్తా కృష్ణచైతన్య రెడ్డి, ఆదినారాయణరెడ్డి, జడ్పీటీసీ లతారెడ్డితో కలిసి మంత్రి కేక్‌ కట్‌ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ పులివెందుల ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని, రానున్న రోజుల్లో మరింత తీవ్ర రూపం దాల్చి వైసీపీ కంచుకోట బద్దలవడం ఖాయమని చెప్పారు. బీటెక్‌ రవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్‌ హామీలను ప్రజలు విశ్వసించి అఖండ విజయం చేకూర్చారన్నారు. జగన్‌ని ఓటర్లు తిట్టిన మాటలు తాను బహిర్గతం చేస్తే ఆయన ఆత్మహత్య చేసుకుంటారన్నారు.

ప్రజాస్వామ్యంపై జగన్‌ మాట్లాడటమా?: అచ్చెన్న

శ్రీకాకుళం, సంతబొమ్మాళి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన జగన్‌కు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు అని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళిలో గురువారం ఆయన మాట్లాడుతూ త్వరలో వైసీపీ జెండాను పీకేసే పరిస్థితి ఉందన్నారు.

పిచ్చెక్కినట్టు మాట్లాడుతున్నారు: అయ్యన్న

అమరావతి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జగన్‌ పిచ్చెక్కినట్లు... నోటికొచ్చింది మాట్లాడుతున్నారని, జగన్‌ వ్యాఖ్యలను ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని స్పీకర్‌ అయ్యన్నపాత్రుడు అన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో గురువారం అయ్యన్న విలేకరులతో మాట్లాడారు. పులివెందులలో ఓడిపోవడంతో ఆయన పిచ్చి పట్టినట్లు మాట్లాడుతున్నారని, జగన్‌ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతుంటే వినటానికే చాలా అసహ్యంగా ఉందన్నారు.

జగన్‌ వ్యాఖ్యలు దురదృష్టకరం: రఘురామ

ఉండి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు వయస్సు, పరిపాలనపై జగన్‌ చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమని డిప్యూటీ స్పీకర్‌ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా యండగండిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల ఫలితాలు చూసిన జగన్‌కు మతిభ్రమించిందని చెప్పారు.

2029లో టీడీపీ విజయానికి తొలి మెట్టు: కొలుసు

అమరావతి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల ఫలితం.. 2029లో జరిగే ఎన్నికల్లో టీడీపీ విజయానికి తొలి మెట్టు అని మంత్రి కొలుసు పార్థసారథి వ్యాఖ్యానించారు. గురువారం అమరావతి సచివాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ 'ఓటమిని గౌరవంగా అంగీకరించకుండా.. ముసలోడివి, నీకివే చివరి ఎన్నికలు అంటూ చంద్రబాబును జగన్‌ దిగజారి మాట్లాడటం జుగుప్సాకరం' అని అన్నారు.

ఒకరోజు ముందే స్వాతంత్ర్యం వచ్చింది: బాలకృష్ణ

హిందూపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): 'పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచింది. ఆ ప్రజలకు ఒకరోజు ముందుగానే స్వాతంత్ర్యం వచ్చింది. అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు వేశారు. ఓటర్లు ధైర్యంగా ఓటు వేశారు' అని సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. హిందూపురం నియోజకవర్గంలో గురువారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించి విలేకరులతో మాట్లాడారు.

రౌడీ రాజకీయాలకు చరమగీతం: డోలా

టంగుటూరు (కొండపి), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల ఫలితాలతో అక్కడి ప్రజలు రౌడీ రాజకీయాలకు చరమగీతం పాడారని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. గురువారం ప్రకాశం జిల్లా తూర్పునాయుడుపాలెంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో ఓడిపోయినా ప్రజల గొంతులు కోస్తామంటూ కార్యకర్తల్ని జగన్‌ రెచ్చగొట్టడం సహించరానిదన్నారు.

ప్రజా విశ్వాసం కోల్పోయిన జగన్‌: గొట్టిపాటి

పంగులూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సొంత నియోజకవర్గం పులివెందులలో కూడా మాజీ సీఎం జగన్‌ ప్రజావిశ్వాసం కోల్పోయారని మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ అన్నారు. బాపట్ల జిల్లా పంగులూరు మండలం ముప్పవరంలో ఆయన మాట్లాడుతూ, ప్రతిపక్షంలో ఉన్నపుడు టీడీపీ శాసనసభ లోపల, బయటా ప్రజాసమస్యలపై గళమెత్తి పోరాడటం ద్వారానే మళ్లీ అధికారంలోకి వచ్చిందన్నారు.

పులివెందుల ప్రజలు సంకెళ్లు తెంచుకున్నారు: బుద్దా

విజయవాడ వన్‌టౌన్‌, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): 'పులివెందుల ప్రజలు సంకెళ్లు తెంచుకుని ప్రజాస్వామ్య పాలనకు నాంది పలికారు. ఒకరోజు ముందే స్వాతంత్ర్య వేడుకలను జరుపుకున్నారు' అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న వ్యాఖ్యానించారు.

పులివెందుల పులి.. పిల్లి అయ్యింది: సునీత

ధర్మవరం/రామగిరి, (ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల ఫలితాలతో అక్కడ పులి అని చెప్పుకునే జగన్‌ రెడ్డి పిల్లిలా మారారనిఎమ్మెల్యే పరిటాల సునీత ఎద్దేవా చేశారు. రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరిలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరిగితే ఫలితాలు ఎలా ఉంటాయో పులివెందుల ప్రజలు చూపించారని అన్నారు.

అది పోలింగ్‌కాదు... రిగ్గింగ్‌: బొత్స

విశాఖపట్నం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): 'కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో జరిగింది పోలింగ్‌ కాదు.. రిగ్గింగ్‌' అని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. విశాఖలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆగస్టు 12 ప్రజాస్వామ్యంలో బ్లాక్‌డేగా గుర్తుండి పోతుందని, సీఎం చంద్రబాబు చరిత్రలో దోషిగా నిలిచి పోతారని విమర్శించారు. ఆయన ఇంతగా దిగజారిపోతారనుకోలేదని, డీఐజీ కోయ ప్రవీణ్‌ తీరు పోలీస్‌ వ్యవస్థకే మచ్చగా మారిందన్నారు.

కూలిన జగన్‌ సామ్రాజ్యం

- 30 ఏళ్లుగా వైఎస్‌ ఫ్యామిలీ అడ్డా
- నిన్నటిదాకా పులివెందుల వన్‌సైడే
- జడ్పీటీసీ ఉప ఎన్నికలతో సీన్‌ రివర్స్‌
- జగన్‌ స్వయంకృతాలతో బలపడ్డ టీడీపీ

(కడప - ఆంధ్రజ్యోతి)

పులివెందుల! నిన్నటి వరకు వైఎస్‌ జగన్‌ సామ్రాజ్యం ఇది. ఆయన తండ్రి వైఎస్‌ రాజశేఖర రెడ్డి 1978లో రాజకీయాల్లోకి వచ్చారు. అప్పటి నుంచి రాజశేఖర్‌రెడ్డి, జగన్‌ తాత రాజారెడ్డి సామ్రాజ్యంగా పులివెందుల పేరు పడింది. ఎవరిని వైఎస్‌ కుటుంబం పోటీలో నిలిపితే వారే విజేత. నిన్నటి దాకా కూడా అక్కడ అక్కడ వార్‌ ఎప్పుడూ వన్‌ సైడే. అయితే ఇప్పుడు సీన్‌ రివర్స్‌ అయింది. ప్రజాస్వామ్యం మరిచి అరాచకంగా రాజ్యం చేసే సంస్కృతికి తాజా పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికలు స్వస్తి పలికాయి. అందువల్లే విజయం ఇప్పుడు టీడీపీ సైడ్‌ అయిందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. నిజానికి, పులివెందుల ఉప ఎన్నిక అనేక కారణాల వల్ల జగన్‌ పార్టీకి చావు.. గెలుపు.. సమస్యగా మారింది. ఇక్కడ ఓడితే పార్టీ క్యాడర్‌కు ప్రతికూల సంకేతాలు వెళతాయని జగన్‌ అండ్‌ కో తీవ్రంగా మథనపడింది. జగన్‌ సూచనల మేరకు కడప ఎంపీ వైఎస్‌ అవినాశ్‌రెడ్డి ప్రచార బాధ్యతలు తీసుకున్నారు. ఓటుకు రూ.5వేల చొప్పున నీళ్ల ప్రాయంగా డబ్బులు ఖర్చు పెట్టారు. దీంతో కడప జిల్లాలో రెండు జడ్పీటీసీ స్థానాలకూ అసెంబ్లీ ఎన్నికలను తలపించేలా పోలింగ్‌ జరిగింది. జగన్‌ సొంత జిల్లా కావడం, అందులోనూ పులివెందులలో ఎన్నిక జరుగుతుండడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఎన్నికలపై ఆసక్తి పెరిగింది. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, వైసీపీ అధినేత జగన్‌ ఈ ఎన్నికలను చాలెంజ్‌గా తీసుకున్నారు. పులివెందుల జడ్పీటీసీ పరిధిలో మొత్తం 10,601 ఓట్లు ఉన్నాయి. రాగిమానుపల్లె, అచ్చవెల్లి, ఎర్రవెల్లి, ఈ.కొత్తపల్లె, కనంపల్లె పంచాయతీలున్నాయి. ఈ పంచాయతీలలో వైఎస్‌ కుటుంబానికి గట్టి అభిమానులున్నారు. వారంతా వైఎస్‌ కుటుంబం చెప్పిన మాటను జవదాటరు. గతంలో జరిగిన ఎన్నికలన్నీ ఇక్కడ ఏకపక్షమే. ఓటు ముఖం చూడని జనం చాలామంది ఉన్నారు. ఆ పార్టీదే గెలుపు అని అందరూ అనుకున్నారు. పోలింగ్‌కు కొన్నిరోజుల ముందు వరకూఇదేసీన్‌. అయితే, అక్కడినుంచి పరిస్థితి అనూహ్యంగా టీడీపీకి అనుకూలంగా మారడం మొదలైంది.

క్యాడర్‌తో తెగిన బంధం..

బీటెక్‌ రవి వైసీపీ నుంచి కీలక నేతలను టీడీపీలోకి తీసుకోవడంతో పోలింగ్‌ నాటికి టీడీపీ బాగా బలపడింది. కనీస పోటీకి సిద్ధమైన స్థితి నుంచి ఢీకొట్టేంత బలంగా టీడీపీ తయారయింది. అయితే, ఇందుకు టీడీపీ అనుసరించిన వ్యూహం కంటే కూడా జగన్‌ స్వయంకృతాలే ఆ పార్టీకి ఈ ఎన్నికల్లో కలిసి వచ్చాయి. ఉదాహరణకు పులివెందుల మండలంలోని నల్లగొండుగారిపల్లె, ఆర్‌.తుమ్మలపల్లె, కనంపల్లె, ఎర్రిబల్లె, ఎర్రబల్లె, ఈ.కొత్తపల్లె వైసీపీకి కంచుకోటలు. ఇక్కడ ఈ.కొత్తపల్లెలో మాత్రమే టీడీపీకి కాస్త బలం ఉంది. రాగమానుపల్లె పంచాయతీలో 1243, అచ్చవెల్లి 991, ఎర్రిపల్లె 636, ఎర్రబల్లె 3901, యు.కొత్తపల్లె 2561, కనంపల్లె పంచాయతీలో 602ఓట్లు ఉన్నాయి. మొత్తం 10,601 ఓట్లకు గాను 7,794 ఓట్లు పోల్‌ అయ్యాయి. ఈ ఎన్నికల్లో టీడీపీ రిగ్గింగ్‌ చేసుకుందని వైసీపీ ఆరోపిస్తోంది. వాస్తవంగా టీడీపీ దౌర్జన్యం చేసినా కూడా ఈ పల్లెలన్నీ వైఎస్‌ కుటుంబం మాట దాటని పల్లెలు. ఒకవేళ టీడీపీ దౌర్జన్యం చేసినా కూడా ఆ జనమంతా రివర్స్‌ అయితే చేయగలిగింది ఏమీ ఉండదు. నిజానికి, అసలు పోలింగ్‌ రోజున వైసీపీ క్యాడరే బయట కనిపించలేదు. ఓటర్లు వచ్చి ఓటు వేసుకుని పోయారు. పోలింగ్‌ సరళిని బట్టి చూస్తే జగన్‌ పార్టీపై క్యాడరులో, ఓటర్లలో తీవ్రమైన అసంతృప్తి ఉన్నట్లు అర్థమవుతుంది. రాజశేఖరరెడ్డి, వివేకానందరెడ్డి క్యాడర్‌తో బాగా మమేకమయ్యేవారు. నమ్ముకున్న వారికి న్యాయం చేస్తారనే పేరు రాజశేఖరరెడ్డి ఉంది. వైఎస్‌పై అభిమానంతోనే కాంగ్రెస్‌ క్యాడర్‌ అంతా ఆయన మరణానంతరం జగన్‌ వెంట నడిచారు. వారంతా వైసీపీలో ఉన్నారు. జగన్‌ సీఎం అయిన తరువాత క్యాడర్‌తో పూర్తిగా సంబంధాలు తెగిపోయాయని చెబుతున్నారు.

జగన్‌కు, వైఎస్‌కు తేడా..

రాజశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు, నమ్మిన వారికి బాగా ప్రాధాన్యం ఇచ్చేవారు. జగన్‌ ఇందుకు పూర్తి విరుద్ధమని చెబుతారు. వివేకానందరెడ్డి హత్య కేసులో అవినాశ్‌రెడ్డి ప్రమేయంపై సీబీఐ చార్జిషీట్‌ దాఖలు చేసింది. అయితే అవినాశ్‌రెడ్డిని జగన్‌ పూర్తిగా వెనుకేసుకు వచ్చారు. దీన్ని వైఎస్‌ అభిమానులు జీర్ణించుకోలేక పోయారు. అలాగే సొంత చెల్లెలు షర్మిల, తల్లి విజయమ్మను కూడా జగన్‌ దూరం చేసుకున్నారు. అధికారంలో ఉన్నపుడు జగన్‌ కేవలం తాడేపల్లికి మాత్రమే పరిమితమయ్యారు. క్రిస్మస్‌ సందర్భంగా పులివెందుల చర్చికి వచ్చి ప్రార్థనలు చేయడం, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసి క్యాడర్‌ను కలవకుండా వెళ్లిపోయేవారు. పులివెందుల అంతా ఎంపీ అవినాశ్‌రెడ్డికి అప్పజెప్పారు. అయితే వైఎస్‌, వివేకానందరెడ్డితో రాజకీయం చేసిన క్యాడర్‌, నేతలు.. వారిద్దరిలో ఉన్న కమిట్‌మెంటు జగన్‌, అవినాశ్‌లో లేదని గుర్తించారు. క్యాడర్‌లో పూర్తి అసంతృప్తి ఉన్నది.

'తుమ్మలపల్లి'లో జరిగింది ఇదీ..

వైసీపీ నుంచి పోటీ చేసిన హేమంత్‌రెడ్డి స్వగ్రామం తుమ్మలపల్లె. ఆయనను టీడీపీ నేతలు బయటికి రానీయకుండా అడ్డుకున్నారంటూ జగన్‌ మీడియా బ్రేకింగ్‌ న్యూస్‌ ఇచ్చింది. దీంతో స్పందించిన ఎన్నికల అధికారి, కలెక్టర్‌ డాక్టర్‌ చెరుకూరి శ్రీధర్‌ ఒక సీఐ, 8 మందితో కూడిన పోలీసు బృందాన్ని తుమ్మలపల్లెలోని హేమంత్‌రెడ్డి ఇంటికి పంపించారు. ఆయన పోటీలో ఉండడంతో మండల వ్యాప్తంగా బూత్‌లలో స్వేచ్ఛగా తిరిగేందుకు సెక్యూరిటీని పంపించారు. అయితే గంటన్నరపాటు పోలీసు సిబ్బంది వెయిట్‌ చేసినా బయటికి రాలేదు. చివరికి అభ్యర్థి తల్లి బయటికి వచ్చి మా అబ్బాయి బయటికి రాడు అని పోలీసులకు తెలిపారు. అయినా పోలీసులు అక్కడే ఉన్నారు. 11 గంటలకు హేమంత్‌రెడ్డి బయటికి వచ్చి నేను ఇప్పుడు బయటికిరాను, అవసరం ఐతే ఫోను చేస్తానని ఇంట్లోకి వెళ్లిపోయారు. కనీసం ఆయన కూడా ఓటు వేసుకోలేదంటే ఇంకఅర్థం చేసుకోవచ్చు!

నాడు ఉమేశ్‌చంద్ర.. నేడు కోయ ప్రవీణ్‌

1990 దశకంలో కడప జిల్లాలో ఫ్యాక్షన్‌ రాజ్యమేలుతుండేది. అప్పట్లో ఏ ఎన్నికలు జరిగినా హింసాత్మకమే. అలాంటి సమయంలో 1996లో కడప పార్లమెంటుకు ఉప ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్‌ నుంచి రాజశేఖర్‌రెడ్డి, టీడీపీ నుంచి రాజగోపాల్‌రెడ్డి పోటీ చేశారు. ఆ ఎన్నికలను అప్పటి ఎస్పీ ఉమేశ్‌చంద్ర ప్రశాంతంగా నిర్వహించారు. అయితే మళ్లీ ఇప్పుడు డీఐజీ కోయ ప్రవీణ్‌ పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించారు.

ప్రజాస్వామ్యం గెలిచింది: అనిత

విజయనగరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): 'పులివెందుల, ఒంటిమిట్టలో ప్రజాస్వామ్యం గెలిచింది. రాజారెడ్డి రాజ్యాంగం ఓడింది' అని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. గురువారం ఆమె విజయనగరంలో విలేకరులతో మాట్లాడుతూ 30 ఏళ్లల్లో కడపలో ఎక్కడా స్వచ్ఛందంగా ఓటేసే పరిస్థితి లేదన్నారు. మరోమంత్రి కొండపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ పులివెందుల, ఒంటిమిట్ట ఓటర్లు ప్రజాస్వామ్యాన్ని చూశారన్నారు.

జగన్‌ కోటపై టీడీపీ జెండా

(మొదటి పేజీ తరువాయి)

తుమ్మల హేమంత్‌రెడ్డికి 683 ఓట్లు వచ్చాయి. 145 ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి. నోటాకు 11 ఓట్లు పడ్డాయి. స్వతంత్ర అభ్యర్థులు మొయిళ్ల శివకల్యాణ్‌రెడ్డికి 101, సురేశ్‌కుమార్‌రెడ్డికి 4, తుమ్మలూరు అనిల్‌కుమార్‌రెడ్డికి 1, భూమిరెడ్డి రవీంద్రరెడ్డికి 14, గజేంద్రనాథరెడ్డికి 79, భరత్‌రెడ్డికి 35, వెంగల్‌రెడ్డికి 3, సునీల్‌యాదవ్‌కు 2 ఓట్లు వచ్చాయి. శివారెడ్డి అనే అభ్యర్థికి ఒక్క ఓటు కూడా రాలేదు.

ఒంటిమిట్టలో అదే దూకుడు

ఒంటిమిట్టలో టీడీపీ విజయ దుందుభి మోగించింది. టీడీపీ అభ్యర్థి అద్దలూరు ముద్దుకృష్ణారెడ్డి... వైసీపీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిపై 6,267 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఇక్కడ మొత్తం 20,467 ఓట్లకు గాను 19,836 ఓట్లు చెల్లాయి. 602 ఓట్లు చెల్లలేదు. 29 ఓట్లు నోటాకు పడ్డాయి. పోల్‌ అయిన ఓట్లలో టీడీపీకి 12,780 రాగా వైసీపీకి 6,513 వచ్చాయి. ఇండిపెండెంట్‌ అభ్యర్థులు చంద్రకాంత్‌కు 23, వెంకటరమణకు 18, మల్లికార్జునరెడ్డికి 2, శివారెడ్డికి 148, సుధాకర్‌కు 16, మధుమూర్తికి 179, ఈశ్వరయ్యకు 2, వెంకటేశ్‌కు తొమ్మిది ఓట్లు పోల్‌ అయ్యాయి. పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికలను టీడీపీ గెలుచుకోవడంతో ఆ పార్టీలో మంచి జోష్‌ నెలకొంది. కడప, పులివెందుల, ఒంటిమిట్ట, రాజంపేటలలో సంబరాలు చేసుకున్నారు.

గ్రేట్‌.. వుయ్‌ ఆర్‌ సో హ్యాపీ..

లతారెడ్డికి ఫోన్‌లో భువనేశ్వరి అభినందనలు

పులివెందుల జడ్పీటీసీ సభ్యురాలిగా పోటీచేసి అత్యధిక మెజారిటీతో గెలుపొందిన మారెడ్డి లతారెడ్డికి ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఫోన్‌ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

భువనేశ్వరి: గ్రేట్‌.. వుయ్‌ ఆర్‌ సో హ్యాపీ.

లతారెడ్డి: థ్యాంక్స్‌ అమ్మా... ఈ విజయానికి కారణం మీరు కూడా..

భువనేశ్వరి: ప్రతి ఒక్కరూ. పులివెందుల అంటేనే జోష్‌. చాలా హ్యాపీగా ఉంది.

లతారెడ్డి: మీరు ఫోన్‌ చేసినందుకు చాలా చాలా సంతోషంగా ఉంది.

భువనేశ్వరి: అందరం ఒకే ఫ్యామిలీ. అది టీడీపీ.

లతారెడ్డి: మీ అందరి సహకారంతో గెలుపొందాను. థ్యాంక్స్‌.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు

- గతంలో దాడులు.. దౌర్జన్యాలతో ఏకగ్రీవాలు
- ఇప్పుడు స్పష్టమైన తీర్పు : డిప్యూటీ సీఎం పవన్‌



అమరావతి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కూటమి బలపరచిన తెలుగుదేశం అభ్యర్థులు సాధించిన విజయం ఎంతో సంతోషాన్ని ఇస్తుందని డిప్యూటీ సీఎం పవన్‌ కల్యాణ్‌ అన్నారు. విజయం సాధించిన లతారెడ్డి, ముద్దుకృష్ణా రెడ్డిలకు అభినందనలు తెలిపారు. 'గత స్థానిక సంస్థల ఎన్నికల్లో కనీసం నామినేషన్‌ కూడా వేయనీయలేదు. నామినేషన్‌ వేయాలనుకున్నవారిపై దాడులు చేసి బెదిరింపులకు పాల్పడ్డారు. ఇప్పటి వరకూ ఏకగ్రీవం పేరుతో ఎవరూ పోటీలో లేకుండా చేసుకొంటూ వచ్చారు. ఇప్పుడు ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికల్లో పోటీకి ఆస్కారం కలిగింది. మూడు దశాబ్దాల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు నచ్చిన వారికి ఓటు వేసుకోగలిగామని పులివెందుల ఓటర్లు చెప్పారంటే అక్కడ ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో రాష్ట్రమంతా అర్థం చేసుకొంటోంది. ఎన్నికలు నిష్పాక్షికంగా నిర్వహించడం వల్ల ప్రజాతీర్పు స్పష్టంగా వెలువడింది.' అని పవన్‌ పేర్కొన్నారు.

అభివృద్ధికి ఓటేశారు: లోకేశ్‌

- వారికి ఒక రోజు ముందే స్వాతంత్ర్యం: పల్లా శ్రీనివాస్‌
- ఈ ఫలితాలు జగన్‌కు కనువిప్పు కలిగించాలి: నారాయణ



అమరావతి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట ప్రజలు వెనుకబాటుతనానికి వీడ్కోలు చెప్పి, అభివృద్ధికి ఆహ్వానం పలికారని మంత్రి నారా లోకేశ్‌ అన్నారు. పులివెందులలో తొలిసారి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరిగాయని, ప్రజలకు స్వేచ్ఛగా ఓటు వేసే అవకాశం లభించిందన్నారు. ఎన్నికల్లో గెలుపొందిన లతారెడ్డి, కృష్ణా రెడ్డికి లోకేశ్‌ అభినందనలు తెలిపారు. పులివెందుల ప్రజలకు ఒక రోజు ముందుగానే స్వాతంత్ర్యం వచ్చిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. మూడు దశాబ్దాల తర్వాత ఓటు వేశామని ఓటర్లు బ్యాలెట్‌ బాక్సుల్లో తమ అభిప్రాయాలను పంచుకున్నారంటే అక్కడ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ ఫలితాలు జగన్‌కు కనువిప్పు కలిగించాలని మంత్రి నారాయణ వ్యాఖ్యానించారు. జగన్‌ తన తండ్రి వయస్సు ఉన్న చంద్రబాబుని ఏకవచనంతో మాట్లాడటం అత్యంత అభ్యంతరకరమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు.

వైసీపీ అభ్యర్థులకు హైకోర్టులో చుక్కెదురు

- పులివెందుల, ఒంటిమిట్టలో రీపోలింగ్‌కు వేసిన పిటిషన్లు కొట్టివేత
- ట్రైబ్యునల్‌లో వేసుకొనేందుకు వెసులుబాటు

పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో పలు పోలింగ్‌ కేంద్రాలలో అక్రమాలు చోటు చేసుకున్నాయని, కేంద్ర సాయుధ పోలీసు బలగాల భద్రతతో రీపోలింగ్‌ నిర్వహించేలా రాష్ట్ర ఎన్నికల సంఘానికి(ఎస్‌ఈసీ) ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ వైసీపీ అభ్యర్థులు వేసిన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. ట్రైబ్యునల్‌లో ఎన్నికల పిటిషన్లు దాఖలు చేసుకునేందుకు పిటిషనర్లకు స్వేచ్ఛనిచ్చింది. గురువారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ గన్నమనేని రామకృష్ణప్రసాద్‌ ఈ మేరకు తీర్పు ఇచ్చారు. ఈ నెల 12న జరిగిన పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉపఎన్నికల్లో అధికార పార్టీ నేతలు దౌర్జన్యాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ వైసీపీ జడ్పీటీసీ అభ్యర్థులు తుమ్మల హేమంత్‌రెడ్డి, ఎర్రగంరెడ్డి సుబ్బారెడ్డి హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషనర్ల తరఫున సీనియర్‌ న్యాయవాదులు పి.వీరారెడ్డి, ఎస్‌.శ్రీరామ్‌ వాదనలు వినిపించారు. ఉప ఎన్నికను రద్దు చేయాలని తాము కోరడం లేదని, అక్రమాలు జరిగిన పోలింగ్‌ కేంద్రాలలో రీపోలింగ్‌ నిర్వహించాలని మాత్రమే కోరుతున్నామని వివరించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం తరఫున వివేక్‌ చంద్రశేఖర్‌ వాదనలు వినిపిస్తూ.. వ్యాజ్యాలకు విచారణార్హత లేదన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తరువాత కోర్టు జోక్యం చేసుకోవడానికి వీల్లేదన్నారు. పులివెందుల జడ్పీటీసీ స్వతంత్ర అభ్యర్థి మారెడ్డి భరత్‌రెడ్డి, ఒంటిమిట్ట జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థి ఎం.కృష్ణారెడ్డి తరఫున సీనియర్‌ న్యాయవాది బి.ఆదినారాయణరావు వాదనలు వినిపించారు.

తిరుపతి అరాచకం మరిచారా?

- ఓ ఐఏఎస్‌ను బలి చేశారు కదా!
- 30ఏళ్లుగా 'ఓటు' తెలీని పులివెందుల
- వైఎస్‌ ఫ్యామిలీ నిలిపినవారే విజేతలు
- అన్యాయం.. అరాచకం అంటున్న జగన్‌కు ప్రజాస్వామ్యం అప్పుడు గుర్తుకు రాలేదా?
- ప్రశ్నిస్తున్న రాజకీయవర్గాలు, టీడీపీ శ్రేణులు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

వైఎస్‌ ఫ్యామిలీ అడ్డా పులివెందులలో స్వేచ్ఛగా ఓటువేయడం మూడు దశాబ్దాల్లో ఇదే తమకు మొదటిసారి అని ప్రజలు మీడియా ముందుకొచ్చి చెబుతున్నారు. అయితే, ఓటర్లను టీడీపీ నేతలు, పోలీసులు ఓటు వేసుకోనీయకుండా భయభ్రాంతులకు గురిచేశారంటూ వైసీపీ అధినేత జగన్‌, కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి అమాయకంగా ముఖంచెప్పి సెలవిస్తున్నారు. అక్కడ ఇంతకుముందేదో ప్రజాస్వామ్యం ఉన్నట్టు.. ఈ ఎన్నికల తర్వాత అది మంటగలిసిపోయినట్టు జగన్‌ సోదరులు అల్లుతున్న కథలు పులివెందుల చరిత్ర తెలిసినవారిని కూడా ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. అక్రమం.. అన్యాయం.. అంటూ రెండురోజులుగా గగ్గోలు పెడుతున్న వైసీపీ నేతల తీరుపై టీడీపీ శ్రేణులు, బ్యూరోక్రాట్లు ఆగ్రహిస్తున్నాయి. "తిరుపతి ఉప ఎన్నికల్లో సాగించిన అరాచకం మరిచారా.. ఓ ఐఏఎస్‌ను నాడు బలి చేశారు కదా.." అంటూ ప్రశ్నిస్తున్నారు. నిజానికి, పులివెందులలో గడచిన 30 ఏళ్లుగా స్థానిక ఎన్నికల్లో నడిచింది రాజారెడ్డి రాజ్యాంగమేనని స్పష్టం చేస్తున్నారు.

ఓటర్ల కన్నుల్లో స్వేచ్ఛా కాంతులు

స్థానిక ఎన్నికల్లో పోటీ చేయడం కోసం నామినేషన్లను పులివెందులలో వేయనిచ్చేవారు కాదు. దీంతో ఏనాడూ అక్కడ ఎన్నికలు జరగలేదు. గ్రామ సర్పంచ్‌ నుంచి ఎంపీటీసీ, జడ్పీటీసీ దాకా వైఎస్‌ కుటుంబం చెప్పినవారికే పదవులు దక్కుతూ వచ్చాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు ఉంటుందని .. దానిని ఉపయోగించుకోవాలన్న సంగతే పులివెందుల ఓటర్లు మరిచిపోయారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీలకు ఉప ఎన్నికల ప్రకటన వెలువడినప్పుడు అదే గత సంప్రదాయం నడిచిపోతుందని జగన్‌ బ్యాచ్‌, వైసీపీ నేతలు భావించారు. కానీ, ఈ నెల 12వ తేదీన జరిగిన పులివెందుల జడ్పీటీసీ ఎన్నికలు వారి అంచనాలను తలకిందులు చేశాయి. ఓటు స్వేచ్ఛను పొందిన అనుభూతితో పెద్ద ఎత్తున ఓటర్లు బయటకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇన్నాళ్లకు.. తమకు ఓటు వేసుకునే హక్కును కల్పించారంటూ సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు చెబుతూ బ్యాలెట్‌ బాక్సుల్లో స్లిప్పులను వేశారు. ఓటర్లలోని గూడుకట్టుకున్న ఆవేదనకు ఈ స్లిప్పులే నిదర్శనంగా నిలిచాయి. ఫలితంగా జగన్‌ పార్టీ అభ్యర్థికి పులివెందులలో డిపాజిట్లు కూడా దక్కలేదు.

బ్యాలెట్‌ బరిలోనూ చిత్తు..

సార్వత్రిక ఎన్నికల్లో కేవలం 11 స్థానాలకే పరిమితమైన జగన్‌.. ఎలక్ట్రానిక్‌ ఓటింగ్‌ మెషిన్లపై తప్పువేసి ప్రచారం చేశారు. మరి పులివెందుల , ఒంటిమిట్ట ఎన్నికలు బ్యాలెట్‌ విధానంలోనే జరిగాయి. కానీ, జగన్‌ బలపరచిన అభ్యర్థులు రెండు చోట్లా ఘోరంగా ఓడిపోవడం గమనార్హం. ఏకగ్రీవాలకు ప్రోత్సాహకాల పేరిట .. నాడు అధికారపక్షానికి చెందిన ఒకే నామినేషన్‌ పడేలా వ్యూహాన్ని అమలుచేశారు. తెలుగుదేశం, జనసేన, వామపక్షాల నుంచి ఎవరైన నామినేషన్‌ వేసేందుకు వెళితే, వారి పత్రాలను దౌర్జన్యంగా లాక్కొని చించేశారు. కుప్పం స్థానిక సంస్థల ఎన్నికల్లో జగన్‌ అరాచకం పరాకాష్ఠను అందుకుంది. భారీగా రిగ్గింగు .. దొంగ ఓట్లను వేశారు.

అవి బయట రాష్ట్రాల 'చిత్రాలు': పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో క్యూలైన్లలోకి మీడియాను రానివ్వలేదంటూ జగన్‌, అవినాశ్‌రెడ్డి, పేర్ని నాని ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా వారు కొన్ని ఫొటోలు, వీడియోలు విడుదల చేశారు. అవి అసలువో .. నకిలీవో తెలియడం లేదు. ఇటీవల ఎన్నికల సమయంలో అక్రమాలు జరిగాయంటూ మాజీ మంత్రి అంబటి రాంబాబు కొన్ని ఫోటోలు విడుదల చేశారు. కానీ అవి బయటి రాష్ట్రాలకు చెందినవిగా ఆ తర్వాత బయటపడింది.

ఐఏఎస్‌ బలి..

తిరుపతి లోక్‌సభకు 2021లో ఉప ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత గ్రాడ్యుయేట్‌ కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించారు. ఈ రెండు ఎన్నికల సందర్భంగా వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. వైసీపీ నేత భూమన పర్యవేక్షణలో దొంగ ఓట్లు గుద్దుకున్నారు. నకిలీ ఓటరు ఐడీలనే సృష్టించారు. తమిళనాడు నుంచి కూలీలను తెచ్చి ఓట్లు వేయించారు. గ్రాడ్యుయేట్‌ కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో చదువురానివారితో దొంగ ఓట్లు వేయించారు. ఈ క్రమంలో ఏకంగా మునిసిపల్‌ కమిషనర్‌ గిరీశా ఎలక్ట్రానిక్‌ సిగ్నేచర్‌ను వైసీపీ వాడేసింది. ఈసీ జరిపిన ప్రాథమిక విచారణలో ఆ విషయం ఆ తర్వాత బయటపడింది.గిరీశాపై వేటుపడింది.వైసీపీ నేతల నిర్వాకా నికి ఓఐఏఎస్‌ శిక్ష అనుభవించాల్సి వచ్చింది.





వాసు రూపొందించిన జాతీయ జెండా, రాఫెల్ జెట్ కళారూపాలు
హస్తకళాకారుడు గుత్తి వాసు(ఇన్‌సెట్)

అంకుడుకర్రతో జాతీయ పతాకం

» రాఫెల్ యుద్ధ విమానం కూడా.. ఏటికొప్పాక కళాకారుడి నైపుణ్యం

ఎలమంచిలి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా ఏటికొప్పాక గ్రామానికి చెందిన యువ హస్త కళాకారుడు గుత్తి వాసు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అంకుడు కర్ర, సహజ సిద్ధమైన రంగుల మేళవింపుతో రూపొందించిన కళారూపాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. బీఈడీ చేసిన వాసు గ్రామంలోని ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయునిగా చేస్తూ, మరోపక్క హస్తకళావృత్తిని కొనసాగిస్తున్నారు. ఆరు రోజులపాటు శ్రమించి అంకుడు కర్రతో 38 సెంటీమీటర్ల పొడవు, 23 సెంటీమీటర్ల వెడల్పు కలిగిన జాతీయ పతాకాన్ని, శాంతికి చిహ్నమైన రెండు పావురాలను తయారుచేశారు. పక్షం రోజుల క్రితం రెండు రాఫెల్ యుద్ధ విమానాలను, అగ్ని-5 ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని రూపొందించారు. వీటిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల సహకారంతో ప్రధాని నరేంద్రమోదీకి అందజేయాలనుకుంటున్నట్టు వాసు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ఎర్ర కోటపై ఎగిరిన తొలి జెండా వీళ్లదే!

» ఆ జాతీయ పతాకం తయారైంది గుడియాత్తంలోనే

» తయారు చేసింది చేనేతలో చేయి తిరిగిన వెంకటాచలం



జాతీయ పతాకం తయారుచేసిన వెంకటాచలం దంపతులు

వేలూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జాతీయ జెండాను రూపొందించింది పింగళి వెంకయ్య. మరి ఎర్రకోటపై ఎగిరిన తొలి జాతీయ పతాకం సిద్ధం చేసింది చేనేత వృత్తిలో చేయి తిరిగిన వెంకటాచలం, మునిరత్నమ్మాళ్ దంపతులు. చేనేతకు ప్రసిద్ధి చెందిన వేలూరు జిల్లా గుడియాత్తంలో దీనిని తయారు చేశారు. గుడియాత్తం మున్సిపాలిటీ అధ్యక్షుడిగా 1932 నుంచి 10 సంవత్సరాల పాటు బాధ్యతలు నిర్వర్తించిన వెంకటాచలం చేనేత మెళకువల గురించి తెలుసుకున్న అధికారులు... పింగళి వెంకయ్య రూపొందించిన మేరకు జాతీయ పతాకాన్ని తయారు చేయాలని కోరారు. 12 అడుగుల వెడల్పు, 18 అడుగుల పొడవుతో మూడు జాతీయ పతాకాలను భార్య మునిరత్నమ్మాళ్‌తో కలసి వెంకటాచలం తయారుచేశారు. వీటిలో ఒకటి 1947 ఆగస్టు 15వ తేది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీ ఎర్ర కోటపై ఎగురవేశారు. మరొకటి చెన్నై జార్జ్‌కోటపై ఎగురవేశారు. ప్రస్తుతం ఆ పతాకం జార్జి కోట ప్రాంగణంలోని పురావస్తు పరిశోధనశాఖ మ్యూజియంలో అద్దాల పెట్టెలో భద్రంగా వుంది. ఆ రోజున దేశవ్యాప్తంగా 10 లక్షల జెండాల తయారీ కోసం గుడియాత్తం నగరానికి ఆర్డర్లు వచ్చినట్లు చరిత్ర చెబుతోంది. వెంకటాచలంను మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, మాజీ ముఖ్యమంత్రి కామరాజ్ అభినందించారు. నాటి ప్రధాని నెహ్రూ వ్యక్తిగత కార్యదర్శి వెంకటాచలంకు కృతజ్ఞతలు తెలుపుతూ రాసిన లేఖ ఇప్పటికీ వెంకటాచలం కుటుంబీకుల వద్ద వుంది.




స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామానికి చెందిన విద్యార్థిని భద్రిరాజు లక్ష్మీ సుప్రజా పార్వతి రూపొందించిన చిత్రమిది. గుత్తుపూల చెట్టు ఆకుపై జాతీయ జెండా పట్టుకున్న జవాన్ చిత్రంతో వినూత్నంగా తన దేశభక్తిని చాటుకుంది పార్వతి.

స్వాతంత్ర్య దినోత్సవ వెలుగుల్లో..



ప్రకాశం బ్యారేజ్ నుంచి దిగువకు ప్రవహిస్తున్న కృష్ణమ్మ



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ధగధగలాడుతున్న ఉండవల్లి గుహలు



అమరావతిలోని సచివాలయం..

సురక్షితంగా అమరావతి





ఆలిండియా సర్వీసెస్ ఉద్యోగుల భవనాల వద్ద పరిస్థితి, జీఏడీ టవర్ వద్ద.. (ఇన్‌సెట్)

» భారీ వర్షాల ప్రభావం అంతంతే

» యథాతథంగా సాగుతున్న రాకపోకలు

» కొనసాగుతున్న రాజధాని నిర్మాణ పనులు

» వర్షాలకు రాజధాని మునిగిపోయిందంటూ సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం

(గుంటూరు-ఆంధ్రజ్యోతి)

అవునా..? రాజధాని అమరావతి మునిగిపోయిందా? రెండు రోజుల పాటు కురిసిన వర్షాలకే ముంపునకు గురైందా? సోషల్ మీడియాతో పాటు జగన్ రోతపత్రిక ఇలా దుష్ప్రచారం చేస్తున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే.. అమరావతిలో కీలక ప్రాంతాలన్నీ సురక్షితంగా ఉన్నాయి. యథాతథంగా రాకపోకలు కొనసాగుతున్నాయి. రాజధాని నిర్మాణ పనులూ జరుగుతున్నాయి. రాజధాని పరిధిలోని కృష్ణాయపాలెం, మందడం, నేలపాడు, లింగాయపాలెం, వెలగపూడి, రాయపూడి, దొండపాడు, ఉద్దండరాయునిపాలెం సహా అన్ని ప్రాంతాలు అత్యంత సురక్షితంగా ఉన్నాయి. వర్షాలకు సాధారణంగా వచ్చే నీటి మడుగులు తప్ప మరింకేమీ లేవు. పంటపొలాల్లో సైతం నీరు నిలవలేదు. కోర్ క్యాపిటల్‌లో ప్రస్తుతం కార్యకలాపాలు నిర్వహిస్తున్న, రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న అన్ని భవనాల వద్ద, రహదారుల వద్ద అక్కడక్కడ నీరు నిలిచిన జాడలు తప్ప మునిగిపోయిన దాఖలాలు కనిపించలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పనులు చేపట్టిన కోర్ క్యాపిటల్ వద్ద 'ఆంధ్రజ్యోతి' క్షేత్ర స్థాయిలో పర్యటించింది.అమరావతిలో నుంచి ప్రవహించే కొండవీటి వాగు తాడికొండ దగ్గర కట్ట తెగి పంటపొలాలపై విరుచుకుపడింది. కానీ అమరావతిలో ఆ ప్రభావం ఎక్కడా కనిపించలేదు.

సీఆర్డీఏ కార్యాలయంలో..

రాజధానిలోని సీడ్ యాక్సిస్ రోడ్డు, ఏపీ సీఆర్డీఏ కార్యాలయం వద్ద చుక్కనీరు కూడా లేదు. గురువారం కార్మికులు చక్కగా పనులు కూడా చేసుకుంటున్నారు. సీఆర్డీఏ భవనానికి ఎదురుగా నిర్మిస్తున్న నాలుగు నిర్మాణాల వద్ద కూడా నీరు నిలవలేదు. నేలపాడు జంక్షన్‌లో నిర్మిస్తున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల భవన సముదాయం వద్ద కూడా చుక్క నీరు నిలవలేదు. సీడ్ యాక్సిస్ నుంచి హైకోర్టుకు వెళ్లే రహదారి, ఆ రోడ్డుకు పక్కనే నిర్మిస్తున్న మంత్రుల భవనాలు, జడ్జిల నివాసాల వద్ద కూడా ఎక్కడా నీరు నిలవలేదు. ప్రస్తుత హైకోర్టు వద్ద చుక్క నీరు కూడా నిలవలేదు.

ఐకానిక్ బిల్డింగ్‌ల వద్ద..

నేలపాడులో ఐకానిక్ హైకోర్టు, జీఏడీ, సెక్రటేరియట్ టవర్ల వద్ద కూడా వర్షపునీటి ప్రభావం కనిపించలేదు. టవర్ 1, టవర్ 2ల వద్ద గండి పడటంతో పొలాల్లో నుంచి వచ్చే నీరు రాఫ్ట్ ఫౌండేషన్‌ను ముంచేసింది. ప్రస్తుతం అక్కడ గండిని పూడ్చే పనులు చేస్తున్నారు.ఐకానిక్ అసెంబ్లీ నిర్మించే ప్రాంతంలో కూడా నీరు నిలవకపోవడం విశేషం. ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శుల భవనాల వద్ద కూడా పనులకు ఏ ఆటంకమూ కలగలేదు. రాజధానిలో రహదారుల నిర్మాణ పనుల్లో మాత్రం స్వల్పంగా నీరు చేరడంతో పనులకు ఆటంకం కలిగింది. హైకోర్టుకు వెళ్లే రోడ్డుపై ఒక్క చోట మాత్రం స్వల్పంగా నీరు నిలిచింది. రాకపోకలకు ఎలాంటి ఆటంకమూ వాటిల్లలేదు.



ఎమ్మెల్యే క్వార్టర్ల వద్ద స్పష్టంగా కనిపిస్తున్న రోడ్డు

అభిమానులపై జగన్ ప్రైవేట్ సెక్యూరిటీ పిడిగుద్దులు

» ఆస్పత్రి పాలైన మహిళ



జగన్ దగ్గరికి వస్తున్నవారిపై పిడిగుద్దులు కురిపిస్తున్న బౌన్సర్లు

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని చూసేందుకు వచ్చినవారిపై ఆయన ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది(బౌన్సర్లు) పిడిగుద్దులు కురిపించారు. అనంతపురం జిల్లా కేంద్రంలో గురువారం మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి కుమారుడి వివాహానికి జగన్ హాజరయ్యారు. కల్యాణమండపంలోకి జగన్ వెళ్తున్న సమయంలో ఆయనను దగ్గర నుంచి చూసేందుకు, కరచాలనం చేసేందుకు కొందరు రోప్ పార్టీని దాటుకొని దూసుకొచ్చారు. తోపులాట చోటుచేసుకోవడంతో బౌన్సర్లు జనంపై పిడిగుద్దులు కురిపించారు. దీంతో అంజలి అనే మహిళ అస్వస్థతకు గురై కింద పడిపోయారు. ఆమెను ఆస్పత్రికి తరలించారు. అభిమానులపై బౌన్సర్లు దాడి చేస్తున్నా జగన్ వారించకపోవడం గమనార్హం. కాగా, జగన్ వస్తుండటంతో వైసీపీ నాయకులు లారీలలో జనాలను తరలించారు.

దివ్యాంగ విద్యార్థికి లోకేశ్ అండ

» ప్రత్యేక జీవో ద్వారా ఇంటర్ సవరణ మార్కుల మెమో

» 'నీట్' ర్యాంకర్‌కు తొలగిన మెడికల్ సీటు అడ్డంకి

» మంత్రికి ధన్యవాదాలు తెలిపిన విద్యార్థి తల్లిదండ్రులు

తిరుపతి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నీట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించినా.. ఇంటర్‌లో తప్పనిసరిగా ఇంగ్లిష్ సబ్జెక్టు చదివి ఉండాలనే నిబంధన కారణంగా మెడికల్ సీటు కోల్పోనున్న దివ్యాంగ విద్యార్థికి విద్యా శాఖ మంత్రి లోకేశ్ అండగా నిలిచారు. తిరుపతికి చెందిన ఆ విద్యార్థి తల్లిదండ్రుల విజ్ఞప్తిపై తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించారు. గతంలో పాతిక మంది దివ్యాంగ విద్యార్థులకు ఇంటర్‌లో ఇంగ్లిష్ సబ్జెక్టులో కనీస మార్కులు 35 కలుపుతూ జారీ చేసిన ప్రత్యేక జీవో ద్వారానే.. తాజాగా బైపీసీ విద్యార్థి హరిహర బ్రహ్మారెడ్డి విషయంలోనూ చర్యలు తీసుకున్నారు. మంత్రి కార్యాలయం నుంచి అందిన సమాచారంతో విద్యార్థి తల్లిదండ్రులు గురువారం హుటాహుటిన ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయానికి చేరుకోగా.. అక్కడ వారికి కనీస మార్కులు కలిపిన కొత్త మార్కుల మెమో అందజేశారు. మెమోను ఈనెల 20 లోపు కౌన్సిలింగ్ కోసం అప్‌లోడ్ చేయాల్సి ఉంది. రెండో విడతలో తన కుమారుడికి ఏపీలోనే ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు దక్కే అవకాశముందని తండ్రి ప్రతాప్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంగ్లిష్ 'మినహాయింపు' ఆప్షన్‌తో..

దాసరెడ్డి హరిహర బ్రహ్మారెడ్డి ఇంటర్ బైపీసీ ఇంగ్లిష్ మీడియంలో చదివాడు. దివ్యాంగ విద్యార్థులకు ఇంటర్‌లో ఫస్ట్ లేదా సెకండ్ లాంగ్వేజీ కింద ఇంగ్లిష్‌ను ఎంచుకోకుండా మినహాయింపు ఉంది. వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ యూజీ పరీక్షలో దివ్యాంగ కేటగిరీలో 1,174వ ర్యాంకు సాధించిన బ్రహ్మారెడ్డికి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు లభించే అవకాశముంది. తొలి రౌండ్‌లోనే అతనికి తెలంగాణలోని నల్గొండ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు ఖరారైంది. అయితే నీట్ నిబంధనల ప్రకారం ఇంటర్‌లో ఫస్ట్ లేదా సెకండ్ లాంగ్వేజీ కింద ఇంగ్లిష్ సబ్జెక్టు తప్పనిసరి. మార్కుల జాబితాలో ఫస్ట్ లాంగ్వేజీ కాలమ్‌లో మార్కులకు బదులు ఆంగ్ల అక్షరం "ఇ" అని వుండడంతో మెడికల్ సీటు కోల్పోతామని విద్యార్థి, తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. మంత్రి లోకేశ్‌ను ఆశ్రయించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.